ఈ నెలలో...

కథలు (మాసపత్రిక) Dec - 1979

4. రహస్యపు నిధి—యం. దుర్గావతి.

35. చావుకోసం ఎదురుచూడు—ప్రతాప రవిశంకర్.

47. నేరస్థుడికి సన్మానం—వసుంధర.

63. దోపిడి—వి. మధుసూదన్.

91. టైంబాంబ్—కృష్ణ చైతన్య.

98. పసివాని పగ—వాణిశ్రీ.

121. సజీవచిత్రాలు—యస్. యస్. శాస్త్రి.

135. నమ్మకండి! దెయ్యాలు లేవు—'కవి'.

169. సీక్రెట్ గ్యాంగ్ (సీరియల్)—'సికిందర్'

నవలలు (సప్లిమెంట్)

3. మూడార్ల గూఢచారి—సికిందర్.

64. శనివారం రాత్రి అతిథి—వి. యస్. చెన్నూరి.

112. హత్యచేయని హంతకుడు—వసుంధర.

153. మొండిశవం—వాణిశ్రీ.

198. అడుగు ముందుకువేస్తేచస్తావ్ (సీరియల్)—వసుంధర.

ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, రచయితలతో ముఖాముఖి, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, పాఠకుల పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

రహస్యపు నిధి

యం. దుర్గావతి

"యస్, ఇప్పుడు చెప్పండి" తాపీగా సిగరెట్ వెలిగి
చటం పూర్తి చేశాడు డిటెక్టివ్ ధూర్జటి కుమార్
"నాపేరు మానస. నేను మణిలాల్ అండ్ శ్యామాలాల్

కంపెనీలో స్టెనోగా పనిచేస్తున్నాను. మా అమ్మగారు నా చిన్నతనంలోనే పోయారు. ఆ బెంగతో మా నాన్నగారు యిల్లు వదలి వెళ్ళిపోయారు. నేను చిన్నప్పటినించి ఆయాల సంరక్షణలో పెరిగినా పిన్ని, బాబాయ్ దగ్గరే వుంటూ వచ్చాను. మా బాబాయ్ పెద్ద బిజినెస్ మేగ్నట్. పేరు గోపాలరావుగారు. మీరు వినే వుండచ్చు," అంది తలెత్తి అతనివంక చూస్తూ.

"అవును విన్నాను. చెప్పండి."

"మాంబళంలో మాకు పెద్ద బిల్డింగ్ వుంది. రోజులు బాగానే గడచిపోతున్నాయి. నాలుగు రోజులనాడు పోస్ట్‌లో వొక ఉత్తరం వచ్చింది. అది మా నాన్నగారు వ్రాశారు. ఇదిగో చూడండి," అంటూ పర్సులోంచి కవరుతీసి యిచ్చింది మానస.

"చిరంజీవి మానసను ఆశీర్వదించి వ్రాయునది.

నేను నీ చిన్నతనంలోనే మీ అమ్మపోయిన బెంగతో యిల్లు వదలి వెళ్ళిపోయాను. చాలా చోట్లు తిరిగాను. ప్రపంచంలో దేనికయినా ముందు డబ్బు ముఖ్యం అని తెల్సుకున్నాను. అది సంపాదించటంలో మునిగిపోయాను.

ఇప్పుడు నా దగ్గర అంతులేని ధనం, అంతకంటే కోట్లు విలువచేసే వజ్రాలు, వైఢూర్యాలూ ఉన్నాయి. అవన్నీ ఒక రహస్య స్థలంలో దాచిపెట్టాను. పదితరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి. ఇదంతా నా కన్నబిడ్డవైన నీకు చెందాలని నా ఆరాటం.

నేను నీకు పితృప్రేమను పంచి యివ్వలేకపోయినా ఈ సంపదను నీకు అప్పగిస్తున్నాను. దాని తాలూకు వివరాలు నీకు రెండురోజుల్లో పంపుతాను. ఆ ప్లాను బహు జాగ్రత్తగా, అతి రహస్యంగా కాపాడు. ఈ రహస్యం నీకు

నాకూ తప్ప యెవ్వరికీ తెలియకూడదు. నేను త్వరలో నిన్ను కలుసుకుంటాను. ఈ విషయం నీ గుండెల్లో దాచుకో.

నీ తండ్రి,
సురేంద్రనాథ్."

ఉత్తరం చదవటం ముగించి సాలోచనగా తల పంకించాడు ధూర్జటి.

"మరి ఆ ప్లాను కాగితం మీకు అందిందా?"

"మొన్న పోస్టులో వచ్చింది. దాన్ని జాగ్రత్తగా ఎవ్వరికీ తెలయనిచోట దాచాను. కానీ మూడురోజుల నుంచీ నన్ను ఎవరో ఆగంతకుడు వెంబడిస్తున్నాడు. మీ దగ్గరకి వచ్చేముందు సందు మొదట్లో ఎదురయ్యాడు. ఎట్లాగో తప్పించుకుని వచ్చేశాను" అంది కర్చీఫ్‌తో నుదుట పట్టిన చెమటని వత్తుకుంటూ.

"అతను ఎట్లా వున్నాడు?" అని అడిగాడు ధూర్జటి.

"వయసు సుమారుగా నలభై వుండచ్చు. బ్లాక్ పాలియస్టర్ డ్రస్ వేసుకున్నాడు. నల్లటిఫెల్టు హేట్, కళ్ళకు గాగుల్సు, కుడిబుగ్గన చిన్న ఉలిపిరికాయ, మనిషి నల్లగా మీసాలతో చాలా భయంకరంగా వున్నాడు. ఉదయం, సాయంత్రం ఆఫీసుకు వచ్చి వెళ్ళేటప్పుడు నన్ను వెంబడిస్తోన్నాడు. నాకు చాలా భయంగా వుంది.

నేను ఒకతన్ని ప్రేమించాను. పేరు రామక్రిష్ణ. సెంట్రల్ బేంక్‌లో ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అతనికి మాత్రం ఉత్తరం విషయం చెప్పాను. అతను వాళ్ళ మదర్‌కి హెల్తు బాగుండటంలేదని నిన్న ఉదయం వరంగల్ వెళ్ళాడు. బహుశా నాలుగురోజుల్లో తిరిగి వస్తాను అని చెప్పాడు. కొద్ది రోజులలో మేం యిద్దరం పెళ్ళి

చేసుకోవాలని నిశ్చయించుకున్నాం. మా పెళ్ళి సవ్యంగా జరుగుతుందా అని అనుమానంగా వుంది. నన్నీ వూబి లోంచి బయటకులాగి రక్షించండి. మీ ఫీజు ఎంతయినా సరే యిచ్చుకుంటాను" అంది జేలగా మానస.

"డోంట్ వర్రీ....మీకేం ఫర్వాలేదు. ఆ అగంతకుడు మిమ్మల్ని యే రోజునుంచీ వెంటాడు తున్నాడో చెప్ప గలరా?"

"సరిగ్గా మా నాన్నగారినుండి ప్లాన్ కాగితం వచ్చిన రోజు సాయంత్రం నుంచే. మొదట్లో అంతగా నేను గుర్తించలేదు."

"మీకు వచ్చిన ప్లాన్ కాగితం జాగ్రత్తగా దాచారా?"

"చాలా జాగ్రత్తగా దాచాను. మీకు తెచ్చి యిమ్మం టారా?"

"అవసరం లేదు. రేపు వుదయం నేనే మీ యింటికి వస్తాను. నన్ను మాత్రం మీ ఇంట్లోవాళ్ళకి ఫ్రెండుగా పరిచయం చెయ్యండి చాలు. మీకేం భయంలేదు. అనవస రంగా బయట తిరక్కండి. మీ జాగ్రత్తలో మీరుండండి. మరి కాసేపట్లో నేను హైదరాబాద్ వెళ్ళాలి. రేపు వుద యానికల్లా తిరిగి వస్తాను."

"మరి మీ ఫీజు విషయం?"

"కేసు పూర్తి అయ్యాకే తీసుకుంటాను."

లేచి విష్‌చేసి శలవు తీసుకొని వెళ్ళిపోయింది మానస.

2

ఉదయమే పోలీస్‌జీప్ మాంబళంలోని ప్రముఖ బిజినెస్ మేగ్నట్ గొపాలరావుగారి భవంతిముందు ఆగింది. ఇన్ స్పెక్టర్ వేణుగోపాల్, డాక్టర్ ముఖర్జీ, పోలీస్ పరివారం ఫింగర్ ప్రింటర్స్, ఫోటోగ్రాఫర్సూ అంతా దిగారు.

"రండి బాబూ రండి" అంటూ హత్య జరిగిన స్థలానికి తీసికెళ్ళాడు నౌకరు ధర్మన్న.

హాలు మధ్యగావున్న మెట్లమీదనుంచి పైకి వెడితే వరుసగా నాలుగు గదులు. వాటికి ఎదురుగావున్న మరో నాలుగు గదులలో చివరిగది మానసది.

గదిలో మంచానికి అడ్డంగా పడివుంది మానస నిర్జీవ శరీరం. తుపాకిగుండు కంఠంలో తగలటంవలన కాటోలు రక్తంతో మెడంతా తడిసిపోయింది. ఎడంచెయ్యి మంచం వెనుకనుంచి కిందకి వేళ్ళాడుతోంది. కుడిచెయ్యి గుప్పిట కొంచెం మూసివుంది.

డాక్టర్ శవపరీక్ష ముగించి, రాత్రి రెండు గంటల సమయంలో ప్రాణం పోయినట్లు చెప్పాడు. ఫొటోగ్రాఫర్ వివిధ కోణాల్లోంచి ఫోటోలు తీస్తున్నాడు. ఫింగర్ ప్రింటర్స్ తమ పని కానిస్తున్నారు.

గోపాలరావుగారి ముఖం చాలా దీనంగా ఉంది. ఇన్స్పెక్టరు ముందు హాల్లో అందర్నీ ప్రశ్నిస్తున్నాడు.

అదేసమయంలో ప్రవేశించారు డిటెక్టివ్ ధూర్జటి కుమార్, అతని అసిస్టెంట్ ప్రభాకర్.

అతన్ని చూడగానే మందహాసంగా నవ్వాడు ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, "ఊరక రారు మహాత్ములు-అప్పుడే మీదాకా వచ్చిందీవార్త" అంటూ.

అతని వంక చిరునవ్వు విసిరాడు ధూర్జటి.

"పరీక్షలన్నీ పూర్తి అయినట్లేగా. నేను గదిలోకి వెళ్ళి ఒకసారి శవాన్ని చూడచ్చా," అన్నాడు.

"అందుకు అభ్యంతరమా। వెళ్ళిరండి" అని తన పనిలో మునిగిపోయాడు వేణుగోపాల్.

గదిలోకి వెళ్ళి శవాన్ని పరికించటంలో నిమగ్న

మమ్మాయడు ధూర్జటి.

మానసను చూస్తే జాలి కలిగింది అతనికి. పాపం నిన్న ఉదయం ఇదే సమయానికి తన సహాయం అర్థించింది. ఇంతలోనే ఇట్లా జరగటం ఆశ్చర్యంగా ఉంది.

గది అంతా చిందరవందరగా ఉంది. హంతకుడు దేని కోసమో వెదికినట్లు స్పష్టంగా తెలుస్తోంది. కుడివైపు మూలగా ఉన్న టీపాయ్‌మీద ఫ్లవర్ వాజ్ క్రిందికి దొర్లి పడివుంది. బహుశా హంతకుడు ప్లాన్ కాగితం కోసం గాలించివుంటాడు.

మరికాస్త దగ్గరకు జరిగి శవాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు ధూర్జటి. ఉన్నట్లుండి అతడి కళ్లు మెరిశాయి. ఒంగి వాటిని తీసుకుని జేబులో వేసుకున్నాడు ఎవరూ చూడకుండా.

హతురాలి కుడిచేయి గోళ్లు ఎర్రగా తడిసి ఉన్నాయి. ఎవరితోనో పెనుగులాడినపుడు గీరినట్లు గోళ్లనిండా రక్తంతో తడిసిన మాంసం ఉంది.

వేణుగోపాల్ తన పని ముగించుకుని అప్పుడే అక్కడికి వచ్చాడు.

"మీకేం అన్పిస్తోంది ధూర్జటిగారూ," అని ప్రశ్నించాడు.

"హతురాలు చనిపోయేముందు యెవరితోనే పెనుగులాడింది. ఆ పోరాటంలో హంతకుడి శరీరంలోని మాంసం ఆమె గోళ్ళల్లో నిండుకుంది. మొదట్లో ఆమెను పీకనొక్కి చంపి ఉండాలి. పిస్టల్‌తో కాల్చే ఉద్దేశ్యం వుంటే ఆమెతో పోరాడాల్సిన అవుసరం లేదు. లేదా తప్పుదారి పట్టించటానికి ముందు చంపేసి ఆ తర్వాతనైనా గుర్తులు దొరక్కుండా చెయ్యటానికి పిస్టల్‌తో కాల్చి ఉండాలి.

రక్తంతో తడిసి ఉండటంవల్ల మెడమీద కమిలిపోయిన గుర్తులు స్పష్టంగా కనిపించటం లేదు. పైగా ముఖం అంతా పీక్కుపోయి, కంఠం ఉబ్బినట్లుంది,"

"నో నో....ఇది మామూలు హత్యే. హంతకుడు పిస్టలుతో కాల్చాడు. కేసు తప్పుదారి పట్టించేందుకు ఆమె గోళ్ళకు యెర్ర రంగు పూశాడు. దాన్ని మీరు అనుమానాలతో మరో వైపునుంచి ఆలోచిస్తున్నారు. ఇంతవరకూ వేలు ముద్రలు కన్పించకుండా జాగ్రత్త పడ్డాడు. మూసిన తలుపులు మూసినట్లుగానే ఉన్నాయి. లోపల మేము వచ్చాకే తలుపులు పగలకొట్టాం. పనిమనిషి హతురాలు యెంతలేపినా లేవకపోతే కిటికీలోంచి చూసి గట్టిగా అరిచిందిట. హంతకుడు బైటనుంచి కిటికీగుండా కాల్చటమే కరెక్ట్" అన్నాడు కేసువిడిపోయినంత తేలిగ్గా.

"మీరన్నది నిజమే అనుకోండి. కానీ హంతకుడు దేనికోసమో గదంతా వెదికినట్లు లేదూ. నా ఊహనుబట్టి హంతకుడు లోపలికి వచ్చాడు. ఆమెను హత్యచేసి గదంతా వెదికాడు." అన్నాడు ధూర్జటి.

"ఒకవేళ హతురాలు ఆ వస్తువు కన్పించక ఇల్లంతా వెతుకుతుంటే హత్య జరగవచ్చుగా?"

"నో అట్లా జరగటానికి వీల్లేదు. ముందు హతురాలి గోళ్ళలోని రక్తమాంసాలు నిజమైనవే అని రిపోర్టులో తేలితే ఆ గది వెతికింది తప్పకుండా హంతకుడే అవుతాడు."

"ప్చ ...ఉన్నవి లేనట్లు ఊహించడం మీ డిటెక్టివ్లకు అలవాటేగా....కానీ యెవరి పిచ్చి వారికానందం. అయినా ట్రైచెయ్"

మరోసారి గదంతా గాలించాడు ధూర్జటి. హంత



కుడు సరాసరి కాకుండా కుడివైపు బయటి కిటికీలోంచి పిస్టల్‌తో కాల్చి ఉండాలి. హతురాలికి ఇంత దగ్గరగా నిలబడి కాల్చటం అసాధ్యం. అలా జరిగితే అంతకుముందే హతురాలితో పెనుగులాడి బైటికి వెళ్ళి అయినా కాల్చి ఉండాలి. లేనిపక్షంలో హంతకుడి తాలూకు మనిషి గదిలో ఉండి వుండాలి. హత్యా వివరాలు ఇంకేవిధమైన ఆధారాలు మచ్చుకు కూడా కన్పించటంలేదు.

"శవాన్ని పోస్టు మార్టమ్‌కి పంపాలి. మీరుకూడా వెళ్ళి గోపాలరావుగార్ని ఒకసారి కలవండి" అంటూ శవాన్ని తరలించే యత్నంలో ఉన్నాడు ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్.

హాల్లోకి నడిచాడు ధూర్జటి. అతన్ని అనుసరించాడు ప్రభాకర్.

3

హాల్లో సోఫాలో దీనంగా కూర్చున్నారు గోపాలరావు

గారు. మొహం అంతా జేవురించి యెర్రబారిన కళ్ళతో చాలా భయంకరంగా ఉంది. పెద్ద పంచె, ఖరీదైన టెర్లిన్ లాల్చీ ధరించారు. తలంతా నెరిసి ముగ్గు బుట్టలా ఉంది. వయసు దాదాపు యాభై సంవత్సరాల పైనే ఉండచ్చు.

"క్షమించాలి, సందర్భం యెలాంటిదైనా మిమ్మల్ని కొన్ని వివరాలు అడిగి బాధపెట్టక తప్పటం లేదు. ఆమెను మీరు ఆఖరిసారిగా యెప్పుడు చూశారు?"

"ప్రతిరోజు రాత్రి నేను పదకొండు దాటితేనే కానీ నిద్రపోను. నిన్నరాత్రి మామూలుగా పదిగంటలకు ఇల్లు చేరాను. అమ్మాయి నాతోబాటే భోజనం చేసింది. అంతే. మేం ఇద్దరం కల్సుకోవటం భోజనాల దగ్గరే. అమ్మాయి ఆఫీసునుంచి రాగానే సినిమాకో, షికారుకో వెడుతుంది. ఆమె స్వేచ్ఛకి అడ్డుచెప్పటం నా అభిమతం కాదు. ఒక్కగానొక్క పిల్ల. కన్నబిడ్డకంటె ఎక్కువగా చూశాము" అంటూంటే ఆయన కళ్ళు అశ్రువులతో నిండిపోయాయి.

"రాత్రి భోజనాల మధ్యలో మానస ఏం మాట్లాడ లేదా?" సూటిగా ఆయనవంకే చూస్తూ అడిగాడు ధూర్జటి.

"ఆఫీసులో ఎవరో బలవంతపెడితే హిందీ సినిమాకు వెళ్ళానని, దాంట్లో ఎవరు బాగా నటించారో చెబుతోంది. నేను ఎప్పుడూ సినిమా చూడను. అందువల్ల ఆ.... ఊ అనటంతప్ప నేనేం అడగలేదు. భోజనం ముగించి నేను నా గదిలోకి వెళ్ళి పడుకున్నాను. అంతే. పైగా రాత్రులు నాకు నిద్రపట్టదు సరిగ్గా. అందుకని స్లీపింగ్ టాబ్లెట్ వేసుకుని పడుకుంటాను. ఉదయం పనిమనిషి అరుపులు విని మేలుకున్నాను."

"మీ ఇంట్లో ఎంతమంది ఉన్నారు?"

"నేను, నా భార్య శాంతాదేవి, ఆమె చెల్లెలు చిత్ర, మా అక్కగారి అబ్బాయి ప్రభు, డ్రయివరు, వంటమనిషి నాయరు, పనిమనిషి కనకం, నౌకరు ధర్మన్న. ఇంట్లో అంతకుమించి ఎవరూలేరు."

"మీరువెళ్ళి శాంతాదేవిగారిని ఒకసారి పంపండి," అన్నాడు ధూర్జటి.

"అసలే బిడ్డపోయిన దుఃఖంలోవుంది. ప్రశ్నలు వేసి ఆమెను మరింత బాధ పెట్టటం సమంజసం కాదు" అన్నా రాయన.

"వివరాలు తెల్సుకోవటం మా ధర్మం. హంతకుడిని పట్టుకోవాలంటే అందరి సహకారం అవసరం."

"అలాగే" అంటూ వెళ్ళిపోయారు ఆయన.

ఐదు నిమిషాలకు వచ్చింది శాంతాదేవి.

ఎదురుగావున్న సోఫాలో కూర్చుంది. కళ్ళు ఏడ్చినట్లు ఎర్రగా ఉబ్బివున్నాయి. మనిషికి నలభై సంవత్సరాలున్నా చూట్టానికి ముప్పయి సంవత్సరాల యువతిగా తెల్లగా నాజూగ్గా వుంది. ఎర్రటి కెంపురంగు కాష్మీర్‌చీర కట్టుకుంది. షాల్ తలమీదనుంచి కప్పుకోవటంవల్ల మిగిలిన వివరాలకు అంతరాయం కల్గుతోంది.

"మానస మీకు కన్నకూతురేనా?" ఆమెవంక సూటిగా చూస్తూ అడిగాడు. ఆమె కళ్ళలోంచి నీళ్ళు వొక్కసారిగా చిప్పిల్లాయి. పదినిమిషాలవరకూ వెక్కి వెక్కి ఏడ్చింది. ఎంతయినా ఆమెది పెంచిన ప్రేమ.

"క్షమించండి, ఇంత విచారంలో వున్న మిమ్మల్ని శ్రమపెట్టటం తప్పలేదు. ఆఖరిసారిగా మీ అమ్మాయిని మీరు యెప్పుడు చూశారు?"

తల పైకెత్తి ధూర్జటివంక ఒకసారి పరిశీలనగా చూపి

చెప్పసాగింది శాంతాదేవి.

"నిన్నరాత్రి మాతో కలిసే భోజనం చేసింది. ఏదో సినిమాకి వెళ్ళి వచ్చానని చెప్పింది. భోజనం అయ్యాక ఎవరి గదుల్లోకి వాళ్ళం వెళ్ళిపోయాం. ఉదయం పని మనిషి కేకలతో మెలకువ వచ్చింది."

గోపాలరావుగారు చెప్పిందీ, ఈమె చెప్పిందీ ఒక్కటిగానే వుంది.

"కొద్ది రోజులుగా ఆమెలో ఏదైనా మార్పు, ఐమీన్, అంటే భయపడుతున్నట్లుకానీ, ఖంగారుపడుతున్నట్లుగానీ కన్పించిందా?"

"లేదే ఎప్పటిలాగే చలాకీగానే వుంది."

"ఈ ఇంట్లో మీరు, మీవారు కాకుండా ఇంకా ఎవరు వుంటున్నారు?" పరీక్షగా ఆమెనే చూస్తూ అడిగాడు ధూర్జటి.

"మేం కాక మా చెల్లెలు చిత్ర, వారి మేనల్లుడు ప్రభు, వంటచేసే నాయరు, డ్రైవరు, పనిమనిషి కనకం, నౌకరు ధర్మన్న. అంతే."

"మీ అమ్మాయికి స్నేహితులుగానీ, శత్రువులుగానీ ఎవరైనా వున్నారా?"

"స్నేహితులు అంతగా లేరు. అది ఎవ్వరితోనూ ఎక్కువ స్నేహం చెయ్యదు. దాని సంగతి దానిదే తప్ప ఇతరులని అంతగా పట్టించుకునే స్వభావం కాదు. ఇక శత్రువులంటారా నాకు తెల్సినంతవరకూ ఎవరూ లేరు. బైటి విషయాలు నాకు తెలియదు. ఈ మధ్య ఎవరో రామ కృష్ణ అనే అబ్బాయి నాలుగైదు సార్లు మా ఇంటికి వచ్చాడు."

"మీకు పిల్లలు ఎంతమంది?"

"నాకు అసలు పిల్లలు లేరు. మావారి అన్నగారు, భార్య చనిపోతే పిల్లను మా ఇంట్లో వదిలేసి వెళ్ళిపోయారు. అప్పటినుంచీ నేనే కన్నతల్లిలా పెంచాను," అంటూ, మరోసారి కళ్ళు తుడుచుకుంది శాంతాదేవి.

"మీ బావగారు ఎక్కడ వున్నారో మీకు తెలుసా?"

"తెలియదు. ఆయన వెళ్ళిపోయి ఇరవై రెండు సంవత్సరాలు అయిపోయింది. బ్రతికుంటే మానసకోసం తప్పకుండా వచ్చేవారే. బహుశా చనిపోయి వుంటారనే అనుకుంటున్నాం."

"మీ ఇంట్లో వుండేవాళ్ళల్లో ఎవరికైనా మానసను హత్యచేయటానికి అవకాశం వుండచ్చుకదా?"

సమాధానంకోసం ఒక్క నిముషం తడుముకుంది శాంతాదేవి.

"ఎంతమాత్రం లేదు. నాకు వారికీ మానసంటే ప్రాణం. కనకపోయినా మేం పెంచిన తల్లితండ్రులుగా దాన్ని హత్య చేయలేం. మా చెల్లెలు చిత్రకు మానసకు ఎలాంటి విరోధాలూ లేవు. అందువల్ల దానికి ఆ అవసరం అసలు లేదు. ప్రభు తెలివైనవాడు, మానసంటే అతనికేం ద్వేషంలేదు. ఈ హత్య అతను చేశాడంటే నేను నమ్మను. ఇక పనివాళ్ళు, అంటారా వాళ్ళకా అవసరం అసలే లేదు. చీమకి కూడా అపకారం చేయని మానసను ఇలా ఎవరు హత్య చేశారో నాకే అర్థం కావటంలేదు."

"సరే, మీరు వెళ్ళి మీ చెల్లెలు చిత్రగారిని పంపండి?"

లోపలకి వెళ్ళిపోయింది శాంతాదేవి.

మరో రెండు నిమిషాలకు ఒక యువతి లోపలినుంచి విసురుగా వచ్చింది.

"కూర్చోండి. మీ పేరు?"

ఆమె వయసు ఇరవై ఐదు సంవత్సరాలుంటాయి. ముఖంలో శాంతాదేవి పోలికలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. సన్నగా పొడుగ్గా వుంది. ముఖం కోలగా వుండి చాలా ఆకర్షణీయంగా వుంది. ఆకుపచ్చ చీర, అదేరంగు జాకెట్ వేసుకుంది. మిగిలిన అలంకారాలన్నీ మేచింగ్‌కు సరి పోయాయి. మెళ్ళో వజ్రాల హారం తళతళా మెరుస్తోంది. ఓ పక్క హారానికి సన్నగా దారం ముడివేసిన గుర్తులు కనిపిస్తున్నాయి. చేతులమీద అక్కడక్కడ పౌడరు ముద్దలుగా అంటివుంది.

"మీ పేరు" ఆమె ఏం జవాబు చెప్పకపోవటంతో మరోసారి ప్రశ్నించాడు.

"చిత్ర."

"మీ చేతులుమీద ఆ పౌడరు ముద్దలు ఏమిటి?"

"నిన్న తోటలోకి వెళ్లాను. యాధాలాపంగా నడుస్తుంటే నిమ్మ కొమ్మలు గీసుకున్నాయి. రక్తం వచ్చింది. అందుకు పౌడరు పెట్టాను. మీ పరిశోధనకు ఈ వివరాలు అవసరమా?" ఆమె వైఖరిలో నిర్లక్ష్యం గోచరిస్తోంది.

"అవును చాలా అవసరం. శాంతాదేవిగారు మీకు ఏమవుతారు?"

"మా అక్క."

"మీరు ఇక్కడ వుండటానికి కారణం?"

"నా ఇష్టం," అంది దర్పంగా.

"మీరు అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పండి?" అన్నాడు.

ఏమనుకుందోగానీ....

"మా పేరెంట్స్ చనిపోయారు. అందువల్ల నేను మా

అక్క గారింట్లో వుంటున్నాను."

"ఐ. సీ. మీ స్వగ్రామం ఏది?"

"ఒంగోలు."

"మీరు ఎందాక చదువుకున్నారు?"

"లోకాన్ని అర్థం చేసుకునేదాకా."

"అబ్బో, చాలా చదివారు. చనిపోయిన మానస,మీరు ఎట్లా వుండేవారు! అంటే స్నేహంగా, చనువుగా వుండే వారా? విరోధంగా వుండేవారా?"

"నేను వుంటున్నది మా అక్క శాంతాదేవి గారింట్లో. అలాంటప్పుడు మానసతో స్నేహంగా, విరోధంగావుండే అవసరం నాకేమిటి?" అంది కోపంగా.

"ఆల్‌రైట్, మీరు మానసను ఆఖరిసారిగా ఎప్పుడు చూశారు?"

"నిన్న ఉదయం ఆఫీసుకు వెడుతుంటే."

"అప్పుడు ఆవిడ ఎట్లా వున్నారు?"

"మామూలుగానే వుంది."

"నిన్నరాత్రి మీరు మానసను చూశారా?"

"లేదు. నాకు పెందరాళే భోజనం చెయ్యటం అలవాటు. ఎనిమిది గంటలకే భోంచేసి నా గదిలో పుస్తకం చదువు కుంటూ పడుకున్నాను. ఉదయం ఈ చావు గోలతో లేచాను."

"రాత్రి అరుపులుకానీ, కేకలుకానీ, పిష్టల్ శబ్దంగానీ మీకు విన్పించిందేమో కాస్త గుర్తుచేసుకు చెప్పండి."

"నాకేం మతిమరుపులేదు. నాకేం విన్పించలేదు" అంది చిత్ర.

"సరే మీరు వెళ్ళి ప్రభుగారిని పంపండి" అన్నాడు

ధూర్జటి.

అందంగా వున్న ముప్పై సంవత్సరాల యువకుడు వచ్చి సోఫాలో కూర్చోబోతూ విష్ చేశాడు.

"మీ పేరు?"

"ప్రభు. నేను బి. కాం, పాసయ్యాను. తరచు మామయ్య వ్యాపార విషయాలు చూస్తూంటాను. మానస మా పెద్ద మావయ్య కూతురు. ఈ ఘోరం జరగి ఉండక పోతే మానసను నా కిచ్చి పెళ్లి చేస్తానని మామయ్య అంటూ వుండేవాడు. మీరు ఎట్లా అయినా మానస హత్యకు కారణమైన హంతకుడిని పట్టుకుతీరాలి సార్," అన్నాడు వినయంగా.

"అందుకేగా మా ప్రయత్నం. నిన్న ఆఖరు సారిగా మానసను ఎప్పుడు చూశారు?"

"నిన్న ఉదయం చూశాను, అంతే. రాత్రి సెకండ్ షో సినిమాకు వెళ్లాను. వచ్చాక నా గదికి వెళ్ళపోతుంటేపైన ఆమె గదిలో లైటు వెలగటం కన్పించింది. బహుశా ఏ పుస్తకం అయినా చదువుకుంటోందేమో అనుకున్నాను. ఎంతో అవసరం అయితే తప్ప ఎవ్వరితో మాట్లాడేది కాదు."

"మీరు సినిమా నుంచి వచ్చేసరికి టైము ఎంత అయింది?"

"నేను దగ్గర థియేటర్ కే వెళ్ళాను. బహుశా అక్కడి నుంచి యింటికి రావడానికి పదినిముషాలు టైము పడుతుంది. సరిగ్గా ఒకటీ, పదిహేను నిముషాలు అయింది. రాగానే నా గదిలోకి వెళ్లి బట్టలు మార్చుకుని పడుకున్నాను." అన్నాడు ప్రభు.

"మీరు ఇంట్లోకి వచ్చాక కానీ, ఆ తర్వాత కానీ



కేకలు, శబ్దాలు విన్పించాయా," అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు ధూర్జటి.

"లేదు. చిన్న సౌండ్ కూడా వినిపించలేదు."

"మీరేం అనుకోకపోతే, నిన్నటి సినిమా టికెట్ ఒక సారి చూపిస్తారా?" అని అడిగాడు.

ప్రభు జేబులోంచి తీసి ఇచ్చాడు.

ప్రభాకర్ అన్నీ నోట్ చేసుకుంటున్నాడు.

"మీరు వెళ్ళి ధర్మన్నను పంపించండి."

నమస్కారం చేసి వెళ్ళిపోయాడు ప్రభు. తలపాగా తీసి నమస్కారం చేసి, నిలబడ్డాడు ధర్మన్న.

"చూడు ధర్మన్నా, మీ అమ్మాయిగారు ఈ మధ్య ఏమైనా భయపడుతున్నట్లు కనిపించారా?"

ఒక నిమిషం ఆగి మెల్లగా తల పంకించాడు ధర్మన్న. నెమ్మదిగా తల గోక్కుంటూ "అవును బాబుగారూ! తవరు అంటే గేపకం వచ్చింది. ఆ రోజు వుత్తరాలాయన ఒక వుత్తరం అమ్మాయిగారికి ఇచ్చాడు. ఆ వుత్తరం చదివిన

కాడనుంచీ బాగా యిబ్బంది పడినట్లు అయ్యారు బాబూ. ఇల్లంతా ఏం తోచనట్లు తిరిగారు. పెద్దమ్మగారు అడిగితే ఏం లేదు అనేశారు."

"సీతో ఏమన్నా చెప్పిందా?"

"లేదు కానీ .... మళ్ళీ సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక ఆరి స్నేహితుడితో సికారు ఎల్లుతూ రగశంగా పిలిచి 'నాపేర ఏదైనా వుత్తరం వుంటే జాగరతగా తెచ్చి నాకే యివ్వు. ఈ ఇసయం ఎవరితో సెప్పమాక' అంటూ ఒక రూపాయి కూడా ఇచ్చారు బాబూ," అన్నాడు ధర్మన్న నిజాయితీ ఉట్టిపడే స్వరంతో.

"సరే కనకాన్ని పంపించు. ఈ మాటలు ఎవ్వరితోను చెప్పక," అని హెచ్చరించాడు ధూర్జటి.

"సరే బాబూ" అంటూ వెళ్ళిపోయాడు ధర్మన్న.

కనకం, నాయరు, డ్రైవరు కూడా సరైన ఇన్ఫర్మేషన్ ఏమీ యివ్వలేకపోయారు.

4

"ఫింగర్ ప్రింటర్స్ రిపోర్టునుపట్టి చూస్తోంటే వేలి ముద్రలు ఒకటి రెండుచోట్ల అలుక్కుపోయినట్లున్నాయి. డాక్టరు రిపోర్టు ప్రకారం రాత్రి రెండు మూడుగంటలమధ్య హత్య జరిగినట్లు తెలుస్తోంది. కంఠం నొక్కుతున్నప్పుడే వెనకనుంచి ఎవరో కాల్చారు. హతురాలి వేళ్ళకు అంటింది రక్తమేకాని రంగుకాదు. గోళ్ళలో నిండిన మాంసం గురించి ఇంకా ఏం తెలియలేదు" అన్నాడు ప్రభాకర్ కాగితాలు ధూర్జటికి ఇస్తూ.

"నిన్న మనం రాసుకున్న వివరాలు ఒకసారి విన్పించు" అన్నాడు ధూర్జటి.

(1) గోపాలరావు : ఆయన హత్య చేయటానికి యే

మాత్రం అవకాశంలేదు. హతురాలికీ ఆయనకీ మధ్య ఎలాంటి తగవులూలేవు. పైగా రాత్రి పడుకునేముందు నిద్రమాత్రలు వేసుకునే అలవాటువుంది. సురేంద్రనాథ్ రాసిన ఉత్తరం గురించి ఆయనకు అసలు తెలియదు కనక హత్యచేయటానికి అవకాశంలేదు.

(2) శాంతాదేవి: వయసులో గోపాలరావుగారికీ ఆవిడకీ తేడా బాగా కన్పిస్తోంది. చిన్నప్పట్నుంచీ మానసను కన్నతల్లిలాగే చూసింది. కానీ పరిశీలనగా చూస్తూవుంటే కళ్ళలో ఏదో భయం లీలగా మెదిలినట్లు అనుమానం. బహుశా మానస హత్యకు కారకులు ఇంట్లోనే వున్నారా అనే అనుమానం కావచ్చు. మూడుసార్లు ఆమెను కల్సుకొని ప్రశ్నించినా తగిన వివరాలు లభించలేదు. ఆమెకుకూడా హత్యచేసే అవసరంలేదు.

(3) చిత్ర: మనిషికి చాలా గర్వం. మాటలలో నిర్లక్ష్యం తొంగిచూస్తోంది. ఆమె మెడలో ధరించిన వజ్రాలహారం చూస్తూంటే అనుమానం బలపడుతోంది. మానసను గురించి ఆమెకేం సదభిప్రాయం ఉన్నట్లులేదు. రాత్రి లేచివెళ్లి మానసను హత్యచేసే అవకాశం ఆమెకు బాగావుంది. పైగా వంటిమీద గాయాలు చూస్తోంటే ఆమే హంతకురాలు అన్న అనుమానం కలుగుతోంది. ఎటుచూసినా మానసను హత్య చేసేందుకు అవకాశంవుంది. అవసరమే తెలియటంలేదు. చిత్ర అనుమానితుల జాబితాలో మొదటి వ్యక్తి.

(4) ప్రభు: తెలివయిన వాడు. చూపుల్తో నిశితంగా ఎదుటి మనిషిని గమనిస్తాడు. సినిమానుంచి తిరిగివచ్చి మానసను హత్యచేసే అవకాశం బాగావుంది.

(5) రామకృష్ణ: మానస మాటలు అక్షరాలా నిజం

అన్పిస్తోంది. అతను తల్లి అనారోగ్యం కారణంగా వరంగల్ హాస్పిటల్లో వున్నాడు. సురేంద్రనాథ్ ఉత్తరం గురించి తెలిసిన వారిలో ఇతను ఒకడు. తగిన ఎలబీ సృష్టించుకొని వచ్చి మానసను హత్యచేసే అవకాశం లేక పోలేదు.

(6) ధర్మన్న : ఇతనికి ఇంటి విషయాలు తెలుసు. ఉత్తరంలో విశేషాలు తెలియకపోయినా ఉత్తరం గురించి తెలుసు. ఇంటి నౌకరుగా ఆ విషయం యజమానులకు తెలిపే అవకాశముంది. హత్యచేయడానికి తగిన కారణం లేదు.

(7) కనకం : ఆమెకు అవకాశం అసల్లేదు. ఉదయం వచ్చి సాయంత్రం వెళ్ళిపోతుంది.

(8) నాయరు : అతనికీ హత్యకీ సంబంధంలేదు.

(9) డ్రయివరు : మానసకి కారుతోగాని, డ్రయివరుతో గాని ప్రమేయంలేదు. ఎవరి ప్రోత్సాహంతో ఐనా హత్యచేసే అవకాశం వుంది.

కానీ హత్య జరుగుతుండగానే వెనుకనుంచి ఎవరో పిస్టల్‌తో కాల్చారు. అంటే ఇద్దరు వ్యక్తుల ప్రమేయం వుంది" అన్నాడు ప్రభాకర్.

"ప్రభాకర్ మనం ఇంకోసారి ధర్మన్నను ఒంటరిగా కల్సుకొని ఉత్తరంలో ఏముందో అతనికి తెలుసునేమో కనుక్కోవాలి. ఒకవేళ తెలిస్తే యింకెవరికయినా చెప్పి వుండవచ్చు. దీని కారణంగా మానసను హత్యచేసే అవకాశం ఎవరికి బాగావుందో తెల్సుకోవచ్చు. ప్లాన్ కాగితం మానస యెక్కడ దాచిందో తెల్సుకోవటం ముఖ్యం ముందు" అంటూ రివాల్వింగ్ ఛేర్‌లోంచి లేచాడు ధూర్జటి.

5

అర్ధరాత్రి సమయం గోపాలరావుగారి బంగ్లా వెనక బోట్ హౌస్ చాటున రెండు ఆకారాలు కలుసుకున్నాయి. వాటిని మరో రెండు కళ్ళు గమనిస్తున్నట్లు తెలియదు.

"నన్నేం చెయ్యమంటావు. నువ్వు చెప్పిన ప్రకారమే నడుస్తున్నాను. ప్లాన్ కాగితం ఎంతో జాగ్రత్తగా వెతికి తేనే కానీ కనిపించలేదు." అంది మొదటి ఆకారం.

"నిజమే కానీ అది నకిలీది. అసలు కాగితం ఎక్కడ దాచిందో ఎవరికైనా ఇచ్చిందో. అది దేవాంతకురాలు అని చెబుతూనే ఉన్నాను. అన్నంత పని జరిగింది. కొంపతీసి పోలీసులకు కానీ దొరకలేదు కదా?"ఆందోళనగా అడిగింది రెండో ఆకారం.

"అదేం లేదు. ఆరోజు నేను చాటుగా వాళ్ళని గమనిస్తూనే వున్నాను. పోలీసులు చావును గురించి ఆరాలు తీశారు కానీ ఈ వివరాలు ఏం తెలియవు వాళ్ళకి."

"ఆ విషయం తెలియకపోతే వాళ్ళవల్ల మనకేం బాధ లేదు. కానీ అసలు ప్లాన్ కాగితం ఎవరిదగ్గర చేరిందో. అది బైట పడితే హత్య ఎందుకు జరిగిందో తెల్సిపోతుంది. ఏమైనా నువ్వుమాత్రం చాలా జాగ్రత్తగా వుండాలి. ప్లాన్‌కోసం ఆమె గదిని మరోసారి వెతకాలి," అంది రెండో ఆకారం.

"ఆ డిటెక్టివ్ ఎవడో కానీ హత్య జరిగాక నాలుగు సార్లు వచ్చాడు వివరాలకోసం. పోలీసులు సరేసరి. వాళ్ళడిగే ప్రశ్నలకి జవాబులు చెప్పటం కష్టంగా ఉంది. ఎంతకాలం ఈ దొంగ బ్రతుకు. సుఖపడే మార్గం ఏదైనాచూడరాదూ. ఈ హత్య కేసులో మనం యిరుక్కుంటే."

"ఇంతకాలం ఆగి ఇప్పుడు తొందరపడతావేం. మన

సంగతి ఇంతవరకూ ఎవ్వరికీ తెలియదు. ఇక ముందు తెలిసే అవసరం రాదు. అసలైన ప్లాను కాగితం చేతికి చిక్కి అపారమైన ధనం, వజ్రాలు మన చేతికి చిక్కా యంటే చాలు. ఇంక ఒక్క పని మిగిలిపోతుంది."

"ఏమిటది?" ఆత్రుతగా అడిగింది మొదటి ఆకారం.

"మనం అసలైన బంగారం బాతుని చేతులారా వదులు కుంటున్నాం. అది కూడా మనకి దక్కితే హాయిగా బ్రతికే యచ్చు."

"అమ్మో! అంత విశ్వాసఘాతం చెయ్యొద్దు. ఆ సంగతి మాత్రం వదిలెయ్యి. తీగ లాగితే కొండంతా కదులుతుంది. మనం చిక్కుల్లో పడతాం. ఇలా మనం కల్సుకోవడం ఎవరి కంటైనా పడిందంటే ఇంకేం లేదు," అంది భయంగా మొదటి ఆకారం.

"ఎంత కష్టం అయినా సరే, జరిగి తీరాల్సిందే. రోట్లో తల దూర్చాక రోకటి పోటుకి వెరవడమా."

"ముందు ఆ ప్లాన్ విషయం గురించి ఆలోచించు. పోలీసుల్ని చూస్తుంటే భయంతో నా ప్రాణం పోతోంది. రకరకాలుగా ప్రశ్నలతో వేధిస్తున్నారు"

"జాగ్రత్త! నీకేం భయం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యంగా వుండు. వాళ్ళ ఎదుటికి వెళ్ళేటప్పుడు నీ చేతి మీద గుర్తులు కన్పించనీకు. ఏం అడిగినా నాకు తెలి యదు అనే చెప్పు. ఇవాళ పేపర్లో హత్యావార్త పడింది చూశావా. ఒక దెబ్బకు రెండు పిట్టలు. ఇక ఈ సంపదకు మనమే సర్వాధికారులం," అంది ఆ ఆకారం గర్వంగా.

గడియారం ఎక్కడో రెండు గంటలు కొట్టింది.

"ఇక నేను వస్తాను. మళ్ళీ ఇట్లాగే కలుస్తాను. వివ రాలు ఏవైనా వుంటే ఎవరికి తెలియకుండా కబురు

చెయ్యి," అంటూ వెళ్ళిపోయింది ఆకారం.

అప్పటిదాకా వాళ్ళనే గమనించిన ఆకారం మరో అర గంట గడిచాక మానస గదిలోకి ప్రవేశించింది.

చప్పుడు చేయకుండా కిటికీలు మూసి బ్యాటరీ సహాయంతో గదంతా వెతికింది. కుడిపైపు పుస్తకాల రేక్‌లో అంతా వెతికి మానస డైరీ కన్పించడంతో దాన్ని చేతిలోకి తీసుకుని చకచకా తిరిగేసింది. చివరి పేజీ దగ్గర ఆగిపోయింది జాగ్రత్తగా పరిశీలించింది. సగం రాసిన పేజీ దాని చివర రెండు పెద్ద మందార పూలు డిజైన్‌గా వేసి వుంది. పూవు రేకులమీద మానస అని రాసివుంది.

ఆ కాగితం చింపి జేబులో వేసుకుని మరోసారి దేని కోసమో గదంతా వెతికింది. ఏం దొరకలేదు.

ఆకారం మెల్లిగా నడిచి మూలనున్న టీపాయ్ దగ్గర ఆగింది. దానిమీద వున్న ఫ్లవర్‌వాజ్‌ని చేతిలోకి తీసుకుని లోపలికి చూసింది. ప్లాస్టిక్ పూలగుత్తి తీసేసి వాజ్‌లో చూసింది. అంతా ఖాళీ. చటుక్కున వాజ్‌ని టేబుల్‌పైన వుంచి పూలగుత్తి చేత్తో పరిశీలించింది.

రెండు పెద్ద మందారాలు, మిగిలినవి కొమ్మలూ, ఆకులూ. జాగ్రత్తగా రేకులన్నీ విడదీసింది. పొడరుడబ్బా మూతలాగా బొడ్డులో చిన్న గుంట. అందులో మడతపెట్టిన కాగితం. దాన్ని చూడగానే ఆకారం కళ్ళు మెరిశాయి ఒక్కసారి.

ఆ కాగితాన్ని జేబులో భద్రపరచి, పూలను యధాప్రకారం సర్దేసి, చీకట్లో కల్సిపోయింది ఆకారం.

6

సాయంకాలం ఆరుగంటలకి వేణుగోపాల్‌కోసం బైలుదేరారు డిటెక్టివ్ ధూర్జటి, అతని అసిస్టెంట్ ప్రభాకర్.

ట్రాఫిక్ బంద్ అవటంవల్ల కారు బ్రేక్‌వేసి చుట్టూ వున్న కార్లను పరిశీలిస్తోన్నాడు ధూర్జటి.

అతని దృష్టి సడన్‌గా తన కారుకు పదిగజాల దూరంలో ఆగిన కారుమీద పడింది. కారులో ఒంటరిగా కన్పించిన మనిషినిచూసి తెల్లబోయాడు. డ్రయివర్‌కూడా లేకుండా ఒంటరిగా ఎక్కడికి బయలదేరినట్లు. పైగా మరి కాసే పట్లో చీకటి పడుతోంది.

ప్రభాకర్‌ని కారు దిగి టాక్సీలో ఆ మనిషిని వెంటాడ మని చెప్పి, తాను పోలీస్ స్టేషన్‌వైపు వెళ్ళిపోయాడు ధూర్జటి.

కారు చాలా స్పీడ్‌గా వెళ్ళి, వెళ్ళి ఊరి చివరగా ఆగింది.

అప్పటికే చుట్టూ సన్నగా చీకట్లు అలుముకోసాగాయి.

కారుకి కాస్త దూరంగానే టాక్సీ దిగిపోయాడు ప్రభా కర్. జాగ్రత్తగా ఆ మనిషిని అనుసరించ సాగాడు.

కుడివైపు చివరగా పాడుబడి శిథిలావస్థలోవున్న మేడ కన్పిస్తోంది. దానిలోపల ముఖద్వారం దగ్గర ఎడమవైపు మూడురాళ్ళు పొయ్యిలా అమర్చివున్నాయి. ఆ మనిషి చిన్న పెట్టెలాంటిది తీసి, పొయ్యి మధ్యలోపెట్టి చుట్టూ ఒకసారి పరికించి చూసి, గబగబ కారు దగ్గరకి వెళ్ళి యెక్కటం మరుక్షణం కారు దూసుకుపోవటము జరిగి పోయింది.

ఆ మనిషి కంటబడకుండా పక్కకు తిరిగి కొండరాతిని అడ్డంచేసుకుని అంతా పరిశీలిస్తోన్నాడు ప్రభాకర్.

ఐదు నిమిషాలు గడిచాక అంద వికారంగావున్న ఒక యువకుడు చటుక్కున ఆ పెట్టెను తీసుకొని, దగ్గరలో ఆపిన స్కూటర్ ఎక్కాడు.



దాని నెంబరు నోట్ చేసుకుని, టాక్సీదగ్గరకు నడిచి స్కూటర్‌ని వెంబడించమన్నాడు ప్రభాకర్.

7

రాత్రి పదకొండు గంటలకి మైలాపూర్ అడ్డరోడ్డులో ఒక టాక్సీవచ్చి ఆగింది.

సందంతా చీకటిగా వుంది. స్ట్రీట్ లైట్ కూడా వుండి వుండి వెలుగుతోంది. ఊరకుక్కలు ఎక్కడో "భౌయ్.. భౌయ్" మంటూ అరుస్తోన్నాయి.

టాక్సీని పంపేసి నలుమూలలా పరికించి మూడిళ్ళ అవతల వున్న ఇంటివైపు నడిచాడా యువకుడు.

అతని వయసు ముప్పై సంవత్సరాలు ఉంటాయి. నల్లటి పాంట్, ఫుల్‌హాండ్స్ షర్టు ధరించాడు. చేతికి రేడియం డయల్‌వాచీ మెరుస్తోంది. నెత్తిమీద ఫెల్టుహేట్ వుంది. ఫ్రెంచికట్ మీసాలు. మనిషి ఎర్రగా వున్నాడు.

ఆ యువకుడు చాకులాంటి ఆయుధంతో తాళాలు తెరిచి లోపలికి ప్రవేశించి తలుపులు మూశాడు.

ముందు చిన్నగది. ఒక డ్రాయరు, కుర్చీ తప్ప ఇంకేం లేవు. రెండోగది కొంచెం పెద్దది. దాని పక్కన గది మరీ చిన్నది. తలుపుమీద డార్క్‌రూం అన్న అక్షరాలు.

లైటువేసి నలుమూలలా పరికించి చూశాడు. కొన్ని నెగటివ్‌లు పింగాణీ ప్లేట్‌లో నానబెట్టి వున్నాయి. ఎడం పక్క చిన్న అల్మరాలో ఫోటోలు కొన్ని కట్టలుగా కట్టి ఉన్నాయి. కుడివైపు గాడ్రెజ్ టేబిల్ ఉంది. దానిమీద చిన్న నోట్‌బుక్, పెన్ను ఉన్నాయి. అట్టమీద యేదో పేరు రాసి వుంది.

టేబిల్‌మీద లెటర్ పేడ్‌లో కాగితంమీద ఏవో అక్షరాలు పై కాగితం తాలూకు ఒత్తిడికి కాబోలు అస్పష్టంగా కన్పిస్తోన్నాయి. ఆ పేజీ చించి పక్కనున్న కూజాలోని నీళ్ళలో తడిపి చూశాడా యువకుడు. అక్షరాలు స్పష్టంగా కనిపిస్తోన్నాయి. అది ఒక యువతిని బ్లాక్‌మెయిల్ చేస్తూ రాసిన ఉత్తరం.

ఫోటో కట్టలన్నీ విప్పిచూశాడు. అతని కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి.

అందులో ఒక యువతి, యువకుడు అనేక భంగిమలలో నగ్నంగా వున్న చిత్రాలు. వాటి తాలూకు నెగటివ్స్ వేరే కట్టకట్టి వున్నాయి.

అతనికి కావల్సిన ఫోటోలన్నీ జాగ్రత్తగా యేరుకొని జేబులో పడేసుకున్నాడు. మిగిలినవి ఎక్కడి వక్కడ సర్దేశాడు.

అలమార్లో మరో అట్టపెట్టె తప్ప ఏంలేవు. దానిమూత తీశాడు. ఆశ్చర్యపోయాడు అవిచూసి. ఇంక తనపని

అయిపోయినట్లు బయటికి నడిచాడు....

అదే సమయంలో—

గోపాలరావుగారి భవంతిముందు తోటలో గుబురుగా దాగిన నైట్‌క్వీన్ చెట్లచాటున దాగున్నది ఒక ఆకారం.

మరోగంట దాటాక ఒక ఆగంతకుడు గేటు తీసుకొని వచ్చి సరాసరి లోపలికి వెళ్ళాడు. చెట్టుచాటునుండి ఆ ఆకారం ఆగంతకుడిని వెంబడిస్తూ లోపలికి నడిచింది.

ఆ అగంతకుడు గోపాలరావుగారి పడగ్గదిలో ప్రవేశించి జేబులోంచి తళతళా మెరిసే కత్తినితీసి కపిక్కిన గోపాల రావుగారి గుండెల్లో పొడిచాడు. రెండు నిమిషాలాగి వెను తిరగబోయాడు ఆగంతకుడు.

అంతే! ఠప్‌న నెత్తిమీద పిస్టల్ మడమ తగలడంలో నేలకు ఒరిగిపోయాడు.

8

ప్రముఖ బిజినెస్ మేగ్నెట్ గోపాలరావుగారి యింట్లో అంతా సమావేశం అయ్యారు.

హంతకుడు పట్టుబడ్డాడు అని తెల్సినప్పటి నుంచీ అందరి ముఖాల్లో ఆనందం తాండవిస్తోంది. ఒకవైపు సోఫాలో గోపాలరావుగారు, శాంతాదేవి, ప్రభు, చిత్ర, రామకృష్ణ; మరోవైపు ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, తదితర బృందం, ఆశీనులయ్యారు.

రెండు సోఫాలకి పక్కగానున్న సోఫాలో డిటెక్టివ్ ధూర్జటికుమార్, అతని అసిస్టెంట్ ప్రభాకర్ కూర్చున్నారు. హాల్లో గోడవారగా అమర్చిన కుర్చీలలో గోపాల రావుగారి స్నేహితులు, మరికొందరు ప్రముఖ వ్యాపారస్తులు కూర్చున్నారు.

చెప్పటం ప్రారంభించాడు డిటెక్టివ్ ధూర్జటికుమార్.

"ఈ హత్యకు ముఖ్య కారణాలు ఒకటి అసూయ, రెండోది ధనాకాంక్ష.

మానస రాత్రికి హత్య చేయబడుతుంది అనగా ఆ పుదయం నా దగ్గరకు వచ్చి తనను ఎవరో అపరచిత వ్యక్తి వెంటాడుతున్నాడని, అతని బారినుంచి తనను కాపాడమని కోరింది. సరే అన్నాను. కానీ ఆ రోజు రాత్రే ఆమె హత్య చేయబడింది. పోలీసువారికి తగిన ఆధారాలు ఏమీ దొరకలేదు.

మానస తండ్రి సురేంద్రనాధ్ భార్యావియోగంతో తన బిడ్డను తమ్ముడైన గోపాలరావుగారి యింట్లో విడిచి వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆయన స్మగ్లర్లతో చేయి కలిపి అంతులేని ధనాన్ని కోట్లు విలువ చేసే వజ్రాల్ని సంపాదించి ఒక రహస్య ప్రదేశంలో భద్రం చేశారు.

ఆయన ముఠాలో శేషగిరి అనే వ్యక్తి ఆయనతో సన్నిహితంగా వుంటూ వుండేవాడు. సురేంద్రనాధ్ తదనంతరం ఆయన నిధికి తానే వారసుడు కావాలని కలలు కనేవాడు. కానీ అతని కోరికలకు విరుద్ధంగా ఒకరోజు సురేంద్రనాధ్ తన కుమార్తె మానసకు తను అంతులేని ధనాన్ని సేకరించినట్లు, దాని తాలూకు ప్లాన్ కాగితం త్వరలో పంపుతానని తెలియచేశాడు. ఆ ప్రకారమే పంపటం జరిగింది.

ఆ విషయం తెలుసుకున్న శేషగిరి, సురేంద్రనాధ్ రహస్యంగా కూతుర్ని కలుసుకోవాలని వస్తుంటే, దారిలో ఆయన్ని హత్య చేశాడు.

శాంతాదేవి తలితండ్రులు చాలా బీదవారు. ఆమె అందచందాలు చూసి గోపాలరావు ఆమెను వివాహం చేసుకోవాలి అనుకున్నారు. శాంతాదేవి తలిదండ్రులు వారిద్దరికీ

వయస్సులో తేడా వున్నా కూతురు సుఖపడుతుందని శాంతాదేవిని ఆయనకు యిచ్చి వివాహం చేశారు.

ఆమెకు గోపాలరావుగారితో వైవాహిక జీవితం అసంతృప్తికరంగా వుంది. అందువల్ల ఆమెకు పెళ్ళికిముందే స్నేహితుడయిన శేషగిరితో సంబంధం పెట్టుకుంది...."

"ఏమిటి మీ మాటలు. మీరు ఎవర్నిగురించి మాట్లాడుతున్నారో తెలుసా?" అంటూ కోపంగా లేచింది శాంతాదేవి.

"గౌరవనీయులైన గోపాలరావుగారి భార్యగారినా మీరు అవమానించేది" అని ఒకరిద్దరు అభ్యంతరం చెప్పారు.

"క్షమించాలి. దయచేసి సాంతం వినండి శాంతాదేవీ! మీరు కూర్చుని తీరాలి."

తప్పనిసరిగా కూర్చుంది శాంతాదేవి.

"మానసకు సురేంద్రనాధ్ నిధి తాలూకు కాగితం పంపినట్లు శాంతాదేవి, శేషగిరి ద్వారా తెల్సుకుంది. మానస ఆ ఇంట్లో పెరిగింది ఆయా సంరక్షణవల్ల. శాంతాదేవికి మానసంటే ప్రేమలేదు. అట్లా అని ద్వేషంలేదు.

శేషగిరి మారువేషం వేసుకుని ఆమెను బెదిరించి ప్లాను కాగితం సంపాదించాలని మానసను వెంటాడసాగాడు. ఆమె నా సహాయం కోరిందని తెల్సుకుని ఆ కాగితం ఇంట్లో వుండే గుట్టుగా రాబట్టేందుకు ఆ భారం శాంతాదేవిపై వుంచాడు. ఆ విషయంలో వారిద్దరూ మానసను హత్య చేయటానికైనా సిద్ధంగానే వున్నారు. ఆ నిధి అంతా చేజిక్కాక విదేశాలకు పారిపోవాలని వారి ప్రయత్నం.

తర్వాత రాత్రి రెండు గంటలకు శాంతాదేవి, మానస గదిలోకి వెళ్ళి ప్లాన్‌కోసం అంతా వెతుకుతుంటే మానసకు మెలకువ వచ్చింది. దాంతో ఇద్దరూ గొడవపడ్డారు.

శాంతాదేవి ఆ కాగితం మానస ఇవ్వటంలేదని ఆవేశం

కొద్దీ ఆమెతో తలపడ్డది. ఆ సమయంలో శాంతాదేవి వజ్రాలహారం మానస చేతిలో తెగింది. దాని తాలూకు కొన్ని వజ్రాలు పక్క-మీద పడ్డాయి. చిత్ర మెడలో దారం కట్టిన వజ్రాలహారం చూడగానే మొదట్లో మేమే పొర పడ్డాం.

మానస తనను రక్షించుకోటానికి శాంతాదేవిని గోళ్ళతో గాయపరచింది. అందువల్ల పొడవైన ఆమె గోళ్ళు శాంతాదేవి శరీరంలో దిగబడి కొంత మాంసం గోళ్ళల్లో ఇరుక్కు-ని రక్తానికి తడిశాయి. అందువల్ల శాంతాదేవి మా ముందుకు వచ్చిన ప్రతిసారీ షాల్ కప్పుకునే కనపడేది. మానస తెలివిగా అసలు కాగితం దాచేసి, నకిలీ కాగితం అందుబాటులో వుంచింది.

శాంతాదేవి ఆవేశంలో మానసను గొంతు పిసికింది. బైటనుంచి ఆ దృశ్యం చూస్తున్న శేషగిరి ఆమె ఎదురుతిరిగితే కష్టం అని బైట కిటికిలోంచి పిస్టల్‌తో కాల్చేశాడు. ఆ హడావుడిలో శాంతాదేవి తనహారం సంగతి గమనించలేదు.

ఆమెను హత్యచేసిన వెంటనే ప్లాను కాగితం వెతికి శేషగిరికి అందచేసింది. శేషగిరి అక్క-డ వలిముద్రలు కన్పడకుండా చేపి గదిలో లైటు ఆర్పి, బైటనుంచి తలుపులు మూశాడు.

ప్లాను నకిలీది కావటంలో నిధి దొరకలేదు. అది దొరికి వుంటే వీళ్ళని పట్టుకోవశం ఎవరితరం అయ్యేది కాదు. ఈ కేసులో మరో ముఖ్యమైన వ్యక్తి వల్ల కొన్ని ఆధారాలతో శాంతాదేవి, శేషగిరి హంతకులుగా బైట పడ్డారు.

అతను ప్రభు. గోపాలరావుగారి మేనల్లుడు. ఇతను మంచి ఫొటోగ్రాఫరు. ఆ సంగతి ఎవ్వరికీ తెలియదు.

ఇంట్లో డబ్బు పెత్తనం అంతా శాంతాదేవిది. అందువల్ల డబ్బుకోసం అతను చాలా ఇబ్బంది పడేవాడు ఎక్కువగా విలాస జీవితానికి అలవాటు పడ్డాడు. అందువలన అతను బ్లాక్ మెయిలింగ్ వృత్తిగా స్వీకరించాడు.

అర్ధరాత్రి శాంతాదేవి, శేషగిరి కల్సుకునే సమయాన్ని పట్టి వారిని ఫొటోలు తీస్తూ వుండేవాడు. మానస హత్య జరిగిన రాత్రికూడా అతను ఫొటోలు తీశాడు. కావాలంటే చూడండి" అని కొన్ని ఫొటోలు తీసి వారికి చూపించాడు ధూర్జటి.

ఇదంతా వింటుంటే గోపాలరావుగారికి కలకంటున్న ట్లుంది. శాంతాదేవి పట్టుపడ్డ దోషిలా తల వంచుకుంది.

ప్రభు ఆ ఫొటోలతో శాంతాదేవిని బ్లాక్ మెయిల్ చేసే వాడు పాపం ఆమె తన్ను బ్లాక్ మెయిల్ చేసేది ప్రభు అని తెలియక, అతను చెప్పిన చోట్లకి వెళ్ళి డబ్బు ఇచ్చి వచ్చేది.

నిధి దొరక్కపోవటంతో శేషగిరి దృష్టి బంగారు బాతు లాంటి గోపాలరావుగారి మీద పడ్డది. శాంతాదేవి సహా యంతో ఆయన్నికూడా హత్య చేయాలనుకున్నాడు. కానీ రాత్రి హత్యాప్రయత్నంలో పట్టుపడ్డాడు.

మేం నిన్నరాత్రి గోపాలరావుగార్ని ముఖ్యమైన పని వంకన స్టేషన్లో ఆపేసి వుండకపోతే ఈపాటికి ఆయన మరో లోకంలో వుండేవారు. తనది కాని సొమ్ముకోసం దురాశకుపోయి రెండు హత్యాలకు కారణమైన శేషగిరిని, అతనితో చేతులు కలిపి మానసను హత్యచేసినందుకు, భర్తను హత్యచేయటానికి కారణమైన శాంతాదేవిని తగిన విధంగా శిక్షించాలి. ఇన్స్పెక్టర్! శాంతాదేవినికూడా అరెస్టు

చేయండి" అన్నాడు ధూర్జటి.

"ఫోర్‌నాట్‌త్రీ, ఆ శేషగిరిని లోపలకు తీసుకురా," అని వేణుగోపాల్ అనటంతో కానిస్టేబుల్స్ బేడీలతో వున్న శేషగిరిని లోపలకు తీసుకువచ్చారు.

శేషగిరిని, గుండెలు తీసిన బంట్రైన శాంతాదేవిని చూసి అంతా తెల్లబోయారు.

"అక్కా నువ్వు ఇంత పని చేశావా?" అని ఆశ్చర్య పోయింది చిత్ర.

"ప్రభు బ్లాక్‌మెయిల్ చేసినందుకు అతనికికూడా తగిన శిక్ష విధించండి" అన్నాడు ధూర్జటి.

"నేరాలుచేసి డబ్బు సంపాదించాలనుకుంటే ఎవ్వరికీ లాభించదు అని ఇకనైనా తెల్సుకుంటే మంచిది. సురేంద్ర నాథ్ దాచిన నిధిని ప్రభుత్వం మొన్ననే వశపరచుకుంది. ఈ కేసు మూలంగా కొంతమంది స్మగ్లర్లుకూడా పట్టుపడ్డారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్.

"ధూర్జటిగారూ, ఇంతకాలం యింట్లో జరుగుతున్న అక్రమాలు నాకు తెలియనేలేదు. కళ్లు మూసుకుపోయి వున్న నాకు వీళ్లిద్దర్నీ పట్టించి తగిన మేలు చేశారు ఇంక వీళ్ళని ఒక్కక్షణం కూడా నా ఎదుట ఉంచద్దు. తీసుకు పోయి ఏ శిక్ష విధించినా సరే. మానసను చంపినందుకు ఫలితం అనుభవించాలి. అప్పుడే నాకు మనశ్శాంతి కల్గేది. ఈ కేసులో హంతకుల్ని ఇంత తేలిగ్గా పట్టుకున్నందుకు మిమ్మల్ని ఎట్టా అభినందించాలో తెలియటంలేదు," అన్నారు గోపాలరావుగారు.

ఇన్‌స్పెక్టర్, శాంతాదేవికి, ప్రభుకి బేడీలు తగిలించారు. నేరస్తులు ముగ్గురినీ యెక్కించుకున్న జీప్ శర వేగంతో ముందుకు సాగిపోయింది. □

చావుకోసం ఎదురుచూడు

ప్రతాప రవిశంకర్

పేషంట్లందరూ వెళ్ళిపోయారు. ఈ రోజు ఏమయినా పేషంట్లు తక్కువే. రోజూ అయితే కనీసం సిగరెట్టు ముట్టించే అవకాశం కూడా వుండదు. గమ్మత్తు ఒక్కో రోజు చాలా తక్కువమంది వస్తారు....ఒక్కోరోజు చాలా

ఎక్కువమంది వస్తారు.

సిగరెట్టు ముట్టించాను.

పైన తిరుగుతున్న ఫ్యానుకేసి చూస్తూ పొగ లాగుతున్నాను

ఇంకా టపా రాలేదు. రోజూ ఈవేళకు చాలా ఉత్తరాలు వచ్చేవి.

నేను ఇలా ఆలోచిస్తుండగానే కొన్ని వుత్తరాలు తీసుకొచ్చాడు కంపౌండర్ రామానుజం ... వాటిని నా ముందు వుంచి బయటికి వెళ్ళిపోయాడు. ఆత్రంగా ఒక్కొక్క వుత్తరంమీది ఎడ్రస్సునూ చూస్తున్నాను.

నా స్నేహితుడు రంగ ప్రసాద్ నించి నేనో ఉత్తరాన్ని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాను. అతను ఏదో కొంత స్థలం విజయవాడలో అమ్మకానికి వుందని ఇంతకు ముందు రాశాడు. కొనదల్చుకుంటే వివరాలు రాస్తానని అన్నాడు ... నాకు ఎప్పటినించో విజయవాడలో ప్లేస్ కొని యిల్లు కట్టించాలనే ఓ గాఢమయిన కోరిక. ఈ కోరికకు అసలైన కారణం నేను పదేళ్ల క్రితం వరకు విజయవాడలోనే డాక్టరుగా ప్రాక్టీసు చేస్తూ వుండటం....

ఆ దస్తూరి మీద నా దృష్టి ఆగిపోయింది. అది రంగ ప్రసాద్ దస్తూరి.

ఆత్రంగా కవరు చించాను..

ఐదు నిముషాల్లో ఆ వుత్తరాన్ని మూడుసార్లు చదివాను. స్థలం గురించిన అన్ని విషయాలూ వివరంగా రాశాడు. ముప్పయి అయిదువేలు అవుతుందిట....ఆ వుత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకొన్నాను. ..

మిగిలిన వుత్తరాలను చదువుతున్నాను. చివరికి ఒకే ఒక వుత్తరం మిగిలింది.

ఫ్రమ్ ఎడ్రసు లేదు.

చించాను కవరు.

లోపల ఓ నీలిరంగు పలుచని కాయితం....దాని మీద ఎవరో ఎర్రసిరాతో రాశారు....

"మైడియర్ డాక్టర్-

గుడ్ ఈవెనింగ్. బహుశ ఈ వుత్తరం భయాన్ని కలిగించవచ్చు ...లేదా కలిగించకపోనూవచ్చు .... ఎందు కంటే మీరు డాక్టరు. ఎంతోమంది పేషంట్లకు గుండెకోసి పొట్టకోసి ఆపరేషన్లు చేసి వుంటారు. ఎన్నో చావులను ప్రత్యక్షంగా చూసి వుంటారు. కొన్ని చావులకు మీరే కారణమయి వుండొచ్చు. ఇన్ని చావులు చూశారు కాబట్టి మీకు చావంటే భయముందా? లేనా? ఏమయినా నాకు అనవ సరం. అసలు విషయం రాస్తాను....

నేను మిమ్మల్ని త్వరలోనే చంపబోతున్నాను. మీ చావు నా చేతుల్లోనే రాసిపెట్టి వుంది. మీరు ఏ క్షణానయినా హత్య చేయబడవచ్చు. మీ జాగ్రత్తలో మీరు వుండండి. దేవుడిచ్చిన ప్రాణాన్ని కాపాడుకోవటం మనిషి ధర్మం కదా! బిరెడీ. చావుకోసం ఎదురు చూడండి. బై-

ఇట్లు

—కాబోయే హంతకుడు.

ఆ ఉత్తరంలో ఇంతేవుంది. ఎన్నోసార్లు ఆ ఉత్తరాన్ని చదివాను. నా ఫీలింగ్స్ నాకే అర్థం కాకుండా పోయాయి. దాన్ని బెదిరింపు ఉత్తరంగా భావించాలో ఎవరో సరదాగా రాసిన వుత్తరంగా భావించాలో, నిజమేననుకోవాలో తెలీక అయోమయంతో పడ్డాను.

నేను మెడిసిన్ చదివే రోజుల్లో చదివిన డిటెక్టివ్ నవ లలు కొన్ని అప్పుడు గుర్తుకొచ్చాయి. జోకర్స్ కొంత

మంది వుంటారు. వాళ్ళు యిలాగే చంపుతామని బెదిరిస్తూ వుంటారు

ఈ ఉత్తరంకూడా అలాంటి జోకర్ రాసిందేనా?

ఏమో?

ఏమయినా కొంచెం భయం కలిగింది.

ఐనా నేనొక డాక్టర్‌నని, అందులోనూ ధైర్యవంతుడిననే విషయం గుర్తుకొచ్చింది.

అందుకే ఆ వుత్తరాన్ని గురించి పట్టించుకోలేదు. దాన్ని చింపుదామనుకున్నాను. కాని యెందుకో అలా చెయ్యలేకపోయాను. టేబుల్ సొరుగులో వుంచాను.

ఆ రాత్రి నాకు అంత త్వరగా నిద్రపట్టలేదు. కళ్ళముందు ఆ ఉత్తరం....అందులో నా చావు గురించిన బెదిరింపు....

నిజంగా అతను నన్ను చంపుతాడా?

ఎప్పటికో నిద్రపోయాను.

రెండ్రోజులు గడిచాయి.

ఈ రెండ్రోజుల్లో నన్ను హత్యచేసే ప్రయత్నమేదీ జరగలేదు.

అది నిజంగా యెవడో జోకర్ రాసిన ఉత్తరమే ననుకున్నాను.

కాని—

ఆ రోజు పోస్టులో నాకు మరో ఉత్తరం వచ్చింది. ఈసారి మామూలు పోస్టుకవర్లో ఎర్రరంగు కాయితంమీద రాసాడు అతను....అదే బెదిరింపు ...

"గుడ్ ఈవెనింగ్ డాక్టర్,

నా ఉత్తరం మీరు చదివారనే అనుకుంటాను. కాని మీరు దాన్ని సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించలేదు.

అసలు మిమ్మల్ని బెదిరించకుండానే అంటే ఇలాముందుగా మీకు తెలియపర్చకుండానే చంపవచ్చు. కాని చావంటే భయం యెలా ఉంటుందో మీరు స్వయంగా అనుభవించాలి. అందుకోసమే ఈ ఉత్తరాలు.

మీరు చావంటే భయపడకపోయినా నేను మిమ్మల్ని చంపకుండా వదలను. ఏమయినా ఈ నెలాఖరులోగా ఏదో వొక క్షణంలో మీ చావు తప్పదు—

ఇట్లు

—కాబోయే హంతకుడు."

గుండ్రంగా వున్నాయి అక్షరాలు. ఏ మాత్రం తొణక్కుండా రాశాడు అతనెవరో.

ఈసారి నాకు నిజంగానే కొంచెం భయం కలిగింది. నిజంగానే నన్ను చంపుతాడేమో—

అయినా ఎందుకు నన్ను చంపటం?

నేను అతనికి చేసిన ద్రోహం ఏమిటి? నేను న్యాయమూర్తిని కాదు—అతనికి యెప్పుడో యేదో శిక్ష విధించానుకోడానికి. పాత పగకూడా నామీద ఎవరికీ లేదు. నాకు గుర్తున్నంతలో నేను యెవరితోటీ గొడవపడలేదు. నాకు తెలిసి శత్రువులు యెవ్వరూ లేరు.

మరి—ఎవరీ అజ్ఞాత శత్రువు?

ఎంత ఆలోచించినా ఊహించలేక పోయాను. ఒకవేళ నిజంగానే అతను నన్ను హత్యచేస్తాడనుకుంటే అతన్నించి ఎలా తప్పించుకోవటం?

ఆలోచిస్తున్నాను.

ఇంతలోనే ఫోను మోగింది.

రిసీవర్ ఎత్తాను....

నా ముఖం వికసించింది ... అవతల్నించి మాట్లాడు

తున్నది ఇన్‌స్పెక్టర్ ప్రదీప్. నిన్ననే టూర్‌నించి తిరిగి వచ్చాడుట. సాయంత్రం క్లినిక్‌కి వస్తానన్నాడు. కొంచెం యెర్లీగా రమ్మని ఫోన్ పెట్టేసాను.

గట్టిగా గాలి పీల్చుకున్నాను.

ప్రదీప్‌కు ఈ విషయం చెబితే అతనే ఆ కాబోయే హంతకుడిని పట్టుకుంటాడు.

2

సాయంత్ర మయ్యింది.

క్లినిక్‌ముందు మోటర్‌సైకిల్ ఆగిన చప్పుడయింది.

లోపలకు వచ్చాడు ప్రదీప్. మఫ్టీలో ఉన్నాడు.

కాఫీ తీసుకొచ్చాడు కంపౌండర్ రామానుజం. సిగరెట్లు వెలిగించాము. టూర్ గురించి చెబుతున్నాడు ప్రదీప్.

ఐనా నేను అవన్నీ వినటంలేదు. మెల్లగా ఆ ఉత్తరాన్ని బయటకుతీసి అతనిముందు ఉంచాను.

"ఏమిటిది?"

"చదువు.... నీకే తెలుస్తుంది?"

చదివాడు.

"దీనికిముందు ఇంకో ఉత్తరం వచ్చిందా?" అడిగాడు.

"అవును" అదికూడా తీసిచ్చాను.

"ఎవడో సరదాకు రాసివుంటాడు." కావాలనే అలా అన్నాను ప్రదీప్‌తో.

"నో....నాకలా అనిపించటంలేదు. ఇవి నిజంగా రాసిన ఉత్తరాలే."

"రియల్లీ" భయంగా అడిగాను.

"అవును. ఈ ఉత్తరాల్లో సిన్సియారిటీ కన్పిస్తోంది."

"ఏం చేద్దాం?" అడిగాను.

ప్రదీప్ వెంటనే మాట్లాడలేదు.



"నీకు ఎవరిమీదయినా అనుమానం ఉందా?" మామూలుగా అడిగే ప్రశ్న.

"లేదు."

"నీకు శత్రువులు యెవ్వరూ లేరా?"

"లేరు.... నాకు తెలిసి."

"నీకు తెలీకుండా శత్రువులుండే అవకాశముందా?"

"నాకెలా తెలుస్తుంది?"

"కష్టం....ఏదో ఒక ప్రయత్నం జరిగేవరకూ అతని గురించి ఏమీ తెలుసుకోలేము" అన్నాడు ప్రదీప్.

"ఏదో ఒక ప్రయత్నమంటే? నా మీద హత్యా ప్రయత్నమా?"

"అవును"

"ప్రయత్నం ఫలించి నేనూ హత్య చెయ్యబడితే" అడిగాను భయం బయటకు కనపడనీయకుండా....

"ఫలించే అవకాశం అతనికి యివ్వకూడదు."

"ఇంతకీ నన్నేం చేయమంటావ్?"

"నీ జాగ్రత్తలో నువ్వుండు. ఒంటరిగా ఎక్కడికీ

వెళ్ళకు. కార్లో వెళ్ళేటప్పుడు విండో గ్లాసెస్ మూసివుంచు. కార్లోనించి దిగేటప్పుడు డ్రైవర్‌ను ఓ సారి చుట్టూ చూడ మని చెప్పు....నీకు అనుమానంగా అనిపించిన వ్యక్తులు కనిపించినప్పుడు నాకు ఫోన్ చెయ్యి."

తల వూపాను...

ఇంకా నేను తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలను చెప్పాడు

ధైర్యం చెప్పి వెళ్లిపోయాడు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ ...

ఆ రాత్రి కూడా నాకు నిద్రలేదు.

ఈ చావు వుత్తరాల గురించి నా భార్యా పిల్లలకు చెప్పలేదు. చెబితే వాళ్ళకీ మనశ్శాంతి వుండదు. ప్రదీప్ చెప్పినట్టే ప్రతి పనిలోనూ ఎన్నో జాగ్రత్తలు తీసు కుంటున్నాను.

బయటకు వెళ్లినా ముందుగా కార్లోనించి దిగటంలేదు. పరిసరాలను బాగా పరిశీలించి దిగుతున్నాను.

ఐనా భయంగానే వుంటోంది....

నిజమే చావంటే ఎంత భయం. ముందుగా తెలిసిం దంటే బతికుండగానే నరకం....

ఇంతకీ ఇతనెరో నన్ను ఎందుకు చంపబోతున్నట్టు?

ఈ ఆలోచనే నాకు పిచ్చెక్కేలా చేస్తోంది. ఒకవేళ అతను పొరపాటుపడ్డాడేమో....మరో డాక్టర్‌ని చంపాలను కుని నాకు ఈ ఉత్తరాలు రాస్తున్నాడేమో....

నా పేరుతో మరెంతమంది డాక్టర్లో ఈ హైద్రాబాద్ నగరంలో వుండొచ్చు.

ఏమయిందీ ఎలా తెలుస్తుంది?

మరో రెండ్రోజులు గడిచాయి. అయితే ఈ రెండ్రో జుల్లోకూడా నామీద ఎలాంటి హత్యాప్రయత్నమూ జరగ

లేదు.

మళ్ళీ నాకు కొంచెం ధయిర్యం వచ్చింది. నిజంగా ఆ ఉత్తరాలు ఎవడో జోకర్ రాశాడనే అనుకున్నాను.

ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ రోజూ సాయంత్రం నన్ను కలుస్తూనే వున్నాడు.

మళ్ళీ నాకు ఆ బెదిరింపు వుత్తరం కూడా రాలేదు. మరో మూడు రోజులు గడిచాయి. రోజు రోజుకీ ఆ చావు వుత్తరాలగురించి మరచి పోతున్నాను.

ఇంకో పదిహేనురోజులు వెనక్కు వెళ్లాయి. ఆ వుత్తరాలను ఎవడో జోక్‌గా రాశాడని వాటి విషయమే మరచి పోయాన.

"ఎందుకయినా మంచిది నీ జాగ్రత్తలో నువ్వుండు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్.

3

ఆ రోజు వుదయం.

క్లినిక్‌నించి ఇంటికి బయల్దేరుతున్నాను. బయటకు వచ్చాను. డ్రైవరు కారుదగ్గర సిద్ధంగా వున్నాడు.

సిగరెట్టు ముట్టించి కారువైపు నడవబోయాను.

ఇంతలోనే బయట టాక్సీ ఆగింది. అందులోనించి ఎవరో ఒకతను కిందికి దిగాడు. లావుగా పొట్టిగావున్నాడు. అతను డ్రైవరు సాయంతో వెనుకసీట్లోనించి ఓ మనిషిని బయటకు లాగి క్లినిక్‌లోకి తీసుకొచ్చాడు. అతను చిన్నగా మూల్గుతున్నాడు.

గబగబా సిగరెట్‌ను విసిరేసి లోపలకు నడిచాను.

అతన్ని బల్లమీద పడుకోబెట్టారు వాళ్ళు.

"ఏమయింది?" అడిగాను.

నన్ను చూడగానే అతను విష్ చేశాడు .... తర్వాత

చెప్పాడు.

అతనికి ఉన్నట్టుండి గుండెలో పోటుగా వచ్చిందిట.... తట్టుకోలేకపోతుంటే నా దగ్గరకు తీసుకొచ్చాడుట. వెంటనే చూడమని నన్ను తొందర చేశాడు పొట్టిగావున్నతను. స్టెత్‌తో పరీక్షచేశాను.

అతను పొడుగ్గా సన్నగా వున్నాడు. గుండె ఎండి పోయి వుంది.

కళ్లు సగం మూతపడివున్నాయి. చిన్నగా బాధతో మూల్గుతున్నాడు.

ఓ ఇంజెక్షన్ యిచ్చాను. అది మత్తు ఇంజెక్షన్. తర్వాత కొన్ని మందులు రాసిచ్చాను. ఫీజు చెల్లించాడు పొట్టి మనిషి.

"ఇక తీసికెళ్ళండి. ఆ మందులు వాడండి" అన్నాను.

అతన్ని మళ్ళీ టాక్సీలో వేసికొని వెళ్ళిపోయాడు.

కార్లో యింటికి బయల్దేరాను. ఇంతకు ముందు జరిగిన ఈ సంఘటన యెందుకో నాకు చాలా అసహజంగా అనిపించింది.

నా హత్యకు యిదో ప్లాను కాదు గదా! ఒంటరిగా వుంటానని వాళ్లు ఇలా వచ్చేరేమో! డ్రైవర్ని, రామాను జాన్ని చూసి తమ ప్లాను సక్సెస్ కాదని వెళ్ళిపోయారేమో....

ఏమో!

ఇంటికి వెళ్ళిన తర్వాత ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కు ఫోన్ చేశాను.

జరిగిందిచెప్పాను. నాకు ఎందుకు అసహజంగా అనిపించిందో కూడా వివరించాను.

"ఆ టాక్సీ నెంబరు చూశావా?" అడిగాడు ప్రదీప్.

"చూశ్ళేదు."

"పొరపాటు చేశావ్. టాక్సీ నెంబర్ వుంటే విషయం తెలిసిపోయేది" అన్నాడు.

"అప్పుడు నాకు ఆ ఆలోచన రాలేదు" చెప్పాను.

"పరవాలేదు. నేను ఎంక్వయిరీ చేయిస్తాను. ఇంతకు ముందు నీ హాస్పిటల్‌కు వచ్చిన టాక్సీ దొరికితే, వాళ్ళను యెక్కడ దించిందీ తెలుస్తుంది" అన్నాడు ప్రదీప్.

4

కార్లో బయలుదేరాం నేను, ప్రదీప్.

పావు గంట తర్వాత కారు ఓ యింటిముందు ఆగింది.

గేటు నెట్టుకొని లోపలకు వెళ్లాం. తలుపులు దగ్గరగా మూసివున్నాయి.

కాల్ బెల్ నొక్కబోయాను. ప్రదీప్ నన్ను వారించి విసురుగా తలుపులు నెట్టుకొని లోపలకు వెళ్లాడు. వెనకే నేనూ-

టేబిల్ ముందు కూర్చుని ఏదో రాస్తున్న పొట్టిమనిషి వులిక్కిపడి లేచాడు

"అవును.... అతనే" అన్నాను.

వెంటనే ఆతని చేతులు వెనక్కు విరిచి పట్టుకున్నాడు ప్రదీప్.

"ఏమిటీ దౌర్జన్యం?" అన్నాడతను.

"నోర్మూయ్" అన్నాడు ప్రదీప్.

టేబిల్‌మీది, లెటర్ ప్యాడ్‌కి వున్న ఆ వుత్తరం చూశాను.... అది నాకు రాస్తున్న వుత్తరమే- ప్రదీప్‌కి చూపించాను.

అతన్ని నన్ను పట్టుకోమని చెప్పి, పోలీసులకు బేడీలతో రమ్మని స్టేషన్‌కి ఫోన్ చేశాడు ప్రదీప్.

అతని మొహంలో నెత్తురు చుక్క లేదు....

"ఇప్పుడు చెప్పు డాక్టర్‌ను యెందుకు చంపాలనుకున్నావు?" అన్నాడు ప్రదీప్.

చెప్పాడు అతను. అతను చెప్పింది వినగానే ఆశ్చర్యపోయాను.

నేను విజయవాడలో ప్రాక్టీసు చేస్తున్నప్పుడు ఓరాత్రి అతను నా దగ్గరకు వచ్చాడట. తన తల్లికి సీరియస్‌గా వుందని నన్ను రమ్మన్నాడట. నేను రాననీ మరో డాక్టరు దగ్గరకు వెళ్ళమని చెప్పానట. అతను ఇంటికి వెళ్ళేసరికి వాళ్ళ అమ్మ చచ్చిపోయిందట. దాంతో అతనికి నా మీద కసి ఏర్పడిందట.

తర్వాత అతను ఆ వూర్నించి వెళ్ళిపోయాడు కొంత మంది స్మగ్లర్లతో కలిసి డబ్బు సంపాదించాడట. నా కోసం వేట సాగించి చివరకి ఇక్కడ వున్నట్టు తెలుసుకొన్నాడట. చంపాలనుకుని ఆ వుత్తరాలు రాయటం మొదలు పెట్టాడట."

డాక్టరు వృత్తిలో కూడా ఇలాంటి శత్రువులు వుంటారని మొదటిసారిగా తెలుసుకున్నాను.

పోలీసులు వచ్చారు. ఆ పొట్టి మనిషి చేతికి బేడీలు పడ్డాయి.

ఇంటికి తాళంపెట్టి బయటకు వచ్చాం.

ప్రతి నేరస్థుడికీ ఓ అలవాటు వుంటుంది. ఆ అలవాటే అతడ్ని పట్టిస్తుంది అన్నాడు ప్రదీప్.

"అవును. ఇతను వుదయం క్లినిక్‌కు వచ్చినప్పుడు "గుడ్ ఈవినింగ్ డాక్టర్" అనకపోతే మనం ఇంతగా అనుమానించేవాళ్ళం కాదేమో" అన్నాను సిగరెట్టు ముట్టిస్తూ. □

వసుంధర

చోరస్థుడికి సన్మానం

క్రీచుమని శబ్దం చేస్తూ ఆగిపోయింది కారు.

వీరభద్రం చిరాగ్గా డ్రైవర్ వంక చూపి-"ఏమయింది" అనడిగాడు.

"ఇంజను ట్రబులు" అని డ్రైవర్ సీట్లోంచి దిగి కారు

ముందుకు వెళ్ళాడు. వీరభద్రం అసహనంగా పైముచూసు కుని అస్పష్టంగా ఏదో గొణుక్కున్నాడు.

నిజానికి అప్పుడు వీరభద్రానికి కొంపలు మునిగే పను లేవీ లేవు. తన ఎలక్ట్రానిక్స్ షాపుకి వెళుతున్నాడాయన. షాపును కొడుకు చూసుకుంటూంటాడు. ఈయన వెళ్ళేది కాలక్షేపానికే! అయితే ఆయనకు అసహనం ఎక్కువ. అనుకోని అవాంతరాలేమొచ్చినా ఆయన సహించలేడు.

మరో ఐదు నిముషాల తర్వాత డ్రైవర్ వచ్చి-"నేను వెళ్ళి మెక్కానిక్కుని తీసుకొస్తానండి. ట్రబులేమిటో నాకు అంతుపట్టడం లేదు-" అన్నాడు.

విసుక్కుంటూ కారు దిగి- "అయితే నేను బస్సులో ఇంటికి పోతాను. నువ్వు జాగ్రత్తగా అన్నీ చూసుకుని కారునింటికి తీసుకురా-" అంటూ దగ్గర్లో వున్న బస్టాప్ వైపు నడిచాడు.

ఆయన బస్టాప్ వైపు వెళుతూండగా ఒక పాతికేళ్ళ స్త్రీ అలా పరుగెత్తుకుంటూ వచ్చి ఆయన్నించుమించు ఢీకొనబోయి-"తప్పయిపోయింది బాబూ!" అంటూ పక్క నుంచి వెళ్ళిపోయింది.

చూడ్డానికి ఆమె గుడిసెల్లో నివసించేదానిలాగుంది. మనిషి దగ్గరకు రాగానే చెమట కంపు కొట్టింది. అక్కడక్కడ చిరుగులున్న పాత బట్టలు కట్టుకుంది. మనిషి ముఖంలో భయమూ, మాటలో కంగారూ, కదలికలో హడావుడీ కన్పిస్తున్నాయి.

ఆమె ఆయన్నలా దాటి వెళ్ళిందో లేదో ఓ ముప్పై ఏళ్ళ పురుషుడు ఆయన్ని దాటుకుంటూ వెళ్ళి ఆమెను పట్టుకున్నాడు. అతనామెను తరుముకుంటూ వస్తున్నట్లు అర్థమవుతోంది.

"తప్పుడుముండ కానా!" అంటూ అతనామె జుట్టు పట్టుకున్నాడు.

"ఓరి నాయనోయ్-చచ్చాన్రోయ్" అంటూ ఆమె గావు కేక పెట్టింది.

వీరభద్రం బస్‌స్టాపులోని షెడ్‌లోకి వెళ్ళాడు. ఏం జరుగుతుందోనాని అ మనుషుల్నే చూస్తున్నాడు. ఆయనతోపాటు చాలామంది ఆ దృశ్యాన్ని చూస్తున్నారు.

ఆ పురుషుడు ఆ స్త్రీని చావబాదుతున్నాడు. ఆమె ఆర్తనాదాలు చేస్తోంది. తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ ఆ పురుషుణ్ని శాపనార్థాలు పెడుతోంది.

ఆ దృశ్యం యెంతో ఘోరంగా, హృదయ విదారకంగా వుంది. కానీ అంతా చూపి ఆనందిస్తున్నారు తప్పితే ఒక్కరూ కలగజేసుకోవడం లేదు.

అ దృశ్యానికెప్పటికీ అంతు కనిపించుపోవడంతో వీరభద్రం సహానానికి పరీక్షవచ్చింది. ఆయన చటుక్కున నాలుగడుగులు ముందుకు వేసి అ పురుషుడి భుజం మీద చేయివేసి ఆపి- "ఆడదాన్నిలా నడి రోడ్డు మీద పట్టుకుని కొడతావు. బుద్ధిలేదూ?"- అన్నాడు.

"నా పెళ్ళాన్ని నా ఇష్టమొచ్చినట్లు తంతాను. నువ్వెవడివయ్యా-వెళ్ళు-" అన్నాడా పురుషుడు.

"నీ పెళ్ళాన్ని తన్నాలనుకుంటే నీ యింట్లో తన్నుకో. ఇది పబ్లిక్ రోడ్డు. ఇక్కడ నీ ఇష్టం చెల్లదు-"

"ఇక్కడే తంతాను. ఏంచేస్తావ్!"అన్నాడా పురుషుడు.

"ఏం చేస్తానా?" - అని వాడి వీపుమీద గట్టిగా చరిచాడు. ఆయన ఓర్పుకు పూర్తిగా అంతం వచ్చినట్లుంది, తన శక్తిమేరకు వాణ్ని చావ బాదాడు.

ఆ పురుషుడు చూడ్డానికి బలహీనంగా వున్నాడు. ఎదురుతిరుగుదామనుకుని కూడా వీరభద్రం దృఢ శరీరం ముందు నిలబడలేకపోయాడు. ఆయనచేత చావు దెబ్బలు తిని వాడు అక్కణ్నించి పారిపోయాడు. అప్పటికే ఆ స్త్రీ అక్కణ్నించి పారిపోయింది. వీరభద్రం ఆయాసపడుతూ అక్కణ్నించి మళ్ళీ బస్ షెడ్‌లోకి వెళ్లాడు.

"రౌడీ వెధవలు-వాళ్ళతో మనకు గొడవలెందుకండీ-" అన్నాడు షెడ్‌లోని పెద్దమనిషి ఒకడు - తనేమీ చేయక పోవడాన్ని సమర్థించుకుంటూ.

"కళ్ళముందంత ఘోర హింసా కాండ జరిగిపో తూంటే చూస్తూ యెలా ఊరుకుంటామండీ?" అన్నాడు వీరభద్రం చిరాగ్గా.

"హింసేమిటండీ-అది వాళ్ళకి రోజూ అలవాటే. వాళ్ళ జీవితాలే అంత! వాళ్ళ జోలికి వెడితే ఆ హింస మన జీవి తంలో కూడా భాగమైపోతుంది-" అన్నాడా పెద్దమనిషి.

వీరభద్రం ఏమీ మాట్లాడలేదు.

2

ఆ వూళ్ళో ఎంపైర్ హోటల్ కడుతున్నారు ఆ కంట్రాక్టు వీరభద్రానికే వచ్చింది. రోజూ వుదయం పని అయ్యాక రాత్రివేళ వెళ్ళి తయారౌతున్న ఆ బిల్డింగుని చూసు కుని రావడం వీరభద్రానికి అలవాటు. అది ఊరికి కాస్త దూరంగా ఉంటుంది. హోటల్ తయారైనాక ఏమోగానీ ప్రస్తుతానికి ఆ ప్రాంతం నిర్మానుష్యంగానే వుంటోంది.

బిల్డింగ్ సైటు రాగానే వీరభద్రం కారు దిగి-"నువ్వు కార్లోనే వుండు-" అని డ్రైవరుకు చెప్పాడు. తను నెమ్మదిగా భవనానికి ప్రదక్షిణం ప్రారంభించాడు.

ఆయన ప్రదక్షిణం సగంలో వుండగా-"అయ్యగారూ-

జాగ్రత్త" అన్న కేక వినిపించింది. ఆయన చటుక్కున తప్పుకున్నాడు. ఒక వ్యక్తి పెద్ద బండరాతిని చేత్తో పట్టుకుని తనను తలపై మోదడానికి సిద్ధంగా వున్నాడు. ఆయన తప్పుకోగానే వాడా రాతిని కిందపారేసి పరుగు లంకించుకున్నాడు.

వీరభద్రాన్ని హెచ్చరించిన డ్రైవర్ ఆ వ్యక్తిని గట్టిగా పట్టుకుని ఆపాడు కానీ వాడు తన శక్తినంతా వుపయోగించి డ్రైవర్‌ని తోసేసి అక్కణ్ణించి పారిపోయాడు.

డ్రైవర్ లేచి నిలబడి వళ్ళు దులుపుకుంటూండగా వీరభద్రం అతన్ని సమీపించి "ఎవడు వాడు?" అనడిగాడు.

"ఏమో తెలీయదండీ-" అన్నాడు డ్రైవర్.

"నువ్వెందుకు నా కూడా వచ్చావ్?" అనడిగాడు వీరభద్రం.

"మిమ్మల్ని అంటిపెట్టుకుని వుండమని అమ్మగారి ఆజ్ఞ" అన్నాడు డ్రైవర్.

వీరభద్రం నిట్టూర్చి - "ఆ మనిషి నన్ను చంపాలని వచ్చాడు. ఎందుకో తెలియదు? నన్ను హత్య చెయ్యాలనుకునేటంత శత్రువులు నాకేర్పడ్డారంటే నాకు కాస్త భయంగా కూడా వుంది. వాడెవడో గుర్తు పట్టగలవా?" అన్నాడు.

"చీకట్లో వాడి మొహం సరిగ్గా తెలియలేదండి. మళ్ళీ కనబడ్డా గుర్తు పట్టలేనేమో-" అన్నాడు డ్రైవర్.

"ఈ విషయం నా స్నేహితుడు వెంకన్నకు చెప్పడం మంచిదేమో-" అన్నాడు వీరభద్రం.

"డిటెక్టివ్ వెంకన్నగారేనండీ?"- అన్నాడు డ్రైవర్ వుత్సాహంగా.

వెంకన్న అసలు పేరు అది కాదు. తలిదండ్రులు అతనికి చాలా అందమయిన పేరే పెట్టారు. అయితే డిటెక్టివ్ వృత్తి స్వీకరించాక అతను తన పేరునిలా మార్చుకున్నాడు.

పల్లెటూళ్ళను, తెలుగుతనాన్నీ ప్రతిబింబించే తన పేరు ఈ విధంగానే విశ్వవిఖ్యాతి గాంచాలని అతడి అభిలాష.

డ్రైవర్ వుత్సాహానికి కారణం వేరు. డిటెక్టివ్ వెంకన్నకు ఆఫీసు వ్యవహారాలు చూడ్డానికిద్దరు అసిస్టెంట్లు న్నారు. వాళ్ళపేర్లు రాజమ్మ, సీతమ్మ. చక్కని తెలుగు పల్లెటూరిపిల్లల్లావుంటారు వాళ్ళు. వాళ్ళ ముఖాల్లో దివ్యతేజస్సు వుంది. వాళ్ళను చూడడం ఎవరికైనా అపూర్వమైన అనుభవమే! వాళ్ళను చూడడంకోసం చాలామంది డిటెక్టివ్ వెంకన్న ఆఫీసుకు వెళుతూంటారు. అంగాంగ ప్రదర్శనే ఆడదానికి ఆకర్షణ కాదనీ, ఆడదాని అందం విధిగా అసభ్యపు కోరికలను పురుషుడిలో రేకెత్తించనవసరంలేదనీ చెప్పడానికీ రాజమ్మ. సీతమ్మ వుదాహరణ అవుతారు.

3

"ఈ మధ్య నువ్వెవరితోనై గొడవపడ్డావా?" అన్నాడు వెంకన్న.

"లేదు" అన్నాడు వీరభద్రం.

"నిన్ను హత్యచేస్తే ఎవరికి లాభిస్తుంది?"

"తెలియదు—"

"వ్యాపారంలోగానీ, ఇతర విషయాల్లోగానీ నీకు బలమైన ప్రత్యర్థులున్నారా?"

వీరభద్రం తడుముకోకుండా — "లేకేం? శరభయ్యవున్నాడు. ఎంపైర్ హోటల్ కంట్రాక్ట్ నేను కొట్టేశానని అతడికి చాలా మంటగా వుంది" అన్నాడు.

"ఈ మాత్రానికే అతడు నిన్ను హత్యచేయాలనుకుంటాడా?"

"అనుకుంటాడని అనుకోను. ప్రత్యర్థులగురించి అడిగావు కాబట్టి చెప్పాను" అన్నాడు వీరభద్రం.

"సరే నువ్వెళ్ళు" అన్నాడు వెంకన్న. వీరభద్రం వెళ్ళి పోయాక తన అసిస్టెంట్సువంక చూసి — "వీరభద్రం వచ్చేక ఏం జరిగిందో నోట్ చేశారుగదా—ఏం రాశారో చదవండి" అన్నాడు.

క్లయింట్స్ ఎవరొచ్చినా ప్రొసీడింగ్స్ సీతమ్మ, రాజమ్మ విడివిడిగా తయారుచేస్తారు. రెండూ ఒక్కలాగే వుండాలి. ఏమాత్రం తేడా వచ్చినా వెంకన్న సహించడు. ఇంతవరకూ అతను సహనం కోల్పోవాల్సిన అవసరంరాలేదు.

వెంకన్న బాగా ఆలోచించి — "ధనవంతులకు నిత్య జీవితంలో లక్షా తొంభై వ్యవహారాలుంటాయి. ఒకోసారి వాళ్లు చాలా చిన్నదిగా భావించి మరిచిపోయిన సంఘటనే ప్రాణాంతకం కావచ్చు. నాకు తెలిసినంతవరకూ వీరభద్రాన్ని హత్య చేయాలనుకునేటంత ప్రత్యర్థులు ఎవ్వరూలేదు. అయినా ఓసారి శరభయ్యను కదిపి చూస్తాను" అంటూ వెంటనే డైరక్టరీ తెరిచిచూసి ఓ నంబర్ డయల్ చేశాడు.

"హలో-శరభయ్య స్పీకింగ్!" అంది అవతలి కంఠం.

డిటెక్టివ్ వెంకన్న గొంతు సవరించుకుని—"నమస్కారమండి. మీరు చెప్పిన ప్రకారమే చేయబోయాను. కానీ ఆయన తప్పించుకున్నాడండి" అన్నాడు.

"ఎవర్నువ్వు మాట్లాడుతూంట?" అంది అవతలి కంఠం.

"నేను చెప్పేది వీరభద్రంగారి సంగతండి" అన్నాడు వెంకన్న.

"వీరభద్రం తప్పించుకున్నాడా?" కంగారుగా అన్నాడు శరభయ్య—"నువ్వుగానీ దొరికిపోలేదుగదా—నాగురించి చెప్పలేదుగదా—"

"లేదండి. తప్పించుకుని పారిపోయాను."

"అవునూ—ఇంతకీ నువ్వు నాకు ఫోన్ ఎలా చేయగలిగావ్? నా నంబర్ నీకు తెలీదుగదా—"

"మీ పేరు చెబితే మాకు ఫోన్ చేయడమెంతసేపండీ" అన్నాడు వెంకన్న.

"అంటే?"

"మీ పేరు చెబితే ఈ హోటలాయన మీ ఫోన్ నంబరు చెప్పాడు. డబ్బులుకూడా తీసుకోనన్నాడు—"

"కొంపదీసి నీ మాటలు ఆయన వినడం లేదుగదా."

"అబ్బే లేదండి. ఇది రహస్యమని నాకూ తెలుసుగదా" అన్నాడు వెంకన్న.

"అయినా రాత్రి పన్నెండింటికి ఆయనింటికి వెళ్ళమంటే నువ్వేమో ముందుగానే ప్రయత్నించి వ్యవహారం పాడుచేశావు. నీకు బుద్ధిలేదు" తిట్టాడు శరభయ్య.

"హోటల్ ఎంపైర్ బిల్డింగ్ దగ్గర ఒంటరిగా దొరికాడు గదా అని ఓ పట్టుపట్టాలనుకున్నాను. బెడిసికొట్టింది.

పన్నెండు గంటల ప్రాంతంలో మళ్ళీ ప్రయత్నిస్తాను" అన్నాడు వెంకన్న.

"ఎక్కడా నా పేరు బైటపడకూడదు. ఆయన ముందు జాగ్రత్తపడతాడేమో చూసుకో."

"అలాగేనండి — ఉంటాను మరి" అని ఫోన్ పెట్టేశాడు వెంకన్న. తర్వాత సీతమ్మ, రాజమ్మలవంక చూపి- "చాలా తమాషాగా వుందికదూ-హంతకుడు చాలా తేలిగ్గా పట్టుబడ్డాడు" అన్నాడు.

ఫోన్లో జరుగుతున్న ఈ సంభాషణ అంతా సీతమ్మ, రాజమ్మలు వినడానికి వేరే సదుపాయం వుంది. అతనలా గనగానే రాజమ్మ ఉేపు అఫ్‌చేసి—"శరభయ్య హంతకుడనడానికిదే ఋజువు" అంది.

"అతనింకా హత్య చేయందే?" అన్నాడు వెంకన్న.

"చేస్తున్నాడుగదా!" అంది సీతమ్మ.

"కానీ నేను శరభయ్యని హంతకుణ్ని అవనివ్వను" అంటూ లేచి నిలబడ్డాడు వెంకన్న.

"అయితే ఇప్పుడేం చేస్తారు?" అంది రాజమ్మ.

"రాత్రి పన్నెండింటికి హంతకుణ్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటాను" అన్నాడు వెంకన్న. అలా అని అతను టైము చూసుకున్నాడు. టైము తొమ్మిదయింది.

వెంకన్న టేబిల్‌మీద ఫోన్‌తీసి మళ్ళీ ఏదో నంబర్ డయల్‌చేశాడు. సంభాషణ వినబోతున్న అసిస్టెంట్లువంక కోపంగా చూసి—"ఇది వంటింట్లోకి అని తెలియదూ— మీరు వినకూడదు" అన్నాడు. వాళ్ళిద్దరూ ముసిముసిగా నవ్వుకున్నారు. అలా చెప్పించుకోవడం వాళ్ళిద్దరికీ సరదా.

"దేవీ!" అన్నాడు వెంకన్న. అతని భార్యపేరు పద్మావతీదేవి. ఆమెను దేవీ అని పిలుస్తాడతను.

"ఊఁ"

"వంటయిందా?"

"అయింది. పిల్లలు భోంచేసి నిద్రపోయారు ..."

"వెరీగుడ్. అయితే కలిసి భోంచేయొచ్చునన్నమాట" అంటూ ఉత్సాహంగా ఫోన్ పెట్టేసి అక్కణ్నించి చలాకీగా కదుల్తూ తన అసిస్టెంట్సు వంక చూసి—"ఏమిటా ముసి ముసి నవ్వులు? పెళ్ళయ్యేదాకా ఆ నవ్వులు దాచుకోవాలని తెలియదూ?" అన్నాడు.

4

అది సరిగ్గా అర్ధరాత్రి పన్నెండు గంటల సమయం.

డిటెక్టివ్ వెంకన్న వీరభద్రం యెదురింటి అరుగుమీద గోడకు మూలగా కూర్చుని పరిసరాలను వెయ్యి కళ్ళతో కనిపెడుతున్నాడు.

అతను చూస్తూండగా సందు చివర కారు ఒకటి ఆగింది. అందులోంచి ఒక మనిషి దిగాడు. కారు వెళ్ళి పోయింది. ఆ మనిషి నెమ్మదిగా నడుస్తూ వీరభద్రం ఇంటి దాకా వచ్చి అక్కడ ఆగాడు.

ఆ సమయంలో అతను తప్ప ఆ వీధిలో ఎవ్వరూలేరు.

అతనొక పర్యాయం చుట్టూ చూశాడు. తన జేబులోంచి ఏదో వస్తువుతీశాడు. ఒక పర్యాయం వీరభద్రం ఇంటిని పరీక్షగా చూశాడు. ఆ వస్తువును చేతిలో పట్టుకున్నాడు. అతను ఏం చేశాడో కానీ ఆ వస్తువు క్రమంగా పొడుగ్గా అవుతోంది. రెండు నిమిషాల్లో అది వీరభద్రం మేడంత పొడుగైంది.

అదేమిటో వెంకన్నకు అర్ధమైంది-కొత్తగా మార్కెట్లోకి వచ్చిన తుపాకీ అది. దాన్నుపయోగించి రోడ్డుమీదనుంచే మేడమీది మనుషుల్ని చంపవచ్చు.

బోలెడు గొట్టాలు ఒకదాంట్లో ఒకటి నిండి వుంటాయి. మీట నొక్కి ఒకో గొట్టాన్నే పైకి పంపవచ్చు. చివరి గొట్టాంలో చిన్న పెరిస్కోపు, గుండు పెట్టే సాధనం వుంటాయి. క్రిందనుంచి పెరిస్కోపులో విధంగా పైన ఎవరెవరు ఏయే స్థానాల్లో వున్నారో స్పష్టంగా చూడవచ్చు. గురిని చూసుకోవచ్చు. క్రిందనుంచే గుండు పేల్చవచ్చు. చప్పుడు కాకుండా మనిషి ప్రాణాలు పోతాయి.

కొత్తగా, విదేశాలలోంచి దిగుమతైన ఈ మారక సాధనం శరభయ్య అనుచరుడికెలా వచ్చింది?

వెంకన్నకు ఆలోచించే వ్యవధిలేదు. వాడు క్షణాలమీద వీరభద్రాన్ని చంపగలడు. వెంకన్న వెంటనే తన ఫ్లాష్ కెమేరాకి పనిచెప్పాడు.

శరభయ్య అనుచరుడు ఉలిక్కిపడ్డాడు. ఎవ్వరో తనను ఫోటో తీశారు. అంటే ఈ ప్రాంతాల్లో ఎవ్వరో పొంచి వుండి తనను గమనిస్తున్నారు. వాడికి ముచ్చెమటలు పోశాయి. కంగారుగా చుట్టూ చూస్తున్నాడు.

మెరుపు వేగంతో వెంకన్న అరుగుమీంచి ఉరికి వాణ్ని సమీపించి చావుదెబ్బ కొట్టాడు. వాడు కిక్కురుమనకుండా నేల కూలాడు. వెంకన్న వాణ్ని ఈడ్చుకుంటూ ఎదురింటి అరుగుమీదకు తీసుకుపోయాడు. వాడి దగ్గరున్న మారణాయుధం స్వాధీనం చేసుకున్నాడు.

తన దగ్గరున్న వాకీటాకీని ఉపయోగించి అసిస్టెంట్కుకు సందేశం పంపాడు.

సరిగ్గా అయిదు నిమిషాల్లో సీతమ్మ కారు డ్రైవ్‌చేసుకుంటూ అక్కడికి వచ్చింది.

వెంకన్న తను పట్టుకున్న మనిషిని కార్లోకి మార్చాడు. అయిదు నిమిషాల్లో అంతా ఇల్లు చేరారు.

శరభయ్య అనుచరుడికి స్పృహ వచ్చింది. వెంకన్న వాడిని విషయం చెప్పమన్నాడు.

వెంటనే చెప్పకపోయినా వాడు చెప్పిన విశేషమిది: శరభయ్య వీరభద్రాన్ని తుదముట్టించాలనుకుని వాడికి పని అప్పజెప్పాడు. పని పూర్తిచేస్తూ వాడు పట్టుబడ్డాడు. ఎలా పట్టుబడ్డాడో వాడికే తెలియదు.

వెంకన్న నవ్వి—"నువ్వు కనుచీకట్లో చేసిన మొదటి హత్యా ప్రయత్నం నిన్ను పట్టిచ్చింది" అన్నాడు.

వాడు చిత్రంగా వెంకన్నవంక చూపి — "మొదటి హత్యా ప్రయత్నమేమిటి? ఆ ప్రయత్నంలో నేగదా నేను పట్టుబడ్డాను" అన్నాడు.

ఇద్దరికీ ఒకరి మాటలు ఒకరికి అర్థంకావడానికి కాసేపు పట్టింది.

వీరభద్రాన్ని రాతితో చంపడానికి ప్రయత్నించింది వీడు కాదు-"నా దగ్గర ఇటువంటి ఆధునిక పరికరాలుండగా నాటు పద్ధతులుపయోగించాల్సిన కర్మేంపట్టింది?" అన్నాడు వాడు.

వాడి మాట సబబుగానే తోచింది వెంకన్నకు—"సరే! అయితే నేను చెప్పినట్లు చేస్తే నిన్ను విడిచిపెడతాను. చెయ్యకపోతే పోలీసులకు అప్పజెపుతాను" అన్నాడు.

పోలీసు బారినుండి తప్పించుకునే అవకాశమొకటి వున్నదని తెలియగానే శరభయ్య అనుచరుడికి కాస్త ధైర్యం వచ్చింది—"మీరేం చెప్పినా చేస్తాను" అన్నాడు.

తను పని పూర్తిచేసినట్లుగా వెంకన్న వాడిచేత శరభయ్యకు ఫోన్ చేయించాడు. మొత్తం సంభాషణ అంతా టేప్ చేశాడు.

"ఇప్పుడు నీయొక్క, నీ బాస్‌యొక్క ప్రాణాలు నా గుప్పెట్లో వున్నాయి. ముందెన్నడైనా ఇలాంటి నేరాలకు



తలపడ్డావా, పులుసులోకి ఎముకలేకుండా తన్ని అప్పుడు నిన్ను పోలీసులకి అప్పగిస్తాను. వెళ్లు. వెళ్ళేముందు నీ పేరు చెప్పి వెళ్ళు" అన్నాడు వెంకన్న.

"నా పేరు వీర్రాజండి. నన్నంతా ఛాలెంజి రౌడీ అంటారండి" అన్నాడు వాడు.

"ఇంకమీదట నిన్ను వీర్రాజనే పిలవమను" అన్నాడు వెంకన్న.

5

"హలో!" అన్నాడు వెంకన్న.

అవతలివైపు కంఠం కంగారుగా ధ్వనించింది - "ఒక్కసారి అర్జంటుగా మా ఇంటికి రావాలి."

కంఠాన్ని గుర్తుపట్టాడు వెంకన్న — "వీరభద్రమేనా మాట్లాడుతూంట? ఏం జరిగింది?"

"తెల్లవారుఝామున నాపై హత్యాప్రయత్నం జరిగింది" అన్నాడు వీరభద్రం.

"సరే అయితే ఇప్పుతే వస్తున్నాను" అంటూ రిసీవర్ క్రేడిల్ చేశాడు వెంకన్న. "ఇది ఎలా జరిగిందా" అని ఆలోచిస్తూండగా బల్లమీద ఇంకో ఫోన్ మ్రోగింది. అది

వంటింటి ఫోన్.

రిసీవర్ ఎత్తగానే "కాఫీకి రండి" అంది పద్మావతీదేవి.

"సారీ దేవీ! కలిసి కాఫీతాగే అదృష్టం ఈ పూటకు లేదు. నా కాఫీ వీరభద్రం ఇంట్లో తాగుతాను" అని ఫోన్ పెట్టేశాడు వెంకన్న.

"మమ్మల్నికూడా రమ్మంటారా?" అంది సీతమ్మ.

"వద్దు" అంటూ లేచాడు వెంకన్న. వీరభద్రం మీద హత్యా ప్రయత్నం యెందుకూ, ఎలా జరిగిందన్న విషయం అతను తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

రాత్రి తను వీర్రాజుని వదిలిపెట్టి తన మాటగా శరభయ్యకు ఏం చెప్పాలో చెప్పాడు. తననుంచి ఆ హెచ్చరిక అందేక శరభయ్యే మరి పిచ్చిపనులు చేయకూడదు. చేశాడో— వాడికి మూడిందన్నమాటే.

వెంకన్న ఆఘమేఘాలపైన వీరభద్రం ఇల్లు చేరుకుని- "ఏం జరిగిందో చెప్పు-కాఫీకూడా తాగకుండా నీ ఇంటికి వచ్చాను" అన్నాడు.

వీరభద్రం వివరాలు చెబుతుండగా కాఫీ వచ్చింది. ఆ వివరాలు వింటూనే వెంకన్న కాఫీ తాగాడు.

రోజూ తెల్లవారుఝామునే తోటలో తిరగడం వీరభద్రానికి అలవాటు. ఆ సమయంలో మల్లెపొదల చాటు నుంచి ఓ మనిషి కాళ్ళు కనపడ్డాయాయనకు. చప్పుడు చేయకుండా వెళ్ళి వాణ్ని పట్టుకోవాలనుకున్నాడు. పట్టుకోగానే వాడాయన్ను ఒక్క తోపు తోసి చేతిలో వున్న కర్రను పైకెత్తాడు. ఈలోగా అలికిడికీ, కేకలకూ తోటమాలులిద్దరు పరిగెత్తుకు వచ్చారు. వాడు గోడదూకి పారిపోయాడు. మనిషి దొరకలేదు. వాడి ఆచూకీ తెలియలేదు.

"వాణ్ని మళ్ళీ చూస్తే గుర్తుపట్టగలవా?" అన్నాడు

వెంకన్న.

"పట్టలేను. లేబర్ మనుషులు నాకు అందరూ ఒక్క-లాగే కనబడతారు. ఎన్నిసార్లు చూసినా నాకు వాళ్ళ ముఖాలు గుర్తుండవు" అన్నాడు వీరభద్రం చిరాగ్గా.

"లేబర్ అంటే నీకు గిట్టదా?" అన్నాడు వెంకన్న.

"గిట్టదని కాదు. చిన్నప్పట్నించీ వాళ్ళకు దూరంగా పెరిగాను. వాళ్ళంటే కోపం లేదుగానీ ఏహ్యభావం ఏర్పడిపోయింది. అంతే!" అన్నాడు వీరభద్రం.

"అంటే నువ్వెప్పుడూ వాళ్ళ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవా?" అన్నాడు వెంకన్న.

"చేసుకోను."

"ఇంతవరకూ ఒక్క-సారికూడా వాళ్ళ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదా?" అన్నాడు వెంకన్న.

"లేదు" అని—"ఆగు-ఓ విషయం గుర్తుకొస్తోంది. కొద్ది రోజుల క్రితం ఓ లేబర్ ఆడదాన్ని దాని భర్త బారి నుంచి రక్షించాను" అన్నాడు.

"వివరంగా చెప్పు" అన్నాడు వెంకన్న కుతూహలంగా.

తన కారు చెడిపోయినప్పుడు జరిగిన సంఘటన వివరించాడు వీరభద్రం.

వెంకన్న సాలోచనగా తలపంకించి—"ఇప్పుడు నాకు విషయం అర్థమయింది—నిన్ను చంపడానికి ప్రయత్నిస్తున్నది ఆ లేబర్ ఆడదాని భర్తే!" అన్నాడు.

"వాడు.... ఆ బ్రూట్....నన్ను చంపడానికి ప్రయత్నిస్తున్నాడా?" అన్నాడు వీరభద్రం ఆవేశంగా.

"అవును మరి-నీకు సంబంధంలేని విషయంలో నువ్వు నలుగురిముందూ కొట్టావు. నీ వేషానికీ, అర్థబలానికీ బెదిరి అప్పటికి పారిపోయిన వాడి మనసు నిండా కక్ష పేరుకు

పోయి—చాటుగా నిన్ను దెబ్బ తీయడానికి చూస్తున్నాడు. అసలు వాడెవరో, పెళ్ళాన్నెందుకు కొడుతున్నాడో, సంగతేమిటో దాని పరిష్కారమేమిటో నువ్వు ఆలోచించావా? అప్పటికి వాణ్ని నాలుగు తన్ని వదిలిపెడితే వాడి సమస్య తీరుతుందా.ఆడదాని సమస్యతీరుతుందా?వాణ్ని మనిషిగా అర్థం చేసుకుని వాడి సమస్యకు పరిష్కారం చూపగలిగినప్పుడే నువ్వూ మనిషివనిపించుకుంటావు'' అన్నాడు వెంకన్న.

"వాడెవరైతే నాకెందుకు?''అన్నాడు వీరభద్రం చిరాగ్గా.

''వాడు యెవరైనా నీ ప్రాణదాత. వాడు నీపై చేసిన హత్యాప్రయత్నం నిన్ను నా దగ్గరకు తీసుకొచ్చింది. అదే నీ ప్రాణాలు కాపాడింది. నిన్ను చంపడానికి శరభయ్య వేసిన తిరుగులేని పథకం చెడిపోయింది—'' అంటూ వెంకన్న వీరభద్రానికి జరిగినదంతా చెప్పాడు.

వీరభద్రం గుడ్లు తేలేసి అంతావిని "వాడు చంపాలనుకోవడమే నన్ను కాపాడిందన్న మాట—" అన్నాడు. "అయితే వాణ్ని వెంటనే సన్మానించాలి. కానీ వాడు నాకెక్కడ దొరుకుతాడు?''

"ఏమీ అనుమానంలేదు. వాడు నీమీద యింకా హత్యాప్రయత్నాలు చేస్తాడు. అప్పుడు వాణ్ని పట్టుకుని, సన్మానించి—మనిషిగా వాడికున్న సమస్యలు తెలుసుకుని సాయపడు! ఒక లేబర్‌వాడి కారణంగానే నీ ప్రాణం నిలబడిందని గ్రహించి-వాళ్ళను మనుషులుగా గుర్తించడం నేర్చుకో. నేనింక వస్తాను" అన్నాడు వెంకన్న.

వీరభద్రం వెంకన్నకు రెండువేల రూపాయలు ఫీజు ఇచ్చాడు. ప్రాణాలు కాపాడినందుకో, సలహా యిచ్చినందుకో మరి! ఏదయినా సమానమయిన విలువ కలిగినవే కదా!

□

వి.మధుసూదన్

ద్రోహి

"మీరు ఎలాగయినా కాస్త సహాయం చెయ్యాలి సార్. పరిస్థితి ఏమీ బాగాలేదు...." ఆ మాటలు రాజంగార్ని కలుసుకున్న అరగంటలోనూ ఏ ఇరవయ్యవసారో నేను

అనటం.

"రేపు రా చూద్దాం" అన్నాడాయన లేస్తూ. మరోసారి నమస్కారం పెట్టి వచ్చేశాను.

పెద్ద ఫ్యాక్టరీ ఉందాయనకి. 20 ఏళ్ళనుంచి విజయవంతంగా నడుస్తోంది. వర్కర్స్ ఎవ్వరికీ అసంతృప్తి కలగకుండా చూసుకుంటాడట ఆయన. కానీ అక్కడ ఉద్యోగం దొరకడమే కష్టమని చెప్పుకుంటారు.

మూడురోజుల క్రితం కలుసుకుని నాగోడు చెప్పుకున్నానాయనకి. ఈరోజు రమ్మన్నాడు. ఈరోజు మళ్ళీ రేపు రమ్మంటున్నాడు.

మర్నాడు ఆయన చెప్పిన సమయానికి వెళ్లాను. కారు బయలదేరడానికి సిద్ధంగావుంది. టైం చూసుకుంటూ కారు యెక్కుతున్న ఆయన నన్నుచూసి 'కూచో వస్తాను' అని వెనకసీట్లో కూలబడ్డాడు.

కారు కదిలిపోయింది. మంచి ఒడ్డూ పొడుగూ కల భారీ వ్యక్తి రాజం. ఆయన పూర్తిపేరు రంగరాజం. అంతా రాజంగారని పిలుస్తారు.

వరండాలో చల్లగావుంది. అక్కడి సిమెంట్ బెంచీ మీద కూచున్నాను. ఎవ్వరూ లేరా చుట్టుపక్కల. కాసేపు కూచున్నాక విసుగుపుట్టింది. లేచి అటూయిటూ పచార్లు చేయసాగాను.

పెద్ద బంగళా అది. విశాలమైన కాంపౌండ్. గేటు నుంచి బంగళాకు కనీసం అరఫర్లాంగు దూరముంటుంది. తోట చాలా చక్కగా వుంది. నేనింతవరకూ చూడని అద్భుతమైన పూలమొక్కలున్నాయి. మూడంతస్తుల మేడ అది.

పైకి దృష్టి సారించాను. పై అంతస్తులోని ఓ కిటికీ

తెరిచివుంది. నా దృష్టి ఆ కిటికీమీద పడగానే ఎవరో చటుక్కున పక్కకు తొలగినట్టనిపించింది. బహుశా అంతవరకూ నన్నే గమనిస్తూ వుండి వుండవచ్చు. ఎవరో ఆ వ్యక్తి.

మరో అయిదు నిమిషాలు పచార్లు చేశాక తిరిగి బెంచీ మీద కూచున్నాను. కాసేపు గడిచాక తల ఎత్తి ఇందాకటి కిటికీ వంక చూశాను. అక్కడ నిలబడివుందో అమ్మాయి. నేను చూసిన తక్షణమే చూపు మరల్చుకోవాలని ప్రయత్నించింది. కానీ కళ్ళు కలవనే కలిశాయి. చటుక్కున తప్పుకుంది. చిరునవ్వు అస్పష్టంగా కానవచ్చింది.

రెండుమూడు క్షణాలు. అంతే. కానీ ఆ అతితక్కువ వ్యవధిలోనే ఆ రూపం నా మెదడులో స్థిరంగా నిలిచిపోయింది.

బాబ్డ్ హెయిర్; చెవులకు రింగులు, విశాలమయిన కళ్ళు. ఆ అందమైన మొహానికి అమరిన చక్కని, సన్నని ముక్కు, పల్చటి పెదాలు....16—17 మధ్య ఉంటుంది వయసు. లేతగులాబీ రంగు బెల్స్ వేసుకుని ఉంది. హార్ట్ స్ట్రియికింగ్ బ్యూటీ....ఎంత అందమైన నవ్వు అది!

ఎవరు ఈ టీనేజ్డ్ బ్యూటీ... మరికాసేపు ఆశగా ఆ కిటికీవంక చూసి ఆ అమ్మాయి మళ్ళీ కనిపించకపోడంతో గేటువేపు చూడసాగాను.

కాసేపటి తరవాత కారొచ్చింది. ఆయన హుందాగా దిగి లోపలికి వెళ్ళిపోయాడు. మరో పదినిమిషాల తరువాత ఎవరో నౌకరొచ్చి 'అయ్యగారు పిలుస్తున్నారు' అని చెప్పాడు.

లేచి వెళ్లాను. లోపల సోఫాలో కూచునివున్న ఆయన

నన్నుచూపి 'రేపు ఫాక్టరీకి రా. ఒకనెల అప్రెంటిస్ షిప్ తర్వాత జాబ్‌లో చేరొచ్చు' అన్నాడు. నమస్కరించాను. తలాడించగానే వచ్చేశాను.

చాలా సంతోషంగా వుంది నాకు. వస్తూ మళ్ళీ గేటు దగ్గర క్షణం ఆగి పైకి చూశాను. మళ్లీ కనిపించింది ఆ అమ్మాయి. ఎవరో ఆ అమ్మాయి? ఎంత అందంగా ఉంది? ఏదో అద్భుతమైన ఆకర్షణ ఉందా అమ్మాయిలో. ఎందు కలా చిరునవ్వు నవ్వుతూంది? ఆ నవ్వు....

మర్నాడు ఫ్యాక్టరీకి వెళ్లాను. మేనేజర్‌కి చూపి మాట్లాడాడు ఆయన. ఆ రోజునుంచి ఫ్యాక్టరీలో స్థిరపడ్డాను.

మూడు రోజుల్లో అక్కడి వాతావరణానికి బాగా అల వాటు పడిపోయాను. వర్కర్స్ ఒకొక్కరితోనూ పరిచయ మౌతోంది. రాజంగారితో వాళ్ళ ప్రవర్తనను బట్టి నేనా ఫ్యాక్టరీ గురించివిన్న విషయాల్లో అతిశయోక్తి ఏదీలేదని తెలుస్తోంది?

చాలా వినయంగా ప్రవర్తిస్తున్నాను ఆయనతో. మరో వారం గడిచేసరకి నాపట్ల ఆయన ధోరణి కాస్తమారింది. మునుపటంత ముక్తసరిగా ఉండటం లేదు. రోజూ సాయంత్రం ఆయన ఇంటికెళతున్నాను.

ఆరోజు కనిపించిన అమ్మాయి రాజం కూతురు. పేరు కవిత. ఆయన కింకెవరూలేరు. భార్యపోయింది. కూతురు తప్ప ఆయనకు ప్రియమైనదేదీ లేదు.

స్వలాభంతోపాటు వర్కర్ల క్షేమాన్ని కోరుతాడాయన. అందరికి మంచి జీతాలూ బోనస్‌లూ....నాకు అడ్వాన్సుగా రెండువందల లిచ్చాడాయన.

కవిత ఇప్పుడు నాతో మాట్లాడుతోంది. ఎంత అంద మైనదో అంత చురుకుదనం కలది కవిత. కానీ కాస్త

అమాయకత్వమూ లేకపోలేదు తనలో. ఆ అమాయకత్వమే నన్నమితంగా ఆకర్షించింది.

2

మరో మూడునాలుగురోజుల తరువాత నా గదికొచ్చాడు శివన్. నేను అప్పుడే ఫాక్టరీ నుంచి రూమ్‌కివచ్చి ఏదో మేగజైన్ చదువుతూ కూచుని వున్నాను.

"హలో బ్రదర్ బాగున్నావాః" అన్నాడు శివన్.

"ఆఁ నీకోసమే చూస్తున్నాను. ఏమిటిదిః వారంరోజుల్లోగా వస్తానన్నావు. చేరినట్టు రిపోర్ట్‌యిచ్చి పదిరోజులు అయింది. ఇప్పుడా వచ్చేదిః" అన్నాను విసుగ్గా.

"బాస్ అప్పుడే వద్దన్నాడు. నీవు అక్కడి పరిస్థితులకి 'అక్లమటైజ్' అవడానికి టైమ్ పడుతుందని ఆయన అంచనా. అందుకే ఈరోజు పంపించాడు నన్ను. ఇంతకీ ఏమిటి విశేషంః ఎంతవరకూ వచ్చిందిః" అడిగాడు శివన్ చుట్ట వెలిగించుకుంటూ.

"ఏమీ రాలేదు. నేను బాస్‌కి ఓ సలహా యిద్దామనుకుంటున్నాను. మన ప్లాన్ ఫలిస్తే రాబోయే లాభంకన్నా కొన్నిరెట్లు లాభకరమైన స్కీం మరొకటి తట్టింది నాకు. దాన్ని గురించి ఆలోచిస్తున్నాను."

"ఏమిటదిః బాస్ ప్లాన్‌కన్నా నీ పథకం గొప్పదాః అతితెలివి పనులకు బాస్ వప్పుకోడని నీకు తెలీదాః" అన్నాడు.

"అంతా తెలుసు. నువ్వనవసరంగా అరవకు. పద బాస్ దగ్గరికెళ్ళాం" అన్నాను పాంటూ స్లాకూ తొడుక్కుంటూ. ఏదో గొణుక్కుంటూ విసుగ్గా బయటకి నడిచాడు శివన్.

బాస్ నేనుచెప్పింది విని, "ఇంతకీ నువ్వనేదేమిటిః"

అడిగాడు బాస్.

"రాజంని యెలాగో నమ్మించి ఫాక్టరీలోచేరి సాధ్య మైనంత త్వరలో ఇంట్లోని, ఫాక్టరీలోని సేఫ్‌ల వివరాలు కనుక్కొని ఆ రెండూ ఖాళీచేసి బయటపడ్డం మీరు చెప్పిన పథకం. నా ప్లానూ అదే, కానీ ఒక చిన్న అమెండ్ మెంట్. వచ్చేనెల అంటే జూన్‌నెలలో ప్రతి వర్కర్‌కీ బోనస్ ఇవ్వబోతున్నాడు రాజం. బోనస్ ఒకనెల జీతం కాదు. మూడునెలల జీతం. కారణం అతని సంతోషం. సంతోషానికి ఒక కారణం ఈ సంవత్సరం యెన్నడూ లేనన్ని లాభాలయితే, మరోటి కూతురు కవిత ఇంటర్‌లో కాలేజీ ఫస్ట్ రావటం.

జూన్ అయిదున ఆ డబ్బు డిస్పర్స్ చేయబడుతుంది. 4వ తారీకున మేనేజర్ ఖయ్యూమ్ ఆ డబ్బును బాంక్‌నించి డ్రాచేసి తెచ్చి ఫాక్టరీలోని సేఫ్‌లో ఉంచుతాడు. నాలుగు రాత్రంతా డబ్బు సేఫ్‌లోనే వుంటుంది. ఆ ఒక్కరాత్రిలో దాన్ని కైవశం చేసుకోగలగాలి.

మీరు చెప్పిన ప్రకారం ఇప్పుడే ఆ కాంబినేషన్ వివ రాలు తెలుసుకొని ఆ డబ్బు కొట్టేస్తే వచ్చేదెంత? మరో నెలరోజులు ఓపికపడితే అంతకు మూడురెట్లు డబ్బు దొరుకుతుంది. ఆలోచించండి. దాదాపు 150 వర్కర్స్ పనిచేసే చోటు...."

బాస్ మెచ్చుకోలుగా చూశాడు.

"గుడ్, నా ప్లానూ నీదీ ఒకటే. కాకపోతే కాస్త ఆలశ్యం. ఓ. కే. మరి ఇంటి సంగతి?"

"రెండు సేఫ్‌ల కాంబినేషన్‌లూ వొకేసారి తెలుసుకో గలను. రాజంద్వారా అవి తెలుసుకోవటం అసంభవం. వేరే మార్గాలు ఆలోచిస్తున్నాను."

"ఊ. నువ్వు ఇదంతా యెంత త్వరగా సాధించగలి గితే అంత మంచిది. అఫ్‌కోర్స్. కాంబినేషన్స్ యీ క్షణమే కనుక్కున్నా నెలవరకూ వెయిట్ చెయ్యక తప్ప దనుకో...." అన్నాడు బాస్.

"ఓ. కే. బాస్. వస్తాను" అని వచ్చేశాను.

బాస్ చాలా తెలివైనవాడు. అంత తెలివిగలవాడు కాక పోతే నన్నూ శివన్‌నీ తన అనుచరులుగా మార్చుకొని ఇన్ని దొంగతనాలు ఎలా చేయించ గలుగుతాడు.

మేం ముగ్గరమూ కలిపి ఇంతవరకు చిన్నా పెద్దాకలిపి పాతికవరకూ దొంగతనాలు చేశాము. ఏ అసైన్‌మెంటూ ఫెయిల్ కాలేదు. ప్లాన్ బాస్‌ది. అమలు పరిచేపని మాది. ఫలితంలో సగం బాస్‌వంతు. మిగిలిన దాంట్లో నాకూ శివన్‌కూ సమాన వాటాలు.

వాళ్ళిద్దరూ ఏమాత్రం కూడబెట్టారో నాకయితే తెలీదు గానీ నేను మాత్రం పైసాకూడా దాచుకోలేదింత వరకూ.

డబ్బు చేతికివచ్చిన తక్షణం దాన్ని ఏ విధంగా ఖర్చు పెట్టాలా అని స్కీములు ఆలోచిస్తుంది నామనసు. మొన్న ఉద్యోగంకోసం దీనంగా రాజం దగ్గరకి వెళ్ళినపుడు నా నటన చాలా సహజంగా ఉంది. కారణం నిజంగా జేబులో పైసా లేకపోవటమే!

విచిత్రమేమిటంటే ఇన్ని దొంగతనాలు జయప్రదంగా చేసినా ఇంతవరకూ నాపేరు, వివరాలు మటుకు పోలీసు రికార్డులలోకి యెక్కలేదు. బాస్ రాజం దగ్గరకి నన్నేపంప డానికి కారణంకూడా అదే.

శివన్ ఆరడుగులకు పైచిలుకు యెత్తు. సమ్మర్ క్రాపు, మెల్లకన్ను, బండముక్కు, బుగ్గమీద కత్తిగాటుతో అచ్చ మైన 'క్రూక్'లా ఉంటాడు.. ఆరడుగుల యెత్తు లేక పోయినా, సామాన్యమైన హైట్‌కన్నా నా ఎత్తు ఎక్కువే. తెల్లటి ఒంటిరంగు, హిప్పీక్రాప్, పొడుగయిన సైడ్ బర్న్సుతో, కోలమొహంతో చూడగానే కాలేజీస్టూడెంట్ అనిపించేలా ఉంటాను.

నేనెక్కడ పుట్టానో వివరాలేమిటో నాకే తెలియదు. బాగా బుద్ధితెలిసే సరికి అనాథశరణాలయంలో ఉన్నాను. పదమూడో ఏట ఆ జీవితం విసుగు కలిగించింది. అక్కడ నుంచి పారిపోయివచ్చి ఏదో హోటల్‌లో క్లీనర్‌గాచేరాను. మూడేళ్ళు యేవో వివిధ హోటల్సులో పనిచేశాను. కడుపు నిండినా తృప్తిలేకుండా పోయింది. ఖరీదయిన బట్టలు వేసుకొని తిరిగే నా వయసు కుర్రాళ్ళనిచూసి నేనూ అలా దర్జాగా తిరిగితే బాగుండుననిపించేది.

ఏదో సినిమాకెళ్ళానో రోజు. ఎవడో ఇంకొకడి జేబు కొట్టెయ్యడం మొదటిసారి చూశాను. సినిమా వదిలారు. ఆ జనంలో నా పక్కవ్యక్తి తనముందున్న మనిషిజేబులో

చెయ్యిపెట్టి లాఘవంగా పర్స్‌తీసేసి తనజేబులో తోసేసి పక్కకి తొలిగాడు. అంతా రెండుమూడు క్షణాల్లా జరిగి పోయింది. నేను తప్ప యిది యెవరూ గమనించినట్టు లేదు.

పిక్‌పాకెటింగ్ మొదలు పెడదామన్న ఆలోచన అప్పుడే మొట్టమొదటి సారిగా వచ్చింది.

బస్‌స్టేషన్‌లో ట్రై చేశాను. క్యూలో నిలబడ్డాను. నా ముందున్న మనిషి వెనకజేబులో అనువుగా పెట్టుకొని ఉన్నాడు పర్స్‌ని ఎత్తుగా కనిపిస్తోంది పర్స్. మెల్లిగా కుడిచేయి ఎత్తాను. విపరీతమైన జనం.

చెయ్యి ఆ పర్స్‌కి తగిలించాను. గుండె వేగంగా కొట్టు కుంటూంది అతనేం పట్టించుకోలేదు. మోకాళ్ళు వణుకు తున్నాయ్. లాగేయ్ .... లాగేయ్....అంటోంది మనసు. చేతులు కదలటంలేదు. బుకింగ్ మొదలయింది. జనం తోసుకోవడం మొదలుపెట్టారు.

ఇక ధైర్యం చెయ్యకపోతే లాభంలేదని గబుక్కున రెండువేళ్ళతో ఆ పర్స్‌నిలాగి నా జేబులో దూర్చేసి కిందికి జారి ఇవతలికి వచ్చేశాను.

టికెట్ల గొడవలోవున్న జనం నన్ను పట్టించుకోలేదు. గబగబా రోడ్ చేరుకున్నాను. హోటల్ చేరుకున్నాక ఆ డబ్బు యెంచుకున్నాను. నాలుగువందల రూపాయలు చిన్నా పెద్దా నోట్లు అన్నీ కలిపి. మిగతావన్నీ ఏవో స్లిప్స్.

అంతే. మొదటి ప్రయత్నమే సక్సస్ కావడంతో ధైర్యం హెచ్చింది. ఇక ఇదే నా వృత్తిగా మారింది. కాని హోటల్ పని మటుకు 18వ ఏడు వచ్చేవరకూ మాన లేదు. తర్వాత వేరే రూమ్ తీసుకొన్నాను.

ఇరవయ్యవ యేట బాస్ కలిశాడు. అతనితో పరిచయం

నేను అతని జేబు కొట్టెయ్యబోయినప్పుడే కలగడము విచిత్రం.

ఇక ఆ తర్వాత బాస్ దగ్గరే స్థిరపడ్డాను. శరణాలయం నుంచి వచ్చేసినప్పుడు ఎనిమిదవ తరగతి స్టాండర్డ్ ఉంది నాకు. హోటల్స్‌లో పనిచేస్తున్నప్పుడు కృషిచేసి మరి కాస్త చదువు చేర్చుకున్నాను. బాస్ దగ్గరకొచ్చాక ఇంగ్లీష్ బాగా అలవాటైపోయింది. ఇప్పటి కాలేజ్ స్టూడెంట్స్ చాలామందికంటే నేను ఇంగ్లీష్ ధాటీగా మాట్లాడగలను. ఫ్రెండ్స్ యెవ్వరూ లేరునాకు. ఏ మాత్రం తీరిక దొరికినా నవలలు....ఇంగ్లీష్, తెలుగు రెండు భాషలవి చదవటం అలవాటైపోయింది.

నేనుచేసే ఈ పనికి అన్నిటికన్నా ముఖ్యంగా కావలసినవి రెండే రెండు. ధైర్యం, తెలివి. అవి రెండూ నాలో తగిన పాళ్ళలో ఉన్నాయని నా ఉద్దేశ్యం.

చేతుల్లో డబ్బు ధారాళంగా ఆడుతున్నప్పుడు వ్యసనాలు అలవడ్డం చాలా సహజం. నేనూ వాటికి లొంగక తప్పలేదు. నేను మొట్టమొదటిసారిగా లికర్ రుచిచూసింది బాస్‌తోనే. సిగరెట్ అంతకుముందే యెప్పుడో అలవాటు అయింది.

ఇక అమ్మాయిలు! నా బట్టలు, మాటలతీరుకి, నా డబ్బుకి ఎంతమందో తాముగా నాకు దగ్గరయ్యారు. వచ్చిన అవకాశమేదీ నేను జారవిడుచుకోలేదు.

ఈ విధంగా 26 ఏళ్ళు నిండకముందే నేనన్ని విధాలా ఆరితేరి ఉన్నాను.

ఇంతకుముందు నాకు తారసపడ్డ అమ్మాయిలందరికంటె అద్భుతంగా ఉన్నది కవిత. వాళ్ళందరూ అందగత్తెలే. కానీ కవిత గ్రేస్ వాళ్ళెవరిలోనూ లేదు. వాళ్ళెవరూ అనా

ఘ్రాత పుష్పాలుకారు. కవిత యంగెస్ట్, ఫ్రెషెస్ట్, లవ్‌లీయెస్ట్. విరిసీ విరియని పువ్వు కవిత. తనలో అన్నిటి కన్నా నన్ను ఆ కట్టుకున్నవి ఆ కళ్ళే. ఎంత అమాయకత్వం వున్నదో అంత చిలిపితనంకూడా వుంది ఆ కళ్ళలో.

రోజూ సాయంత్రం కవితతోనే గడిపేస్తున్నాను. కవిత తండ్రికూడా నన్నేమీ అడ్డుపెట్టకపోవడం నా అదృష్టమే కవిత తానుగా నాకు సన్నిహితురాలవాలని ప్రయత్నించటం అంతకన్నా అదృష్టం.

ఆ సాయంత్రం మామూలుగా మాట్లాడుకుంటున్నాము. నౌకర్లెవరూ లేరు. రాజం మిద్దెపైనున్నాడు.

ఉన్నట్టుండి 'కవితా. నిన్నెప్పుడన్నా యెవరన్నా ముద్దాడారా?' అడిగాను. తన మొహం యెర్రబడింది. నాకు కాస్త దగ్గరగా కూచుని వున్నదల్లా దూరం జరిగి 'ఛీ. లేదు! ఏమిటా మాటలూ?' అంది సిగ్గుతో.

'నేను నిన్ను ముద్దుపెట్టుకోనా?' అడిగాను.

'ఛి. నువ్విలా మాట్లాడావంటే నే లేచి వెళ్ళిపోతాను.'

'అంటే నీకు ధైర్యం లేదన్న మాట. పిరికిదానివి.'

'నేనేం పిరికిదాన్ని కాను' అంటూ లేవబోయినదల్లా కూచుంది.

'నువ్వు నిజంగా పిరికిదానివి కాకపోతే ఇంత భయపడి పారిపోతావా ముద్దంటే?' అన్నాను కవ్వింపుగా.

'మళ్ళీ అదే మాట. నేనేం భయపడలేదు' అంది.

'సరే. నువ్వు నిజంగా ధైర్యస్తురాలివే-అయితే ఒక్కసారి ముద్దుపెట్టుకోనివ్వాలి. లేకుంటే నువ్వు భయపడుతున్నావని....' అన్నాను నవ్వుతూ.

'నాకు భయం లేదు లేదు లేదు' అంది కవిత.

'ఓ.కే. అయితే లేచి నిలబడు' అన్నాను. నిలబడింది.

నేనూ నిలబడి ముందడుగేశాను. గబుక్కున తనని బలంగా నా గుండెలకు హత్తుకుని వీపు నిమురుతూ తల యెత్తి అదురుతున్న ఆ యెర్రటి పెదాలమీద నా పెదాలానించి చుంబించాను. తన గుండె చప్పుడు వినిపిస్తూంది. తన అంగాంగమూ కంపిస్తూంది? గువ్వలా ఒదిగిపోయింది. కళ్లు అరమూతలు పడ్డాయి.

నాకు తెలుసు. అది తన తొలి ముద్దు. కానీ నాకూ అదే తొలి ముద్దని అనిపించింది. ఆ క్షణాన్నే కవిత మీద విపరీతమైన ప్రేమ అంకురించింది. మరోసారి సున్నితంగా ఆ కళ్ళను, బుగ్గలను నుదురుని, పెదాలను ముద్దాడాను. తనని వదలలేక వదిలాను.

కళ్ళు తెరిచి 'సో యువర్ నాట్ కవర్డ్' అన్నాను నవ్వుతూ.

తన కళ్ళు మెరుస్తున్నాయి. 'యు నాటీ' అంటూ గబ గబా లోపలికి పరుగెత్తింది సిగ్గుతో.

వారంరోజులు కాలేదిది జరిగి. కవిత నాతో యింకా చనువుగా ప్రవర్తిస్తోందిప్పుడు. రెండు మూడు సార్లు రహస్యంగా ముద్దాడాను. స్టోలెన్ కిసెస్ ...

నేను దొంగనే. కానీ నాకూ కొన్ని ప్రిన్సిపల్స్ వున్నాయి. బాస్, శివన్‌లకు అలాంటివేవీ లేవు. నాకు హత్యలు చేయడం ఇష్టం లేదు. బీదవాళ్ళ డబ్బు వచ్చినా ముట్టను. ఎందుకంటే, కాలే కడుపు, పేదవాళ్ళ అవస్థలు నాకు బాగా అనుభవమే.

శివన్ కేరళలో పేరుమోపిన దొంగ, హంతకుడు. అనేక భారీ దొంగతనాలకూ, హత్యలకూ అతనే బాధ్యుడని పోలీసులు అతనికోసం గాలిస్తున్నారు. కేరళలో నాలుగు క్రూర హత్యలు చేశాడట. ఇక్కడికొచ్చి పేరు,

వేషం మార్చుకుని బాస్ దగ్గర స్థిరపడ్డాడు. నాకన్నా ఒక సంవత్సరమే పెద్దవాడు శివన్. అతనే చెప్పాడీ వివరాలన్నీ నాతో.

3

ఆ రోజు ఆదివారం. రాజం ఊళ్ళో లేడు. కవిత, నేను లాన్‌లో కూచుని వున్నాము.

"కవితా" పిలిచాను మెల్లగా ప్రారంభిద్దామా అని ఆలోచిస్తూ.

"ఊఁ"

"నాకో చిన్న హెల్ప్ చెయ్యాలి."

"ఓ. ఏమిటది?"

"చేస్తానని ప్రామిస్ చెయ్యి. మాట తప్పకూడదు."

"ప్రామిస్" అంటూ తన మెత్తని చెయ్యి నా చేతిలో వుంచింది. దాన్ని ఆప్యాయంగా ముద్దాడాను....

"మాట యిచ్చావు తప్పకూడదు."

"ప్రామిస్ మీద నీకు నమ్మకం లేదన్నమాట" చిరుకోపంతో అంది.

"ఓ. కే? డార్లింగ్. మాట నిలబెట్టుకోలేక పోయావో ఇక జన్మలో నీకు నా మొహం చూపను" ఈ మాటలు చెప్పడానికి కాస్త కష్టం వేసినా తప్పలేదు డబ్బు.... బాస్ ...

"ఏం చేయాలో చెప్పు" అదోలా అంది.

"ఎలాగైనా మీ నాన్న నుంచి ఫాక్టరీలోని ఐరన్ సేఫ్‌ల కాంబినేషన్స్ తెలుసుకోవాలి నువ్వు."

ఆశ్చర్యంతో, భయంతో, చూస్తూ 'ఎందుకు' అంది కవిత.

"నిజం చెప్పమంటావా?"

"ఊ" అంది. ఆ కళ్ళల్లో భయం పోలేదు.

"ఇది సీక్రెట్ టెస్ట్. నీకు నా మీద నిజమైన ఇష్టం వుందో, లేదో తెలుసుకోవడానికి."

"నిజంగా?"

"ప్రామిస్" అంటూ తన చేతిలో నా చేతిని వేశాను బాధతోనే. అసలు ఎంత అర్థం లేకుండా ప్రవర్తిస్తున్నాను నేను? నా ప్రశ్న ఆంతర్యమేమిటే తనకు అర్థం కాకుండా వుంటుందా? ఏమిటో....యెన్నడూ లేనిది నాలో ఏదో సంఘర్షణ లాంటిది ప్రారంభమౌతోంది.

ప్రామిస్‌ను నమ్ముతుంది కవిత.

"అయితే తప్పకుండా తెలుసుకుంటాను" అంది.

"నువ్వు డైరెక్టుగా కాంబినేషన్ చెప్పమని అడిగేస్తే బాగుండదు. అనుమానం రావచ్చు. ఇంతవరకూ ఆయన సేఫ్ తెరుస్తోండగా ఎప్పుడూ నువ్వు గమనించలేదా?" అడిగాను.

"నేనా? లేదు. ఆ రూమ్‌లో కెళ్ళాల్సిన అవసరమే రాలేదింతవరకూ. ఆయన అసలింకెవ్వరినీ ఆ రూమ్‌లోకి

అలో చెయ్యడు. నన్ను బహుశా అడ్డుపెట్టడు నేవెళితే."

"ఓ.కే. అయితే ఈరోజు ఆయన సేఫ్ తెరుస్తున్నప్పుడు నువ్వా అక్కడవుండి ఏ ఏ నెంబర్లు కాంబినేట్ అయితే లాక్ తెరుచుకునేది గమనించి నోట్ చేసుకో."

"మరి ఫ్యాక్టరీ?"

"రేపు ఫాక్టరీకి వెళ్ళే సమయంలో నువ్వా వస్తానను. కాదనడు. వెళ్ళి ఇక్కడిలాగే అక్కడా చెయ్యి."

"ఓ.కే. అలాగే" ఉత్సాహంగా అంది కవిత. ట్రెజర్ హంట్ కెళ్ళబోయే చిన్నపిల్లలా థ్రిల్ ఫీలవుతోంది.

ఎందుకు వొప్పుకుంది నే చెప్పిన పనికి? తనకు నామీద అనుమానం రాలేదా? అథవా వచ్చినా నామీది ఫాసినేషన్ ఆమె నా పనికి పురిగొల్పుతోందా?

ఏది ఏమయినా....ఇలా చెయ్యడం భావ్యంకాదేమో?

మరి కొంతసేపు గడిచాక 'సరే. నేనిక వస్తాను' అని లేచి చటుక్కున తన నుదురుమీద ఓ ముద్దుపెట్టి వచ్చేశాను.

కవిత....వాట్ ఏ నైస్ గర్ల్ షి ఈజ్....కానీ....నేను తనని మోసం చేస్తున్నాను. అలా చెయ్యడానికి నామనసే యెదురు తిరుగుతోంది. కానీ....తప్పడం లేదు.

4

మర్నాడు సాయంత్రం కలుసుకున్నాను కవితని.

"గమనించాను. ఆ కాంబినేషన్ ఆయనకే జ్ఞాపకం వుండదు లాగుంది శాం. ఫాక్టరిలోనూ ఇక్కడాకూడా జేబులోంచి చిన్న పుస్తకంతీసి అందులోని ఓ పేజీచూస్తూ సేఫ్ తెరిచాడు"

పట్టలేనంత సంతోషం వేసింది నాకు. నా పని అమిత సులభం అలా అయితే.

చిరునవ్వుతో ఆప్యాయంగా తనభుజం తట్టాను.

"కవితా. యువార్ స్వీట్. నువ్వు నిజంగా బంగారం" అన్నాను. ఆ పొగడ్తకు తన మొహం విప్పారింది.

"మరి ...ఇంకోసారి ట్రై చెయ్యమంటావా?"

"పిచ్చిదానా, అక్కరలేదు. యు హేవ్ సక్సీడెడ్."

"థాంక్స్...." అంటూ తన బుగ్గకానించుకుంది నా చేతిని. తనకు నా మీదగల ఆరాధన, ఇష్టం ఆ చూపుల్లోనే వ్యక్తమవుతున్నాయి.

కొంత సేపటికి బయటికి వచ్చేశాను. ఆలోచిస్తూ నడవ సాగాను.

కవితమీది ఆకర్షణ, ప్రేమ రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. తనతో జీవితాంతమూ గడపాలనిపిస్తోంది. తన్ని పెళ్లాడితే....

ఇన్నాళ్ళూ ఇంతమంది ఆడపిల్లలతో తిరిగినా వాళ్ళ యెవరినీ పెళ్ళిచేసుకోవాలన్న ఆలోచన రానేలేదు నాకు. కాని కవితమాత్రం నా మనసును పూర్తిగా ఆక్రమించుకుంది. అదేదో అనిర్వచనీయమయిన ఆరాధన తనమీద నాకు.

ఇన్నాళ్ళకి మొదటిసారిగా నాకు నా వృత్తిమీద విసుగు లాటిది కలగనారంభించింది. తన్ని పెళ్లాడితే జీవితంలో స్థిరపడాలి. అమాయకురాలయిన కవితతో అబద్ధాలు చెప్పి ఇక మోసగించలేను. ఇప్పుడే అంతా తనతో చెప్పేస్తే...

ఇన్నాళ్ళ నా జీవితానికి పశ్చాత్తాపం కలగనారంభించిందిప్పుడు నాకు. కవిత నాదయితే ఎంత హాయిగా ఉంటుంది జీవితం!

నిజమైన సుఖంలేదీ దొంగ బతుకులో. అన్ని సుఖాలూ దొరుకుతాయి స్వేచ్ఛ తప్ప. నా అదృష్టంకొద్దీ పోలీస్ రికార్డుల్లో నా వివరాలు ఎక్కలేదు కాబట్టి కాస్త ఫ్రీగా

తిరగగలుగు తున్నాను. అదే జరిగితే కుక్క బతుకు బతుకుతూ... శివన్‌లాగా బతకాలి....ఎవరికంటా పడకుండా, ఎవరు గుర్తు పట్టేస్తారోనని అనుక్షణమూ చస్తూ బతకాలి.

మరీ ఆలశ్యం కాకముందే ఈ వలయంనుంచి బయట బడటం మంచిది. అందుకు ఏ మార్గాలున్నాయి? ఆలోచించ సాగాను. కొంతసేపటికి ఓ నిశ్చయానికొచ్చాను.

వెంటనే పోలీసులకు బాస్, శివన్‌ల ఆచూకీ అందించి జరగబోయే దొంగతనం గురించి చెప్పాలి. అప్పుడు ఇక నాకు అన్నివిధాలా స్వేచ్ఛ. అప్రూవర్‌గా మారినందుకు బహుశా శిక్ష తగ్గవచ్చుకూడా.

పోలీస్ స్టేషన్‌వేపు నడిచాను. కొద్ది నిముషాల్లో ఇన్‌స్పెక్టర్ ముందున్నాను. ఇంకెవరూ లేరక్కడ.

"బి సీటెడ్. ఏం కావాలి? ఏం పనిమీదొచ్చారు?" అడిగాడతను.

ఎలా మొదలుపెట్టాలో అర్థం కావడంలేదు. కాసేపు తటపటాయించి 'నాపేరు శామ్‌కుమార్' అన్నాను.

"ప్రొసీడ్." అన్నాడతను. కాస్త విసుగు ధ్వనించింది అతని కంఠంలో. ఎలాగయితేనేం, చివరికి అంతా చెప్పేశాను. చెప్పినంతసేపూ యెంతో వుత్సాహంతో విన్నాడు.

"ఓ.కే. చాలా మంచిపని చేశారు మీరు. ఇక వెళ్ళవచ్చు" అన్నాడు.

అతనెలా ప్రొసీడ్ అవుతాడో అర్థంకాలేదు నాకు. అదే అడిగాను.

"ప్రస్తుతం సాక్ష్యం లేదు ఆ యిద్దర్నీ అరెస్టు చెయ్యడానికి. మీరు ఆ దొంగతనం వివరాలు అందజేసి వెళ్ళారంటే రెడ్‌హాండెడ్‌గా పట్టుకునే ప్రయత్నం చేస్తాం" అన్నాడు.

బాస్ చెప్పిన పథకం, దాన్ని కొద్దిగా మార్చి నే వేసిన పథకం చెప్పాను.

"కాంబినేషన్ రేపు తెలుసుకోబోతున్నాను. సరిగ్గా వారం తర్వాత—అంటే జూన్ నాలుగవ తారీకు రాత్రి ఫాక్టరీలోని సేఫ్, ఇంట్లోని సేఫ్ రెండూ ఒకేసారి దోచుకోబడతాయి. ఫాక్టరీ విషయం కాస్త ప్రమాదకర మైనది. అక్కడి గూర్ఖా, అలారంలా సంగతి తను చూసు కోగలనన్నాడు శివన్. ఫాక్టరీలోని సేఫ్ విషయం అతను, ఇంటి విషయం నేను చూసుకోవాలి.

ఇంటికి కాస్త దూరంలో ఓ లూనా నా కోసం సిద్ధంగా వుంటుంది. పని పూర్తికాగానే దాని మీద వెళ్ళి ఊరి పొలి మేరలోని మైదానం చేరుకోవాలి. రాత్రి పన్నెండున్నర లోపల నేనూ, శివన్ కూడా అక్కడ వైట్ చేసే బాస్‌ని కలుసుకోవాలి. తర్వాత ఏం చెయ్యావలసిందీ అంతా ఆయన ఇష్టం."

"థాంక్స్ మీరిక వెళ్ళవచ్చు" అన్నాడు నేను చెప్పిన వివరాలన్నీ నోట్ చేసుకున్న అతను. నమస్కారం పెట్టి వచ్చేశాను. ఒక స్టెప్ అయిపోయింది. ఇక తర్వాత ఏం జరుగుతుందో?

కవిత....తనేం చేస్తుందో?

అన్నీ నేననుకున్నట్టు జరుగుతాయా? తన ఏజ్ ఓ సమస్యకాదు. మరో రెండేళ్ళ తర్వాతయినా పెళ్ళిచేసుకో వచ్చు. కాని రాజం విషయం? ఆయనకి కూతురంటే ప్రాణం. నా కివ్వడానికి ఒప్పుకుంటాడా కవితను? తన కేమో నేనంటే ప్రేమే. అందులో సందేహంలేదు. అన్నిటికన్నా ముఖ్యం ముందీ బాస్, శివన్‌ల బారినుండి తప్పించుకోవాలి.

మూడురోజులు గడిచిపోయాయి. బాస్‌ని కలవలేదు. శివన్ నన్ను మీట్ అవలేదు. ఎందుకో వాళ్ళ మొహాలు చూడాలన్నా విసుగ్గా వుంది. ఈ మూడురోజులూ కవితనీ చూడలేదు. మనసేం బాగలేదు. ఆలోచనలతో దిక్కు తోచడంలేదు.

కాంబినేషన్ నిన్ననే కనుక్కునేశాను.

ఆయనకి తెలీకుండా అతిలాఘవంతో జేబులోని పుస్తకము తీసేసి, బాత్‌రూంకెళ్ళి సరిగ్గా రెండు నిమిషాలలో రెండుసేఫ్‌ల వివరాలూ మరోస్లిప్‌మీద కాపీ చేసుకొని మళ్ళీ అంతే జాగ్రత్తతో ఆ పుస్తకాన్నాయన జేబులోకి తోసేశాను.

ఇప్పుడు ఫాక్టరీలోని ఇనప్పెట్టె తాలూకు వివరాలు శివన్‌కు అందజెయ్యాలి. అందుకోసమయినా బాస్ దగ్గరకి పోక తప్పదు.

వివరాలు శివన్‌కి అందజెయ్యకుండా వుంటే అనిపించిందో క్షణం. కాని రెడ్‌హాండెడ్‌గా పట్టుకుంటామన్న ఇన్‌స్పెక్టర్ మాటలు గుర్తుకు రావడంతో బాస్ ఫ్లాట్ వైపు నడిచాను.

శివన్ యెదురు పడ్డాడు. 'బాస్ లోపల మాట్లాడుతున్నారు' అంటూ వెళ్ళిపోయాడు.

లోపలికి నడిచాను. లోపల మరో గదిలోంచి గట్టిగా నవ్వులు, మాటలు వినబడుతున్నాయి. తలుపు హాండిల్ తిప్పబోయి పరిచితమైన గొంతు మరొకటి లోపల్నుంచి వినపడడంతో ఆగిపోయాను. పగలబడి నవ్వుతూ యేదో చెప్తుంటే బాస్‌కూడా నవ్వుతున్నాడు.

మరో నిమిషం వాళ్ళమాటలు వినేసరికి ఆవేశంతో పిచ్చెక్కినంత పనయింది. చటుక్కున తలుపు హాండిల్ తిప్పబోయాను. కాని బుద్ధి హెచ్చరించడంతో నన్ను నేను కంట్రోల్ చేసుకోగలిగాను. మరో నిమిషంలో లోపల్నించి హాండిల్ తిప్పారెవరో. మెరుపులా పక్కకుగెంతి సోఫా పక్కగా కూచున్నాను.

తలుపు తెరుచుకుని బయటపడ్డ భారీ ఆకారం ఠీవిగా నవ్వుతూ వెళ్ళిపోయింది. ఆ వ్యక్తిని బూటుకాలితో చావ తన్నాలన్న కోర్కెను అతికష్టంమీద అణచుకొని అర నిమిషం తరవాత లేచి బయటకి నడిచాను. బాస్ దగ్గరకి వెళ్ళలేదు.

ఆ మర్నాడు చాలాసేపు ఆలోచించి బాస్‌నీ, శివన్‌నీ కలుసుకొని మాట్లాడివచ్చాను.

ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాను. నిద్ర పట్టింది.

కల. నేనూ కవితా దట్టమయిన అడవిలో పరిగెత్తుతున్నాము. వెనక ఫుల్‌సూట్‌లో రాజం తరుముకొస్తున్నాడు. చేతిలో విల్లంబులున్నాయి. మమ్మల్ని ఆగమని అరిచాడు. నే నాగలేదు. వెనకనించి నాకు గురిపెట్టబడిన బాణం కవిత వెన్నులో గుచ్చుకొని కవిత నేలకూలింది. నేను కాలు మడతబడి పడిపోయాను.

మెలకువ వచ్చింది. వళ్ళంతా చెమటతో తడిసిపోయి వుంది. ఎంత దారుణమయిన కల?

5

జూన్ నాలుగు.

రాత్రి 11-30 దాటింది సమయం.

అనుకున్న ప్రకారం రాజం బంగళాకి అరఫర్లాంగ్ దూరంలో ఆపబడివున్న 'లూనా' స్టార్టు చేశాను. నా స్వంత



పథకం మరోటి మెదడులో రూపొందిందిప్పుడు. అది ఫలిస్తే అదృష్టవంతుడినే. చొక్కా వెనకభాగంలోవున్న పాలిథిన్ బాగ్‌వల్ల పొట్ట ఎత్తుగా కనబడుతోంది.

సంకేత స్థలంవేపు వేగంగా పోనిస్తున్నాను వాహనాన్ని.

పదిహేను నిమిషాల్లో గమ్యాన్ని చేరుకున్నాను. ఆ ప్రాంతమంతా అతి నిశ్శబ్దంగావుంది. దిగి స్టాండ్ వేశాను. చుట్టూ చూశాను. ఎక్కడా బాస్‌జాడ లేదు.

మరో అయిదు నిమిషాల దుర్భర నిశ్శబ్దం తర్వాత యెదురుగా కొంతదూరంలో టార్చిలైట్ వెలుతురు కనబడింది. క్రమంగా దగ్గర కాసాగింది. కొంత సేపటికిబాగా దగ్గరయింది.

మొహం స్పష్టంగా కనబడకున్నా అది బాసేనని గ్రహించ గలిగాను.

"బాస్...." అంటూ ముందుకు కదిలాను.

"హాండ్సప్ మిస్టర్ శామ్" ఉరిమిందతని గొంతు.

నివ్వెరబోయాను.

దూరంనుండి స్కూటర్ చప్పుడు వినబడసాగింది.

గొంతు పెగల్చుకుంటూ 'బాస్, యేమిటిది బాస్?' అన్నాను.

"డోంట్ పుటాన్ ఫాల్స్ కలర్స్ మిస్టర్. ఇక మనం ఒకరినొకరం మోసగించుకోవాల్సిన అవసరంలేదు" అంటున్నాడు బాస్.

స్కూటర్‌వచ్చి బాస్ పక్కగా ఆగింది.

"సక్సెస్ బాస్" అంటూ హుషారుగా దిగాడు శివన్. నావైపు చూసి "ఓ శామ్. ఏమిటి పాపం అలావున్నావు" అన్నాడు వ్యంగ్యంగా.

అతని చేతిలో కాష్‌బాగ్ వుంది. ఆ బాగే ఉదయం ఫాక్టరీలో భద్రపరచబడ్డ బాగ్. అయిపోయింది. జయప్రదంగా పనిని ముగించాడు శివన్.

నిస్సహాయంగా నిలబడిపోయాను. వీళ్ళు ఇంతత్వరగా ఇలా రియాక్టు అవుతారని నేను అనుకోలేదు. ఇప్పుడేం చెయ్యాలి?

"ఇన్‌స్పెక్టర్ నా చేతికింది మనిషని తెలుసుకున్నాకయినా తెలివిగా ప్రవర్తించి వుంటే బాగుండేది శామ్. ఇంకేవో అతి తెలివి పనులు చెయ్యబోయావు. చేతులు కాల్చుకున్నావు" యెగతాళిగా నవ్వుతూ అన్నాడు బాస్.

"నీ ప్రవర్తనలో వచ్చినమార్పు ఎప్పుడో కనిపెట్టాం. ఆ పిల్లమీది క్రేజ్‌వల్ల నువ్వు యీ జీవితం మానేసి మామూలుగా బతకాలని నిశ్చయించుకుంటావని గ్రహించాము. మా ఫ్లాట్‌లో ఇన్‌స్పెక్టర్ని చూసి నువ్వు బిత్తరపోవటంకూడా గమనించాము. కావాలనే నీతో యేమీ అనలేదు. మా కళ్ళు కప్పలేవు శామ్!" అన్నాడు శివన్.

బాస్ చేతిలోని రివాల్వర్ స్టడీగా నావైపు గురిపెట్టబడి

వుంది.

"మర్యాదగా రాజం ఇంట్లోని నగలు, డబ్బు తెచ్చావో లేదో, తేకుంటే యెక్కడ దాచావో వెంటనేచెప్పు. చచ్చే ముందు ఆ మంచిపని చెయ్యి" అన్నాడు బాస్.

ఏం చెయ్యాలి నేనిప్పుడు?

నేనసలు రాజం ఇంట్లోని సేఫ్ కాదుగదా, గేటువరకూ కూడా వెళ్ళలేదీ రాత్రి. పాలిథిన్ బాగ్‌లో రాళ్ళూరప్పలూ పెట్టి షర్టువెనక పెట్టుకున్నాను. ఇక్కడి కొచ్చాక వీళ్ళని దెబ్బతీపి ఫాక్టరీ కాష్ తీసుకెళ్ళి రాజంకి అప్పజెప్పేయ్యా లనుకున్నాను ఇన్స్‌పెక్టర్ అసలు రంగు తెలుసుకున్నాక. కానీ ఇప్పుడు....

"అక్కడి నగలూ డబ్బూదాచుకున్నావా లేక ఏ చెత్తో దాచుకొని వచ్చావా? ఆ చొక్కావెనుక యేమిటి అది? త్వరగా కానీ. నాకు సమాధానం కావాలి. ఏవీ ఆ నగలూ డబ్బూ?"

మెదడు ఆలోచనలతో వేడెక్కిపోతోంది. ఇప్పుడు యెలా వీళ్ళని దెబ్బ తియ్యడం?

"ఏమిటో చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నట్టున్నావు. ఇక మమ్మల్నేమీ చెయ్యలేవు నువ్వు. ఆ విషయం గుర్తు పెట్టుకో. త్వరగా చెప్పు" అన్నాడు బాస్.

"బాస్. ఆ ముష్టి నగలూ డబ్బులూ దొరక్కపోతే మాత్రం ఏం? ఈ డబ్బుతో జీవితాంతమూ చక్రవర్తుల్లా బతకొచ్చు. అసలు ఆ ఇంట్లో నగలున్నాయని మీకు తెలుసా లేక ఊహిస్తున్నారా?" అడిగాడు శివన్.

"నో శివన్. అవి మామూలు నగలుకావు. తరతరాల నుంచి రాజం వంశం వాటిని కాపాడుకుంటూ వస్తున్నది. చాలా విలువయిన భారీ నగలవి" శివన్ వైపు తిరిగి అంటు

న్నాడు బాస్.

ఆ క్షణాన్ని ఉపయోగించుకుని ముందుకు దూకి బాస్ చేతిమీద చరిచాను. అతని చేతిలోని ఆయుధం కింద పడి పోయింది. వెనకనుంచి నాపైకి దాడిచేశాడు శివన్. వీపు మీద బలమయిన దెబ్బ. తూలాను.

అప్పటికే తేరుకున్న బాస్‌వంగి రివాల్వర్ అందుకొని దాని బట్‌తో నా కణతమీద కొట్టబోయాడు. పక్కకు తొలగి ఆ దెబ్బను తప్పించుకుంటూ బాస్ కాలు లాగాను.

బాస్ కింద పడిపోతూనే ట్రిగర్ నొక్కేశాడు. అదే క్షణంలో ముందుకడుగేసిన శివన్ డొక్కలోకి చొచ్చుకు పోయింది బుల్లెట్. అతని చేతిలోని బాగ్ కింద పడ్డది.

ఒక్క అంగలో ఆ బాగ్ అందుకొని బాస్‌కి అరక్షణం కూడా వ్యవధి ఇవ్వకుండా అతని చేతిలోని ఆయుధాన్ని లాక్కుని కడుపులో బలంగా ఓ స్ట్రోక్ యిచ్చాను. ఒక క్షణం మూలిగి కళ్లు మూసుకున్నాడు.

తక్షణమే ముందుకు దూసుకెళ్ళి లూనా ఎక్కి స్టార్టు చేసి అతి వేగంగా రోడ్ వైపు పోనివ్వసాగాను. వీపు కలుక్కుమంటోంది.

ఇప్పుడు ఈ బాగ్ తీసుకెళ్ళి రాజంగారికి అప్పజెప్పి అంతా వివరిస్తాను. ఇక ఏమైనా జరగనీ.

తర్వాత .... కవిత ....

వెనక స్కూటర్ చప్పుడు. ఆశ్చర్యంతో వెను దిరిగి చూశాను. బాస్. అంత దెబ్బకూడా తట్టుకోగలిగాడన్న మాట.

వేగం హెచ్చించాను. ఇదే వేగంతో వెళితే సరిగ్గా ఐదు నిమిషాలలోపే రాజం ఇల్లు చేరుకోవచ్చు.

వెనక కూడా వేగం పెరిగింది.

మూడు నిమిషాలు గడిచిపోయాయి.

వెనకనించి రివాల్వర్ పేల్చిన శబ్దం. వాహనాన్ని నడుపుతూ రివాల్వర్ గురిపెట్టి పేల్చడానికి ఎంతో చాకచక్యం, ధైర్యం, అనుభవం కావాలి. బాస్ ఆ పని చేయగలుగుతున్నాడు.

మరోసారి చప్పుడు. రెండో రౌండ్. ఈసారి గురి తప్పలేదు. అతి వేగంగా వెళుతున్న లూనా బాలెన్స్ తప్పి కీచుమంటూ మెలికలు తిరిగి కిందపడిపోయింది. నేను అతి కష్టం మీద నన్ను నేను కంట్రోల్ చేసుకుంటూ సమయస్ఫూర్తితో చటుక్కున దిగేశాను. కాలు బెణికింది.

వెనక స్కూటర్ కూడా ఆగింది. "శామ్! ఆగు" అరిచాడు బాస్.

చేతిలోని బాగ్‌ను దృఢంగా పట్టుకుని కుంటుతూనే సాధ్యమైనంత వేగంగా పరిగెత్తడానికి ప్రయత్నిస్తున్నాను.

బాస్ వెంబడించసాగాడు.

ఈ బాగ్ రాజంగారి కందజేసి నా నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోగలిగితే చాలు. ఇక నేనేమైపోయినా పరవాలేదు. కనుచూపు మేరలో కనిపిస్తోంది రాజం బంగళా. లేని ఓపిక తెచ్చుకొని పరిగెడుతూన్నాను ఒక్కొక్క అడుగు పడుతూంటే కాలూ వీపూ విపరీతంగా నొప్పి.

ఆయాసంతో పరిగెత్తుతున్నాను. సత్తువ నశిస్తోంది. బాస్ కూడా వేగంగా పరిగెత్తలేకున్నాడు.

ఆ నిర్జనమైన, నిశ్శబ్దమైన వీధిలో మా బూట్ల చప్పుళ్లు భయంకరంగా ప్రతిధ్వనిస్తున్నాయి. ఇళ్లు చాలా తక్కువ ఆ ఏరియాలో.

గేటు దగ్గరికి చేరుకునేశాను. అప్పటికే లేచి నిలబడి

వున్న గూర్ఖా 'కౌన్ హై' అంటూ ఇంకేదో అనబోయి నన్ను చూసి ఆశ్చర్యంగా 'శామ్ సాబ్' అన్నాడు.

అతనికి అంతా వివరించడానికి సమయం లేదు. బాగ్ అతని చేతిలో పెట్టి "ఇది ఫాక్టరీ కాష్. దొంగల దగ్గర్నుంచి లాక్కున్నాను. తక్షణమే దీన్ని రాజంసాబ్ కందజెయ్యాలి. ప్రమాదం!" అని గబ గబా ఒక్క గుక్కలో చెప్పేశాను హిందీలో.

గూర్ఖా నా మాటలు పూర్తికాక ముందే నే నందిస్తున్న బాగ్ లాక్కొని బాణంలా లోపలికి దూసుకుపోయాడు.

లోపల లైట్స్ వెలిగాయి. రెండు మూడు ఆకారాలు కంగారుగా బయటికి రాసాగాయి.

బాస్ నన్ను సమీపించాడు.

"ఇంకా ఎందుకు శ్రమ? ఆ డబ్బు చేరాల్సిన చోటికి చేరిపోయింది" అన్నాను.

"బాస్టర్డు. నిన్ని పనిలో ఉపయోగించుకుని చాలా తప్పు చేశాను. అటు నగలూ దక్కలేదు, ఇటు డబ్బూ దక్కలేదు. కుడిభుజంలాంటి శివన్ని పోగొట్టుకున్నాను. ఇంకో ప్లాన్ ఏదయినా వేసి వుంటే...." ఇంకా ఏదో అనబోతున్నాడు వుద్రేకంగా.

"ఎందుకు కంఠశోష? ఇప్పుడు ఏం గింజుకుంటే మాత్రం ఏం ప్రయోజనం?" అన్నాను వెటకారంగా. బాస్ విపరీతమైన కోపంతో, ఎగ్జయిట్మెంట్తో వణికిపోతున్నాడు.

"నిన్నింతవాడ్ని చేసిన నన్నే ఇలా అవమానిస్తావా? యు సనాఫ్ బిచ్. అనుభవించు" అన్న మాటలు, మరోసారి రివాల్వర్ పేలిన శబ్దం.

వెన్నులో నిప్పుబంతి దూరిందా? ఏమయింది? గిరి గిర తిరిగే నిప్పు కణం ఏదో లోపలికి వెళ్ళిపోతోంది.... నరాలనూ తెగ్గోసుకుంటూ. కళ్లు చీకట్లు కమ్ముతుండగా కుప్ప కూలిపోయాను. వీపులో బుల్లెట్ చేసిన రంధ్రం నుండి రక్తం వెల్లువలా ప్రవహిస్తుండం తెలుస్తూంది. కాళ్ళూ చేతులూ విపరీతంగా వణుకుతున్నాయి. చెప్పలేని బాధ.

పారిపోతున్న బాస్‌ని ఒక్క అంగలో దూకి వాటేసుకున్నాడు గూర్ఖా.

నాకు కళ్ళు మూసుకుపోతున్నాయి. అతి కష్టం మీద తెరిచాను. గేటులో రాజం, కవిత, అయన చేతిలో కాష్ బాగ్. ఆదుర్దాగా నన్ను సమీపించారు తండ్రీ కూతుళ్ళు.

"శామ్‌కుమార్! ఏమిటిదంతా? అసలేం జరిగింది?" ముందుకు వంగి అడుగుతున్నాడు.

కవిత ముఖంలో దిగ్భ్రాంతి, దుఃఖం.

ఎంతో ప్రయత్నం మీద చెయ్యెత్తి బాస్ వైపు చూపిస్తూ "అంతా....ఇతనివల్ల" అన్నాను. ఇంకా ఏదో చెప్పాలన్నా గొంతు పెగలటం లేదు.

"డాక్టర్....డాక్టర్‌నీ పోలీసులనీ పిలవాలి...." అంటూ లోపలికెళ్ళిపోయా డాయన.

నిన్న ఎందుకో నాకు అనుమానం, భయం కలిగాయి. ఏదో జరగరానిది జరుగుతుందేమోనని భయం వెయ్యసాగింది. గబ గబ నా చరిత్ర, ఇతర వివరాలు సవిస్తరంగా రాసి ఓ కవర్‌లో వుంచాను కవితకు ఎడ్రస్ చేసి. డి. యస్. పి. కి కూడా ఒక లెటర్ రాశాను. అందులో బాస్, శివన్‌ల వివరాలు, వాళ్ళకి సహకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ పేరు, జూరిస్డిక్షన్ కూడా రాశాను. రేపు ఉదయం

ఏడు గంటలలోగా నేను రూమ్ చేరుకోకపోతే ఆ రెండు కవర్లూ పోస్ట్ చేసెయ్యమని చెప్పాను పనిమనిషికి.

బహుశా రేపు సాయంత్రం నా లెటరు అందుకుంటుంది కవిత.

కవిత ఏడుపు వినిపిస్తూంది లీలగా.

మూతలు పడిపోతున్న కళ్ళను అతి కష్టంమీద తెరిచాను. ఏమిటిది? ఏమిటిది? ఏదో రిలీఫ్.... నా తల కవిత ఒళ్ళో వుంది.

"శామ్.... శామ్" అంటుంది వెక్కిళ్ళమధ్య కవిత.

శామ్! ఆ పిలుపులో ఎంత ప్రేమ?

నా మొహం మీద కన్నీటి బొట్లు.

కళ్ళు తేలిపోతున్నాయి. కవిత ఒళ్ళో వున్నాను నేను. నాకు అతి దగ్గరగా కవిత.

నన్ను ప్రేమించే నా కవిత.

నా కోసం ఏడ్చేవాళ్ళు కూడా వున్నారా? నువ్వు నా కోసం ఏడుస్తున్నావా కవితా!

చిన్నప్పట్నించి విచిత్రమైన మలుపులు తిరిగిన నా జీవితం ఈనాడిలా చివరి మలుపు తిరగబోతుందా? ఒక అద్భుత సౌందర్యవతి, అమాయకురాలు అయిన యువతి ప్రేమ లభించి మళ్ళీ అది దక్కకుండానే వెళ్ళిపోతున్నానా ఈ లోకం నుంచే?

చాలు, ఈ జన్మకు యీ తృప్తి చాలు....

నా జీవితం ధన్యమైంది.

ఆ ఆనందంలోనే నా కన్నులు మూతలు పడ్డాయి శాశ్వతంగా. □

పాఠకుల పరిశోధన పోటీ-91

(బహుమతి రు. 50/-లు నగదు)

మధ్యాహ్నం రెండుగంటలు అయింది.

హోం మినిష్టర్ బలదేవ్‌గారి నివాసం పోలీస్ వాహనా లతో, యితరత్రా కార్లతో, మనుషులతో కిటకిటలాడి పోతుంది.

డిటెక్టివ్ కిరీటి కారుదిగి లోపలికి నడిచాడు. అప్పుడే నల్గురు సహమంత్రులతో బయటకు వస్తున్న బలదేవ్, కిరీటిని చూడగానే విష్ చేస్తూ, "హల్లో 'రీటిగారూ! రండి! ఇప్పటిదాకా మీ కోసం ఎదురు చూచి, మీరు రావడం ఆలస్యం అవుతుందేమో అని, విషయమంతా నా సెక్రటరీకి చెప్పి యిప్పుడే బయలుదేరాను. అర్జెంటుగా ఎలక్షన్ మీటింగ్‌కు హాజరు కావాలి! బొత్తిగా టైంలేదు!" అన్నాడు హడావుడిగా.

"విషయమేమిటో టూకీగా చెప్పండి!" అన్నాడు కిరీటి బలదేవ్ యెదురుగా కూర్చుంటూ.

బలదేవ్ తల ఊపి, మిగతావారి వైపు చూశాడు. అందరూ గదిలోంచి బయటకు వెళ్ళారు.

"కిరీటిగారూ! యెవరో నా మీద కక్షకట్టారు. నన్ను చంపుతానని బెదిరిస్తూ ఉత్తరం వ్రాసాడు. ఈ రోజు మూడు మీటింగులున్నాయి. ఎన్నికల సభల్లో ప్రసం గించాలి. ఈ రోజు రాత్రిలోగా నన్ను చంపుతానని బెది రించాడు. అందుకే మిమ్మల్ని పిలిపించాను. మీకు కావల సిన అన్ని వివరాలు నా సెక్రటరీ జోషి చెబుతాడు. ఎలా గైనా సరే మీరీరోజు రాత్రి నాకు యెలాంటి ఆపద కల్గ కుండా కాపాడాలి. అతన్ని వెంటనే బంధించాలి!" వగ రుస్తూ చెప్పాడు.

కిరీటి ఏదో అనబోయాడు.

అంతలోనే యెవరో వచ్చి "సార్! కారు రెడీ!" అన్నాడు.

బలదేవ్ టైం చూచుకొని "సారీ! ఇప్పటికే అర్థ గంట ఆలస్యం అయింది. నేను వెళ్ళివస్తాను. మీకు కావలసిన వివరాలు నా సెక్రటరీ నడగండి!" అంటూ, "అప్పన్నా!" అని కేకేసి, అతను రాగానే "వీరిని జోషి దగ్గరకు తీసుకువెళ్ళు!" అని చెప్పి మరోమాటకు అవ కాశం యివ్వకుండా హడావుడిగా బయటకు వెళ్ళిపోయాడు బలదేవ్.

కిరీటి అప్పన్నను అనుసరించాడు.

2

"రండి! మీ గురించి బలదేవ్‌గారు చెప్పారు!" అని కుర్చీ చూపించి, "వారు మీతో మాట్లాడారా?" అనడిగాడు జోషి.

కిరీటి తల వూపి, "అసలు విషయం వివరంగా చెప్పండి" అన్నాడు కుర్చీలో విశ్రాంతిగా వాలి సిగరెట్ వెలిగిస్తూ.

"బలదేవ్‌గార్కి నిన్న ఒక బెదిరింపు వుత్తరం వచ్చింది. ఆయన దురాగతాలకు, అక్రమాలకు శిక్షగా యీ రోజు రాత్రిలోగా టైంబాంబ్ పెట్టి పేల్చి చంపేస్తానని" అంటూ, టేబిలు సొరుగు తెరిచి అందులోంచి ఒక కాగితం తీసి "ఇదీ ఆ ఉత్తరం!" అన్నాడు జోషి.

కిరీటి కాగితం అందుకొని చదవసాగాడు.

పాతవు కాగితం అది. తేదీగాని, క్రింద సంతకం గాని లేదు. కాగితం మధ్యలో

"మిస్టర్ బలదేవ్—

నీ అక్రమాలకు, అన్యాయాలకు ఆనకట్టు పడే సమయం వచ్చింది. నీకీ వుత్తరం అందిన రోజు రాత్రికి బాంబ్‌తో నిన్ను పేల్చి చంపేస్తాను

జాగ్రత్త!"

అంతే వుంది ఉత్తరంలో. కిరీటి ఉత్తరం మడిచి జోషికిచ్చి "ఈ పుత్తరంలోని వ్రాత ఎవరిదో మీకుగాని, బలదేవ్‌గార్కిగాని తెలుసా?" అడిగాడు.

జోషి తలవూపి, "లేదు! లేదు, ఇంతకుముందు మాకు అలాంటి రాత ఏ విధంగానూ పరిచయంలేదు" అన్నాడు.

కిరీటి రెండు నిముషాలు ఆలోచించి "బలదేవ్‌గార్ని చంపేంతటి కక్షగల వాళ్ళు యెవరైనా వున్నారా?" అడిగాడు.

జోషి భుజాలెగరేసి, "చెప్పలేం? వుండవచ్చు. రాజకీయాలు కదా! అంతెందుకు? బలదేవ్‌గారి కుమారుడు శశాంక, వారికి ప్రధమ ప్రత్యర్థి. శశాంక ఎక్స్ పార్టీలో చేరి, ప్రస్తుతం ఎలక్షన్లలో తండ్రికి పోటీగా నిలబడ్డాడు. అంతేకాదు. రెండురోజుల క్రిందటి ఘర్షణలో, తన దారి నుంచి తప్పకోకుంటే, హత్య చేస్తానని కూడ తండ్రిని బెదిరించాడు. ఇంటి పరిస్థితే యిలా వున్నప్పుడు, ఇక బైటసంగతి చెప్పాలా?" అన్నాడు జోషి నవ్వుతూ.

కిరీటి తల ఊపి, "మీకెవరిమీదైనా అనుమానం ఉందా?" అడిగాడు.

"ఎలా చెప్పను....కాని ఒక విషయం మాత్రం చెప్పగలను. బలదేవ్‌గారంటే గిట్టనివాళ్ళు చాలమంది వున్నారు!" అన్నాడు జోషి.

"ఎవరు వాళ్ళు?"

"బలదేవ్‌గారి కుమారుడు శశాంక, బలదేవ్‌గార్కి సహాయ యంత్రంగా వుంటూ రాజీనామా చేసిన దుంధుభి. అందర్నీ మించి, బలదేవ్‌గారికి మేనల్లుడు కిశోర్. వీళ్ళందరికి బలదేవ్‌గారంటే గిట్టదు. అంతకు మించి నాకు తెల్సి

నంతవరకు బహిరంగంగా ఎవ్వరూ లేరు" చెప్పాడు జోషి.

కిరీటి తల ఊపి, లేచి నిలబడి, "ఎందుకైనా మంచిది, ఆ ఉత్తరాన్ని హాండ్‌రైటింగ్ ఎక్స్‌పర్ట్స్ డిపార్ట్‌మెంటుకు పంపండి! మీకు తెల్సినవాళ్ళల్లో ఎవ్వరైనా ఈ ఉత్తరాన్ని కాస్తంత మార్చి వ్రాసినా తెల్సుకోవచ్చు!" అన్నాడు.

జోషి తల ఊపాడు.

3

ఆ తర్వాత చాల విషయాలు అనుకోకుండా జరిగిపోయాయి. ఆరోజు సాయంత్రం ఈవెనింగ్ ఎడిషన్స్‌లో "బలదేవ్ దారుణాలు" అనే శీర్షిక క్రింద ఫోటాలతోసహా, అతని మోసాలు, దారుణాలు వివరంగా ప్రచురించబడ్డాయి.

ఆ రాత్రి ఎనిమిది గంటలకు, బహిరంగ సభలో బలదేవ్ ప్రసంగిస్తుండగా టైంబాంబ్ పేలి చాల తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను వెంటనే హాస్పిటల్లో చేర్పించారు.

డిటెక్టివ్ కిరీటి పరిశోధన మొదటి మెట్టులో వుండగానే ఇవన్నీ జరిగిపోయాయి.

"బలదేవ్‌గారు గాయపడిన సమయంలో మీరెక్కడ వున్నారు?" జోషిని ప్రశ్నించాడు కిరీటి.

"అక్కడే వున్నాను. నాతోపాటు ఆయనకు ముందు ప్రసంగించిన మంత్రులుకూడ వున్నారు వేదిక చిన్నది కావడంవల్ల ఒక్కొక్కరే వేదికమీదకు వెళ్ళి మాట్లాడి క్రిందకు వచ్చేవారు. ఆ ఘోరం జరిగే సమయంలో అక్కడే వున్నాను!" చెప్పాడు జోషి.

"మీ నాన్నగార్కి ఆ ప్రమాదం జరిగినప్పుడు మీరు ఎక్కడ వున్నారు!" శశాంకను అడిగాడు కిరీటి.

"ఇక్కడే! ఇంట్లోనే ఉన్నాను. ఎక్కడికీ వెళ్ళలేదు.

ఎవరో ఫోన్‌చేసి చెబితే తెల్సింది, నాన్నగార్కి ప్రమాదం జరిగిందని."

"మీరు ఇంట్లో వున్నట్లు మీకెవరైనా సాక్ష్యం వున్నారా?"

"చెప్పలేను. సాయంత్రం సరిగ్గా ఆరుగంటలకు నౌఖరు వచ్చి కాఫీ యిచ్చి వెళ్ళాడు. మళ్ళీ పదిగంటలకు నాకు ఈ ప్రమాదం విషయం ఫోన్‌చేసి చెప్పేవరకు నౌఖర్లు నా గది లోకి రాలేదు."

"ప్రమాదం యెన్ని గంటలకు జరిగిందో తెలుసా?" అడిగాడు కిరీటి.

"తెలిసింది. ఎనిమిదిగంటల ప్రాంతంలో అట!"

"అంటే ఆ సమయంలో మీకు ఎలిబీలేదుకదూ!"

శశాంక క్రూరంగా చూచి, "కావచ్చు!" అన్నాడు నిబ్బరంగా.

ఆ తర్వాత కిరీటి కిశోర్‌ను కల్సుకున్నాడు.

"కరెక్ట్‌గా చెప్పమంటె చెప్పలేను! ఎందుకంటె, సాయంత్రం ఆరుగంటలనుంచి, తొమ్మిదివరకు బజార్లో తిరుగుతూ వున్నాను!" చెప్పాడు కిశోర్.

"మీరొక్కరేనా?"

"అవును! నేనంటె ఎవ్వరికి గిట్టదు. అందుకే ఒంటరిగా తిరుగుతుంటాను."

ఆ తర్వాత అక్కడనుంచి దుంధుభి ఇంటికి వెళ్ళాడు.

"ఇప్పుడే విన్నాను ఆ ఘోరవార్త! నిజంగా ఇది చాల దారుణం. మీరా హంతకుడిని వెంటనే పట్టుకొండి. లేకుంటే మా బోటి వాళ్ళకు కూడ రక్షణ వుండదు!" అన్నాడు దుంధుభి ఆవేశంగా.

"మీరా సమయంలో ఎక్కడ ఉన్నారో చెప్పగలరా?" అడిగాడు కిరీటి.

"ఇక్కడే! ఇంట్లో వున్నాను!" అన్నాడు దుంధుభి.

"ఏం చేస్తున్నారు?"

"ఏమీలేదు. రమణి అనే అమ్మాయి పాపం ఉద్యోగం కోసం వచ్చింది. ఆ విషయం గురించి ఇద్దరం మాట్లాడు కుంటూ కూర్చున్నాం!"

"ఎంత వరకు?"

"చెప్పలేను! నా దగ్గర గడియారంలేదు. నేను గాంధీయ వాదిని" నిష్కర్షగా అన్నాడు దుంధుభి.

కిరీటి నవ్వుకుంటూ లేచి బయటకు వచ్చాడు. కారులో కూర్చొని ఒక్క నిముషం కేసంతా మొదటి నుంచి గుర్తు తెచ్చుకున్నాడు. అనుమానితుల మాటలు....వాళ్ళ ఎలిబీలు గుర్తు తెచ్చుకున్నాడు.

ఒక్కసారిగా మెరుపు మెరిసినట్లయింది.

"ఛీ! ఛీ! క్లూ యెంత క్లియర్‌గా వుంది" అను కున్నాడు. □

[ఇదీ కథ. దీనిలో నేరస్తుడెవరో మీరు పరిశోధించి వ్రాయండి, మీ సమాధానం ఒక పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి. 7-12-'79 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హో.డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పైసలు పోస్టు స్టాంపులు జత పరచాలి. అత్యుత్తమ పరిశోధకులు ఇరువురికి రు. 25/-లు చొప్పున బహుమతి పంపుతాము. ఫలితాలు ఫిబ్రవరి '80 నెల సంచికలో చూడండి. —ఎడిటర్.]

పసివాని పగ

వాణిశ్రీ

సుజాత చెయ్యి పట్టుకున్న జగన్‌ని చూసి రాజుకి కోపం వచ్చింది. తను చిన్నవాడై పోయాడుగాని లేకపోతే తన అక్క చెయ్యి పట్టుకున్నందుకు వాడిచెయ్యి విరిచిపారేసి

వుండేవాడు. తను పెద్దవాడిని కానందుకు విచారించాడు రాజు.

సుజాత జగన్‌ని విదిల్చికొట్టి "ఛీ....బుద్ధిలేని వెధవా చెయ్యి వదులు" అంది.

జగన్ చెయ్యివదులుతూ విలన్‌లా నవ్వి, "ఎక్కడికి పోతావులే" అన్నాడు.

సుజాత వాడిని తిట్టుకుంటూ బయల్దేరింది.

రాజుకి పదమూడుఏళ్ళే అయినా వయస్సుకి మించిన తెలివి వుంది.

అతని తండ్రి ప్రైవేట్ కంపెనీలో గుమాస్తాగా పని చేస్తూ క్యాన్సర్‌వచ్చి చనిపోయాడు. సుజాత చదువు తొమ్మిదో క్లాసులోను, రాజు చదువు ఆరోక్లాసులోను ఆగి పోయింది.

తల్లి, కొందరి ఇళ్ళల్లో పాచిపనులు చేసి ఇంటిని గడుపుకొస్తున్నది. కాని ముగ్గురు కడుపులు నింపడం ఆమెకు సాధ్యంకాలేదు.

అందుకే గజపతిగారింట్లో పనికి కుదిరింది సుజాత. గజపతికి పెద్దఫ్యాక్టరీ వుంది ఆ వూళ్ళో. ఆ వూరి లక్షాధి కారులలో ఒకడు.

గజపతి తల్లిపక్షవాతంతో మంచాన పడింది. ఆమెకు సేవలు చెయ్యడానికి ప్రత్యేకంగా వొక మనిషి కావాల్సి వచ్చింది.

జాగన్‌కి సుజాత తల్లి జయమ్మ దూరపు బంధువు. పైగా ఆ వీధిలోనే వుంటున్నాడు. అతను గజపతి దగ్గర కారుడ్రైవరు.

అందుకే ఆ పని చెయ్యడానికి సుజాతను కుదిర్చాడు జగన్. రెండుపూటలా భోజనం, ఫలహారాలు పెట్టి నెలకి

వందరూపాయలు జీతం ఇస్తున్నారు. అక్కతోపాటు రాజు గూడా ఆ ఇంట్లోనే చిల్లరమల్లర పనులు చేస్తూ వుండి పోయాడు. వాడికి ముప్పై రూపాయలు యిచ్చి తిండి పెడు తున్నారు.

గజపతికి యాభై సంవత్సరాలుంటాయి. పిల్లలు కాలేజీ లలో చదువుతూ పరాయి వూళ్ళల్లో వుంటున్నారు. సెలవు లకి మాత్రం ఇంటికి వస్తారు.

గజపతి భార్యకిగూడా దాదాపు అదే వయసు వుంటుంది. ఆమె ఎక్కువగా క్లబ్బులకీ, ఫంక్షన్స్‌కీ వెళ్తూ ఎక్కువగా ఇంట్లో వుండదు.

గజపతి కన్ను సుజాత మీద పడింది. ఆ సంగతి అతని ఆంతరంగికుడు జగన్ చెవిన వేశాడు.

జగన్, సుజాతని లొంగదియ్యాలని ప్రయత్నిస్తున్నాడు.

సుజాత మంచి వయసులో వుంది. ఉప్పూ, కారం తింటున్న వాళ్ళకి కోరికలు తప్పకుండా వుంటాయి గదా. తను కుర్రవాడు. తనకి లొంగకపోతుందా? తర్వాత తను నచ్చజెప్పి గజపతి దాహం తీర్చవచ్చు అని ఆలో చిస్తున్నాడు.

కాని సుజాత అతనికి కొరకరాని కొయ్య అయింది.

2

గజపతి ముందు టీపాయి మీద విస్కీ సీసా సగం ఖాళీ అయింది.

జగన్ జీడిపప్పు, ఫ్రై మటన్ ప్లేట్లు సర్దుతున్నాడు. గ్లాసులో విస్కీపోసి సోడాకొట్టి దూరంగా నిల్చున్నాడు.

"అయితే ఇది ఇంకా దారికి రాలేదన్నమాట" అన్నాడు గజపతి. అతని మాటలు ముద్ద ముద్దగా వస్తున్నాయి.

కళ్ళు ఎర్రగా డేంజర్ లైట్లలా వెలుగుతున్నాయి.

నిషా తలకెక్కి ముఖం వుబ్బిపోయి చూసేవాళ్ళకి బుల్‌డాగ్‌లా కనిపిస్తోంది.

"రాక ఎక్కడికి పోతుంది సార్! కాకపోతే కాస్త ఆలస్యం అంతే" అన్నాడు జగన్ వినయంగా చేతులు నలుపుకుంటూ.

"నెలల తరబడి అదేమాట చెప్తున్నావురా. దాన్ని చూస్తూ మనసు ఆపుకోలేక ఛస్తున్నాను. పిటపిటలాడు తోందిరా పిట్ట. అది దొరక్కపోతే వురి పెట్టుకుని చస్తానురా నేను."

"అమ్మమ్మ అంత మాటనకండి సార్. వారం రోజుల్లోపల దాన్ని పట్టుకొచ్చి మీ కాళ్ళమీద పడెయ్యపోతే నాపేరు జగన్ అని పిలవకండి" రోషంగా అన్నాడు.

"మరేమని పిలవమంటావురా?" మత్తుగా అన్నాడు గజపతి.

"కొజ్జావెధవా అని పిలవండి."

"సెభాష్‌రా జగన్. పౌరుషం అంటే అలావుండాలి" అంటూ జేబులోనుంచి వంద కాగితం జగన్ మీదకి విసిరాడు.

జగన్ ఆ కాగితం అందుకుంటూ గజపతి చేతికివున్న ఎలక్ట్రానిక్ వాచీ, బంగారు చైన్ పరీక్షగా చూశాడు. అతని బుర్రలో మెరిపిందొక మెరుపు.

"సార్. మీరు సోఫాలో కాసేపు పడుకోండి చెప్తాను" అన్నాడు.

"ఎందుకురా?"

"ముందు పడుకోండి. సూపర్‌ప్లాన్ వేశాను. ఈ దెబ్బతో ఆ సుజాత మీ దాసి అవుతుంది" అన్నాడు జగన్ చిటిక వేస్తూ.

గజపతి సోఫాలో పడుకున్నాడు. జగన్ అతని చేతి వాచీ విప్పి టీపాయ్‌మీద వుంచాడు. టీపాయ్‌మీద వున్న గాజు జగ్గులోని నీళ్ళు కిటికీలోనుంచి బయట పారబోశాడు. ఫ్రిజ్ తలుపుతీసి సీసాలలోని నీళ్ళుగూడా పారబోశాడు.

"సార్ ఇప్పుడు సుజాతని మీ గదిలోకి పంపిస్తాను. వచ్చాక మంచినీళ్ళు తెచ్చి ఫ్రిజ్‌లోని సీసాలని నింపమని చెప్పండి" అని వెళ్ళిపోయాడు.

సుజాతవచ్చి ఫ్రిజ్‌తీసి సీసాలని మంచి నీళ్ళతో నింపి వెళ్ళిపోయింది.

కాసేపటికి జగన్ లోపలికివచ్చి టీపాయ్‌మీద వున్న వాచీనితీసి జేబులో వేసుకున్నాడు.

"ఇప్పుడు మీ వాచీ పోయిందన్నమాట. నేను వెళ్ళిన గంట తర్వాత మీరు నిద్రలేస్తారు. లేచి వాచీకోసం చూసుకుంటారు. టీపాయ్‌మీద కన్పించలేదు. ఇంట్లో వున్న నౌకర్లందర్నీ పిలిచి అడుగుతారు. ఎవరూ తియ్యలేదని చెప్తారు. మీరు కోపంతో కేకలు పెడతారు. ఐనా నేరం యెవరూ ఒప్పుకోరు.

చివరకు పోలీసులకు ఫోన్ చేస్తారు. ఎస్. ఐ. వస్తాడు. పదివేల రూపాయలు ఖరీదుచేసే వాచీ పోయిందని రిపోర్టు చేస్తారు. మీ గదిలోకి వచ్చిన సుజాత దొంగతనం చేసిందని మీకు అనుమానం వుందని చెప్తారు. నేనేం పాపం ఎరగనని మొత్తుకుంటుంది ఏడుస్తుంది.

పోలీసులు సుజాతని అరెస్టు చేస్తారు. వాళ్ళ అమ్మ మీ దగ్గరికి వచ్చి ఏడుస్తుంది తన కూతుర్ని కాపాడమని. ఇరవై నాలుగు గంటల్లో సుజాతలో చాలామార్పు వస్తుంది. ఈ లోపలే రావచ్చు. అయ్యగారికి లొంగిపోతే కేసు పోతుందనీ, పైగా బోలెడు డబ్బు ఇస్తారనీ ఆశ పెడ

తాను. ఇక వేరే గత్యంతరంలేక లొంగిపోతుంది. లేదా ఏడేళ్ళు జైలుశిక్ష పడుతుందని బెదిరిస్తాను."

"చాలురా నాయనా. ఇక చాలు. నీ బుర్ర అమోఘం. బుద్ధిలేక డ్రయివింగ్ నేర్చుకున్నావుగాని, రాజకీయాల్లోకి దిగివుంటే కనీసం రాజధానిలో మంత్రివైపోయే వాడివి" అని మెచ్చుకోలుగా నవ్వాడు గజపతి.

"వస్తాసార్!" అన్నాడు జగన్.

తలవూపాడు గజపతి.

3

గజపతిగారి భవంతిలో హాలులో సోఫామీద గజపతి, యస్. ఐ. కూర్చుని వున్నారు. ఇంట్లో పనిచేస్తున్న నౌకర్లంతా చేతులు కట్టుకుని నిల్చుని వున్నారు. దూరంగా సింహద్వారంవద్ద నిల్చున్న జగన్ తమాషా చూస్తున్నాడు.

ఇద్దరు కానిస్టేబుల్స్ లాటీలు వూపుకుంటూ యిల్లంతా కలయజూస్తోన్నారు.

"అయితే మీరంతా నిర్దోషులంటారు." అన్నాడు యస్. ఐ.

అంతా తలలు వంచుకున్నారు.

"ఎన్నేళ్ళనుంచో అయ్యగారి దగ్గర పనిచేస్తోన్నాం. ఎన్నడయినా దొంగతనం యెరుగుదుమా? మా సంగతి అయ్యగారికి తెలియదా?" అంది వంటచేసే ముసలమ్మ.

గజపతి అవునన్నట్లు తలవూపాడు.

"అయితే గజపతిగారూ మీకు యెవరిమీదనయినా అనుమానం వుందా?" ప్రశ్నించాడు యస్. ఐ.

"నాకు యెవరిమీద అనుమానం లేదు. ఎందుకంటే యెన్నో ఏళ్లనుంచి నమ్మకంగా పనిచేస్తోన్నారు. కాకపోతే ఈ అమ్మాయి, ఆమె తమ్ముడు క్రొత్తగా చేరారు. వీళ్ళ

సంగతి నాకు తెలియదు" అన్నాడు గజపతి.

"మీరు మెలకువతో వున్నప్పుడు మంచినీళ్లు పెట్టడానికి వచ్చింది ఈ అమ్మాయేగదా?"

"అవును. ఆ తర్వాత నేను నిద్రపోయాను. ఆమె ఫ్రిజ్‌లో సీసాలని నీళ్ళతో నింపుతూవుంటే నాకు నిద్ర ముంచుకొచ్చింది. అలాగే నిద్రపోయాను. ఆమె గదిలో నుంచి వెళ్ళిపోవడంకూడా గుర్తులేదు నాకు."

"ఐ. సీ...." అని తలవూపుతూ సుజాతవంక చూశాడు యస్. ఐ.

సుజాత ప్రాణాలు పైపైనే యెగిరిపోయాయి. యస్ ఐ. యముడిలా కన్పించాడు. గజపతి పెద్దపులిలా తోచాడు.

"యీ అమ్మాయిని వ్యాన్ యెక్కించి లాకప్‌లో పెట్టండి. వూఁ...." ఆజ్ఞాపించాడు యస్ ఐ.

సుజాతకి ఏడుపు ముంచుకొచ్చింది.

"సార్! నాకే పాపం తెలియదు సార్! నేనా వాచీ తియ్యలేదు సార్!....నన్ను నమ్మండి సార్!...." ఆమె హృదయ విదారకంగా ఏడుస్తోంటే మిగిలిన నౌకర్లుచూస్తూ వుండిపోయారు.

అంతే మరి. ఒక మేకను నరుకుతూవుంటే మరొక మేక ఏం చేస్తుంది!

చేతగాని తనంతో తలలు వంచుకున్నారు. నోరు మెదిపితే తాముగూడా కటకటాల వెనక్కి వెళ్ళాల్సి వస్తుందని అందరికీ తెలుసు.

జరుగుతున్న తతంగం చూస్తూ క్రూరంగా నవ్వుకున్నాడు జగన్.

సుజాతని పోలీసులు లాక్కెళ్తూ వుంటే ఆమె తమ్ముడు



రాజు గూడా ఏడుస్తూ వెంట పడ్డాడు. పోలీసులు కపిరి దూరంగా నెట్టేశారు.

4

"ఛ ... ఛ .... నా పరువు పోయింది అత్తా! అయ్యగారు నన్ను ఛడామడా తిట్టాడు. ఏరా ఏదో మంచి పిల్లని చెప్పావు. దొంగముండని తెచ్చి ఇంట్లో పెట్టావు. పది వేలు చేసే వాచీ కొట్టేసింది గదరా! అని ఎన్నెన్నో అన్నాడు. ఏం చెయ్యను?"

జగన్ మాటలు వింటూ కన్నీరు కారుస్తూ కూర్చుంది జయమ్మ. కూతురు అటువంటి పని చేస్తుందని ఆమె కలలో గూడా వూహించలేదు. కాని ఈ మధ్య ఆమె డబ్బున్న వాళ్ళని తిట్టడమూ, నీతి నిజాయితీగా వుద్యోగం చేసి పిల్లలకి ఏమీ మిగల్చకుండా చచ్చిపోయినందుకు తండ్రిని సైతం దూషించటం గుర్తుకొచ్చి ఏమో! దాని బుద్ధి మారిపోయిందేమో! పెద్దవాళ్ళయ్యాక ఎలా మార తారో ఎలా చెప్పగలం అనుకుంది.

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటావురా జగన్!" అంది

జయమ్మ నిస్సహాయంగా చూస్తూ.

"చేసేదేముంది అత్తా! అయ్యగారి కాళ్ళు పట్టుకో వాల్సిందే."

"నువ్వు చూశావు గదా! అయ్యగారి దగ్గరికి ఎన్నిసార్లు తిరిగానో."

"ఆయన మాత్రం ఏం చేస్తాడు. వందా? వేయా? పది వేలు విలువ చేసే వాచీ. అంతా బంగారం, వజ్రాలతో చేసిన చైను. జపాన్ నుంచి తెప్పించిన వాచీ. అదంటే ఎంతో మోజు ఆయనకి."

"అవున్లే" అంది జయమ్మ.

"ఆ వాచీ తిరిగి ఇచ్చేస్తే కేసు వుండకుండా చూసు కుంటాడు అయ్యగారు" అన్నాడు జగన్.

"తను తియ్యలేదని ఏడుస్తుంది గదరా అది. ఎక్క డ్నుంచి తేవాలి ఆ వాచీ" కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది జయమ్మ.

"సరే కానివ్వు. జరిగేది జరుగుతుంది" అన్నాడు జగన్.

జగన్ వెళ్ళిపోతూవుంటే అనుమానంగా చూశాడు రాజు. ఒకవేళ ఈ జగన్‌గాడే ఆ వాచీ కాజేసి, అక్క మీదకి దొంగతనం నెట్టేడేమో అని ఆలోచించాడు. అక్క చెయ్యి పట్టుకోవడం, అక్క తిట్టడం అవన్నీ రాజుకి గుర్తుకొచ్చాయి. తన అనుమానం తల్లికి చెప్పాలను కున్నాడు.

కాని తల్లికి జగన్ అంటే అభిమానం. అతనే ఈ పని ఇప్పించాడు గదా! అతనిమీద చాడీలు చెప్తే అమ్మ నమ్ము తుందా? చస్తే నమ్మదు అనుకున్నాడు. ఏం చెయ్యాలో తోచక దిగులుగా కూర్చుండి పోయాడు రాజు.

జయమ్మ ఇంటి దగ్గర్నుంచి బయద్దేరి సరాసరి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాడు జగన్. సుజాతను ఒంటరిగా కలుసుకు న్నాడు. అతన్ని చూసి తల వంచుకుంది.

"మీ అమ్మ నీ కోసం ఏడుస్తోంది" అన్నాడు విచారం నటిస్తూ.

సుజాత మాట్లాడలేదు.

"వాచీ ఎవరికి ఇచ్చావో చెప్పు."

సుజాత తీవ్రంగా చూసింది.

"అట్లా చూ స్తే నాకు భయం వేస్తోంది" నవ్వాడు జగన్.

"నా దగ్గరెందు కుంటుంది వాచీ?" ఎదురు ప్రశ్న వేసింది.

"మరి ఎవరి దగ్గర వుంటుంది?"

"నీ దగ్గరే."

ఖంగు తిన్నాడు జగన్.

"నా దగ్గర మాత్రం ఎందుకుంటుంది?" తడబడుతూ అన్నాడు.

"నాకు తెలుసు. నేను నీకు లొంగలేదని పగబట్టి ఈ దొంగతనం అంటగట్టావు. కాని గు ర్తుంచుకో. నువ్వెన్ని అక్రమాలు చేసినా నీకు మాత్రం లొంగను" కోపంతో బుసకొట్టే త్రాచుపాములా అంది సుజాత.

జగన్ పక పక నవ్వాడు.

"నీ సంగతి ఈ రోజు కాకపోయినా రేపయినా గజపతి గారికి చెప్తాను. నువ్వే ఇక్కడికి రావల్సి వస్తుందని మర్చిపోకు" అంది కసిగా.

జగన్ నవ్వు ఆపి, "నువ్వు చె ప్తే నమ్మేటంత మూర్ఖుడు కాదు ఆయన. కాని నీమీద కోపంతో నేనేమీ

చెయ్యలేదు. ప్రమాణపూర్తిగా చెప్తున్నాను. అసలు ఈ దొంగతనం ఎవరు చేశారో నాకు తెలియదు. నువ్వు దొంగతనం చెయ్యకపోవచ్చు. నౌకర్లలో మరెవరయినా చేసి వుండవచ్చు. కాని అనుమానం నీమీద కలిగింది గజపతికి. ఎందుకంటే నువ్వు కొత్తదానివి కాబట్టి."

సుజాత వింతగా చూసింది.

"నువ్వంటే నాకే కోపం లేదు. అదంతా నీ భ్రమ. నువ్వు మంచి వయస్సులో వున్నావు. ఈ జన్మలో నీకు పెళ్ళి చెయ్యలేదు మీ అమ్మ. నాకు తెలుసు ఆ సంగతి. నా భార్య పుట్టింటికి వెళ్ళింది కనడానికి ఆర్నెల్లు నేను ఒంటరిగా వుండలేను. అలవాటు పడిన ప్రాణం మరి. ఏదో అత్తకూతురివి అని సరసమాడాను. కాని నీకింకా లోకజ్ఞానం లేనందున నన్ను అర్థం చేసుకోలేకపోయావు" అన్నాడు జగన్.

సుజాత మాట్లాడకుండా వింటూ వుంది.

"సరే పోనివ్వు. నాకా అదృష్టం లేదనుకుంటాను. నువ్వు ఈ కటకటాల నుంచి తప్పుకోవడానికి ఒకటే మార్గం వుంది. ఇక వేరే మార్గం లేదు. అలా చేశావా నీకు స్వేచ్ఛ కలుగుతుంది. లేదా నిన్ను కోర్టుకు పంపించి కనీసం నాలుగయిదు ఏళ్ళు జైలుశిక్ష వేస్తారు" అన్నాడు.

"ఏమిటి?" అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసింది సుజాత.

"ఎంతవాడైనా కాంతదాసుడే అన్నట్లు గజపతి ఆడవాళ్ళకి ఇట్టే లొంగిపోతాడు. ఎన్ని వేలు పోయినా వెనుకాడడు. ఇక నీలాంటి కన్య దొరికిందంటే ప్రాణమైనా ఇస్తాడు. నువ్వు వూఁ.... అంటే చాలు."

ఆలోచిస్తూ వుంది సుజాత.

"నువ్వు పంతానికి పోయినందువల్ల లాభం లేదు.

జైలులో మాత్రం నిన్ను పవిత్రంగా వుంచుతారా ఈ పోలీసులు. ఏదో గజపతి ఇంట్లో పని చేస్తున్నావని నీ జోలికి రాలేదు. అదే వేరే ఎవరయినా అయితే ఈ పాటికి అంతా జరిగేది. ఆలోచించుకో."

"అయితే అ ఏర్పాటు ఏదో నువ్వే చెయ్యి. ఆ ముస లాడికి నువ్వేనా బ్రోకర్‌వి?" అంది సుజాత.

జగన్ నవ్వుతూ వెళ్ళిపోయాడు. తను అనుకున్నది సాధించినందుకు అతనికి ఎంతో ఆనందంగా వుంది. ఈ మాటవింటే గజపతి ఎగిరి గంతేస్తాడు, అనుకుంటూ హుషారుగా ఈల వేశాడు.

5

ఊరి చివర మామిడి తోటలో గెస్టుహౌస్ వుంది గజ పతికి. అతని రాసక్రీడలన్నీ అక్కడే జరుగుతుంటాయి మామూలుగా.

ఆ రోజు సుజాతను వదిలిపెట్టారు పోలీస్‌స్టేషన్‌నుంచి. జగన్ కారులో తీసుకెళ్ళి ఆమెను ఇంట్లో దించాడు. రాత్రి ఏడింటికి ఆమెను రెడీగా వుండమని చెప్పి వెళ్ళాడు.

అందుకే గెస్టుహౌస్‌లో సుజాత రాక కోసం ఎదురు చూస్తున్నాడు గజపతి.

ఏనిమిదింటికి కారు తోటలోకి వచ్చింది.

జగన్ ఒక్కడే హడావుడిగా వచ్చాడు.

"అది ఎక్కడ?" అన్నాడు గజపతి అసహనంగా.

"కొంప మునిగింది సార్. అది గన్నేరు పప్పు తిని చచ్చింది" అన్నాడు జగన్.

"ఆఁ...." అని దిగ్గున లేచాడు గజపతి.

"ఇట్లా జరుగుతుందని అనుకోలేదు సార్" పశ్చా త్తాప పడుతూ అన్నాడు జగన్.

"ఇప్పుడు పెద్ద గొడవ వచ్చి పడిందిగా. పోలీస్ స్టేషన్‌లో పెట్టారని అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుందని మీవీధిలో వాళ్ళు గొడవ పెడ్తారేమో!"

జగన్ అయోమయంగా చూశాడు.

6

రాజుకి జగన్‌ని చూస్తే కడుపు మండిపోతోంది. వాడు నిద్రపోతుంటే కిరసనాయిలుపోసి అగ్గిపుల్ల ముట్టించాలనుకున్నాడు. ఎప్పుడయినా చీకట్లో పోతున్నప్పుడు పెద్ద రాయితో వాడి తల పగలకొట్టాలి అనుకున్నాడు.

జగన్ కనిపించినప్పుడల్లా గుండెల్లో మంట లెగుస్తోంది రాజుకి. తన అక్క మరణానికి వీడే కారణం అని వాడు రూఢిచేసుకొన్నాడు.

పగ తీర్చుకోవాలి వీడిమీద.

వీడిని జైలులో పెట్టించాలి.

రాజుకి నిద్ర పట్టడంలేదు ఆలోచనలతో. రోజు రోజుకీ చిక్కిపోతున్నాడు ఆలోచనలు తెగక.

అక్కమీద కోపంతో గజపతి వాచీ తనే దొంగతనం చేసి ఆ నేరం అక్కమీద నెట్టాడు.

తను గూడా అలాగే చేస్తే?

అంతే. అలాగే చేసి వాడిని జైలుకి పంపాలి.

ఆ రాత్రి రాజుకి హాయిగా నిద్ర పట్టింది.

సుజాత దొంగతనం చెయ్యలేదని గజపతి ఇంట్లో అందరూ నిర్ణయించుకున్నారు. ఆమె ఆత్మాభిమానం గల పిల్లనీ, జైల్లో వెయ్యడంవల్ల అవమానంతో ఆత్మహత్య చేసుకుందని అనుకున్నారు.

ఆ పశ్చాత్తాపంతోనే గజపతి ఆమె దినవారాలు చెయ్యడానికి జయమ్మకి వెయ్యి రూపాయలు ఇచ్చాడు. రాజుని

G. Venkateswara Rao

పనిలోకి మామూలుగానే రమ్మన్నాడు. నెలకి ఏభై ఇస్తానన్నాడు.

రాజు మామూలుగానే గజపతి ఇంటికి పనికి వెళుతున్నాడు. కాని వాడి దృష్టి అంతా దొంగతనంమీదే వుంది. ఏదయినా విలువయిన వస్తువు దొంగతనం చెయ్యాలి. ఆ నేరం జగన్‌మీదకి నెట్టాలి. వాడు జైలుకి వెళ్ళాలి. తన పగ చల్లారాలి.

ఒక రోజు రాజు బెడ్‌కాఫీ ఇవ్వడానికి గజపతి భార్య పద్మావతి గదిలోకి వెళ్లాడు.

ఏడు గంటలు కావస్తున్నా ఆమె ఇంకా నిద్ర లేవలేదు. రాత్రి చాలా పొద్దుపోయ వచ్చిందావిడ. వెంటనే నిద్ర పట్టక రెండు నిద్ర మాత్రలు వేసుకుని పడుకుంది. అందుకే ఇంకా ఆమెకు మెలకువ రాలేదు.

ట్రే అలాగే పట్టుకుని వెనక్కి వెళ్ళిపోవాలనుకున్నవాడల్లా ఆగిపోయాడు. పద్మావతి మెడనుంచి జారిన రాళ్ళ నెక్లెస్ బెడ్‌మీద పడివుంది. లేత సూర్య కిరణాలు పడి తళ తళ మెరుస్తూ వుంటే రాజు కళ్లు జిగేలుమన్నాయి.

మరో ఆలోచన లేకుండా ఆ నెక్లెస్ నెమ్మదిగా తీసు

కుని నిక్కర్ జేబులో వేసుకున్నాడు. అలా చేశాక వాడి కాళ్ళలో వణుకు పుట్టింది. గుండెల్లో దడ మొదలైంది. తడబడుతున్న అడుగులతో వంట గదిలోకి వెళ్లాడు.

ట్రే వెనక్కి తీసుకుని వచ్చాక వంట గదిలో ముసలమ్మ అడిగింది "అమ్మగారు ఇంకా లేవలేదా?" అని.

"లేదు." అన్నాడు.

"పచ్చిమిరపకాయలు లేవు. భీమన్నకి చెప్పి వస్తా. నువ్విక్కడే వుండు. పొయ్యిమీద పాలు పెట్టాను అయ్యగారికి. పొంగు వచ్చాక చెప్పు. హార్లిక్స్ కలిపి ఇస్తాను" అంది.

తల వూపాడు రాజు.

ముసలమ్మ కిచెన్ బైటికి వెళ్ళిపోయింది.

రాజు పంచదార డబ్బా మూత తీశాడు. ఆ డబ్బా బిస్కట్ల డబ్బా. అందులో పదిహేను కిలోల పంచదార పడుతుంది. నిండా వుంది పంచదార. రాజు గొయ్యిలా తీసి లోపలకు పెట్టాడు నెక్లెస్. నెల రోజులు వస్తుంది ఆ పంచదార. అడుగు తగిలితేగాని నెక్లెస్ ఎవరికీ కనిపించదు.

నెక్లెస్ పంచదార డబ్బాలో పెట్టాక వాడికి ప్రాణం కుదుట పడింది.

పొయ్యి దగ్గర నిలుచున్నాడు పాల వంక చూస్తూ. పాలు పొంగేలోపలే వంట మనిషి వచ్చింది. తర్వాత హార్లిక్స్ కలిపి ఇచ్చింది. ట్రేలో పెట్టుకుని గజపతి గదికి వెళ్ళాడు.

అమ్మగారు ఎప్పుడు లెగుస్తుందో, తన మెడలో నెక్లెస్ లేదని గమనించి ఎలా కంగారు పడుతుందో? మళ్ళీ నౌకర్లందర్నీ కేకేసి అడగటం, వాళ్ళంతా మాకు

తెలియదని అనడం, పోలీసులు రావడం.... అంతా గమ్మత్తుగా వుంటుంది అనుకున్నాడు రాజు. వాడికి చాలా సంతోషంగా వుంది. జగన్‌గాడి పని ఈ దెబ్బతో రా అనుకున్నాడు.

గంట తర్వాత నిద్ర లేచింది పద్మావతి.

కాఫీ కోసం కేక పెట్టింది.

రాజు కాఫీ తీసుకెళ్ళి ఇచ్చాడు.

ఆమె త్రాగుతూ వున్నంతసేపూ అక్కడే నిల్చున్నాడు. ఆమె మెడలో నెక్లెస్ లేదు. మంగళసూత్రం తాడు, నల్లపూసల గొలుసు మాత్రం వున్నాయి. ఆమెకు నెక్లెస్ ఎప్పుడు గుర్తుకొస్తుందో అనుకున్నాడు. ఎందుకంటే ఆమె ఇంట్లో వున్నప్పుడు నెక్లెస్ పెట్టుకోదు. ఎక్కడి కయినా వెళ్ళినప్పుడు రక రకాల నెక్లెస్‌లు మారుస్తుంది.

బాంబు వుంది ఇంట్లో. అది ఎప్పుడు పేలుతుందో?

ఆ పేలుడు శబ్దం వినడం కోసం చెవులు రిక్కించుకుని వున్నాడు రాజు.

పది గంటలు దాటిపోయాయి. అంటే సాయంకాలం ఆరు కావచ్చింది. పద్మావతి ఎక్కడికో వెళ్ళడానికి డ్రెస్ చేసుకుంటోంది వెండి జరీతో మిల మిల మెరుస్తున్న పట్టుచీర కట్టుకుంది. కొప్పులో గులాబీ పువ్వు పెట్టుకున్నాక నెక్లెస్ కోసం బీరువా తీసింది.

అంతే. పెట్టె ఖాళీగా వుంది. ఆమె నివ్వెర పోయింది క్షణకాలం. డ్రెస్సింగ్ టేబిల్ సొరుగు లాగి చూసింది, అందులో లేదు. మళ్ళీ బీరువా. అంతా వెతికింది. వుహూఁ కనిపించలేదు.

ఆమె కేకలు పెట్టింది.

ఆమె కేకలు విని నౌకర్లందరూ బిలబిలమంటూ వచ్చారు.

గజపతి గదిలోనుంచి వచ్చాడు ఏం జరిగిందో తెలుసుకుందామని.

అప్పుడు జగన్ పోర్టికోలో కారు దగ్గర నిల్చుని వున్నాడు అమ్మగారు వస్తారని.

కారు రెడీ చెయ్యమని చెప్పిన అమ్మగారు ఎంత సేపటికీ రాకపోగా ఇంట్లో నుంచి కేకలు వినిపించేసరికి ఏమిటో తెలుసుకుందామని వెళ్లాడు జగన్.

పద్మావతి పిచ్చెక్కినదానిలా అరుస్తోంది.

నౌకర్లు గజ గజ లాడిపోతూ, తమకు తెలియదంటే తమకు తెలియదని సంజాయిషీలు చెప్పుకుంటున్నారు.

గజపతి పద్మావతిని అడుగుతున్నాడు ఆఖరిసారి ఎప్పుడు చూశావని.

పొద్దున్న బీరువాలో పెట్టానని అంది కాసేపు.

తర్వాత తనకు గుర్తులేదు అంది.

రాత్రి అలాగే నిద్రపోయాను అంది. ఆమెకు మతి సరిగా లేదు.

నెక్లెస్ పోయిందని గజపతి కోపగించుకున్నాడు పద్మావతిని. అది పాతిక వేలు విలువ చేస్తుందని తెలిసి జగన్ ఆశ్చర్యపోయాడు.

నెల రోజులు కాలేదు వాచీ దొంగతనం మీద రగడ జరిగి.

మళ్ళీ యిప్పుడు నెక్లెస్ దొంగతనం.

గజపతి చిర్రు బుర్రులాడుతూ పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు.

రాజుకి సరదాగా వుంది అదంతా చూస్తూ వుంటే.

7

రెండు రోజులయింది దొంగతనం జరిగి. దొంగ ఎవరో ఎవరికీ అర్థం కాలేదు.

గజపతికి పిచ్చెక్కినట్లయింది.

సుజాత కోసం వాచీపోయినట్లు నటించమంటే నటించాడు. అన్యాయంగా చచ్చిపోయింది ఆ పిల్ల.

ఇప్పుడీ నెక్లెస్ యెలా పోయినట్లు?

సుజాతకు తను చేసిన అన్యాయానికి ప్రతిగా ఇలా జరిగిందా?

పద్మావతి గూడా ఎవర్నీ అనుమానించలేకపోతోంది.

ఏమో! రాత్రి ఫంక్షన్‌లో ఎక్కడైనా జారిపోయిందేమో? ఈ మధ్య నెక్లెస్ కొక్కెం లూజుగా వుండడం గమనించింది.

పోలీసులు బీరువా మీద, డ్రెస్సింగు టేబులు సొరుగు వద్ద వేలిముద్రలు తీశారు. ఇంట్లో వుండే అందరి వేలిముద్రలు తీసుకున్నారు.

కాని బీరువా మీద, డ్రెస్సింగు సొరుగుకి వున్నవి పద్మావతి వేలిముద్రలే.

ఎక్కడో జారిపోయి వుండవచ్చులే. అంతా తమ దురదృష్టం అనుకున్నారు భార్యా భర్తలు.

నాలుగో రోజు గూడా గడిచాక రాత్రికి ఇంటికి వెళ్ళబోతూ పంచదార డబ్బా మూత తీసి నెక్లెస్ నిక్కరు జేబులో వేసుకున్నాడు. ధైర్యంగా ఇంటికి వెళ్ళిపోయాడు.

రాత్రి తొమ్మిదయింది.

నిక్కరు జేబులో పాతిక వేలు చేసే నెక్లెస్ వుంది.

అది అమ్ముకుంటే పాతికవేలు వస్తాయి. దొంగ నగ అని సగం డబ్బు ఇచ్చినా పన్నెండు వేలు లెక్కలేకుండా

వస్తాయి.

కాని, పాపిష్టి సొమ్ము తమకు వద్దు. దీనితో జగన్ గాడినే జైలుకు పంపించాలి.

మర్నాడు లేస్తూనే చెంబు తీసుకుని బైటకి వెళ్లాడు. అలా నాలుగయిదుసార్లు వెళ్లాడు.

"ఏమిట్రా అన్నిసార్లు వెళుతున్నావు?" అంది జయమ్మ.

"విరోచనాలు అవుతున్నాయి అమ్మా!" అన్నాడు జగన్.

"వూఁ.... శెట్టికొట్లో రెండు అరటి పళ్ళు తెచ్చుకొని తిను. తగ్గుతాయి" అంది జయమ్మ.

రాజు ఇంట్లోనుంచి బయలుదేరేటప్పటికి ఎనిమిదైంది. సరాసరి జగన్ ఇంటికి వెళ్ళాడు.

ఇంట్లో జగన్ లేడు.

"ఏరా రాజూ! యిలా వచ్చావు?" అంది జగన్ తల్లి.

"విరోచనాలు అవుతున్నాయి అత్తా! ఈ రోజు పనిలోకి రానని చెప్పాలని వచ్చాను. మావయ్య లేడా?" అన్నాడు.

"ఇప్పుడే వెళ్ళాడురా" అంది.

"అరె ...రె ..." అన్నాడు రాజు.

"పోనీలే. ఒక్కరోజు వెళ్ళకపోతే కొంపలేం మునగవు. విరోచనాలు పట్టుకుంటే యెలా వెళ్తావు?" అంది.

"చిట్టి యెప్పుడొస్తుంది?" అన్నాడు రాజు.

"వాళ్ళమ్మకి పురుడు రావాలిగదా! ఆ తర్వాత మూడో నెలలోనో, ఐదో నెలలోనో వస్తుంది వాళ్ళమ్మతోపాటు. ఇల్లంతా బోసిగా వుంది పిల్ల లేకపోతే. యెంత అల్లరి చేసేదీ" మనుమరాలిని తలుచుకుంటూ అంది.

రాజు వింటూ ఇల్లంతా కలయ చూస్తున్నాడు. తన

జేబులో నెక్లెస్ తీసి ఎక్కడ పెట్టాలా అని.

"విరోచనాలు బాగా అవుతున్నాయా?" అంది.

"ఆఁ...." అన్నాడు.

"దానిమ్మ పింద కోసుకుని తిను. తగ్గిపోతాయి" అంది.

రాజు పెరట్లోకి వెళ్ళాడు.

దానిమ్మ చెట్టు యెక్కి రెండు దానిమ్మ కాయలు కోసుకున్నాడు.

జగన్ తల్లి వంట గదిలోకి వెళ్ళింది.

రాజు బెడ్ రూమ్‌లోకి వెళ్ళి పందిరి మంచం మీద వున్న పరుపు క్రింద పెట్టాడు నెక్లెస్.

"వెళ్ళొస్తాను అత్తా!" అన్నాడు.

"ఆఁ....ఆఁ...." అంది ఆమె వంట గదిలో నుంచే.

రాజుకి గుండెల మీద వున్న భారం దిగిపోయి నట్లయింది.

"హమ్మయ్య" అని తృప్తిగా వూపిరి పీల్చాడు వీధి లోకి వచ్చి.

ఆ తర్వాత పోస్టాఫీసుకి వెళ్ళాడు. ఇన్‌లాండ్ కవర్ కొన్నాడు. అక్కడ ఎవరో వుంచే పెన్ను అడిగి తీసుకున్నాడు.

"మీ ఇంట్లో పోయిన నెక్లెస్ మీ డ్రైవర్ జగన్ దొంగతనం చేశాడు. అది యిప్పుడు వాళ్ళ యింట్లో వుంది."

రెండే వాక్యాలు రాసి కవరు అంటించాడు

గజపతి ఇంటి అడ్రసు రాసి పోస్టు డబ్బాలో పడేశాడు.

కొండెక్కినంత సంబరం కలిగింది రాజుకి.

తనలో తనే నవ్వుకున్నాడు.

8

అప్పుడే ఇంటికి వచ్చాడు జగన్.

బట్టలు మార్చుకుని కాళ్ళు కడుక్కుంటున్నాడు.

వంట గదిలో అతని తల్లి భోజనం వడ్డిస్తోంది.

పోలీస్ వ్యాన్ అతని ఇంటి ముందు ఆగింది. యస్. ఐ. నలుగురు కానిస్టేబుల్స్ జగన్ యింట్లోకి ప్రవేశించారు. జగన్ బిత్తరపోయాడు వాళ్ళని చూసి

"ఏమిటి సార్?" అని ప్రశ్నించాడు వెల వెలబోతున్న ముఖంతో.

"నెక్లెస్ నువ్వు దొంగిలించావనీ, అది మీ యింట్లోనే వుందనీ మాకు యిన్ఫర్మేషన్ అందింది" అన్నాడు యస్. ఐ.

"భలేవారు సార్. నెక్లెస్ నేను దొంగిలిస్తే యింకా యింట్లోనే వుంచుకుంటానా? అంత తెలివితక్కువ వాడిని కాదు లెండి" అన్నాడు నవ్వుతూ.

ఇనస్పెక్టర్ సెర్చి చెయ్యమని కానిస్టేబుల్సుని పురమాయించాడు.

వాళ్ళు యిల్లంతా గాలిస్తున్నారు.

ఇప్పుడతనికి కొంచెం ధైర్యం కలిగింది. ఎవరో తన మీద తప్పుడు సమాచారం యిచ్చి వుంటారు. పోలీసులు పొరపాటున తనను అనుమానిస్తున్నారు అనుకుని వూరు కున్నాడు.

ఆ వీధిలో వాళ్ళంతా విచిత్రంగా చూస్తున్నారు జగన్ ఇంటికి పోలీసులు రావడం.

రాజుకి పరమానందంగా వుంది ఆ దృశ్యం.

పోలీసుల శ్రమ ఫలించింది.

నెక్లెస్ జగన్ యింట్లో బెడ్ రూమ్‌లో పందిరిమంచం మీద వున్న పరుపు క్రింద దొరికింది.

పోలీసులు జగన్‌కి బేడీలు వేసి వ్యాన్‌లో యెక్కించి తీసుకుపోతుంటే అతని తల్లి ఏడుపులు పెడబొబ్బలు పెట్టింది.

ఆ వీధిలో వాళ్ళందరూ జగన్ చేసిన దొంగతనం సంగతి విని ఆశ్చర్యపోయారు.

జగన్‌కి మాత్రం బుర్ర తిరిగిపోతూ వుంది. జరిగిన దంతా చూస్తూంటే కలా? నిజమా? అని అనుమానం వస్తోంది.

కలకాదు, నిజమే.

తన ఇంట్లో గజపతి భార్య నెక్లెస్ దొరికింది. రెడ్ హేండెడ్‌గా దొరికాడు. తన గదిలో తన మంచం మీద పరుపుక్రింద నెక్లెస్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

ఎంత విచిత్రం?

ఎలా జరిగింది?

తనకు తెలియకుండా తన ఇంట్లో యెవరో పెట్టారు?

ఎవరు?

అంత విలువైన నెక్లెస్ యెవరో దొంగతనం చేసి తన యింట్లో యెందుకు పెడతారు?

డబ్బు చేదా యెవరికైనా. పాతిక వేలు ఖరీదు చేసే నెక్లెస్ తన యింట్లో పారేస్తారా?

ఎవరో తనని జైలుపాలు చెయ్యడానికి చేసిన పని కాక వేరు కాదు.

ఎవరు వాళ్ళు?

ఎవరికి తనమీద అంత పగవుంది?

జగన్ ఆలోచించి ఆలోచించి బుర్ర వేడెక్కి పోయింది.

ఏమో? ఇదంతా తన యజమాని గజపతి చేయించలేదు గదా?

గజపతికి తను సన్నిహితుడు. తన మీద అంత పగ పట్టాల్సిన కారణం ఏమిటి?

ఆ మధ్య ఇన్కమ్‌టాక్స్‌వాళ్లు రైడ్ చేసి కొన్ని ముఖ్యమైన కాగితాలు పట్టుకున్నారు. దాంతో ఏభై వేలు టాక్సు కట్టాల్సివచ్చింది. ఇన్కమ్‌టాక్సు వాళ్ళకి ఎవరో తెలిసినవాళ్ళే ఇన్‌ఫర్మేషన్ ఇచ్చారని గజపతి తనతో అన్నాడు.

ఒకవేళ తనే వాళ్ళకి ఇన్ఫర్మేషన్ యిచ్చాడని అనుమానించి తనమీద పగబట్టి....

జగన్ తల తిరిగిపోతూవుంది.

ప్రపంచం శూన్యమైనట్లుగా కనిపించగా కట కటాల వెనుక నేలపై ఒరిగిపోయాడు అయోమయావస్థలో పడిపోతూ. □

సజీవ చిత్రాలు

యస్.యస్.శాస్త్రి

"ఫైన్! సజీవ చిత్రం." అన్నాడు క్రిష్ణ.

డిటెక్టివ్ శ్రీ మవునంగా తల వూపాడు. నిజమే!

దాన్ని 'చిత్రం' అనేకంటే 'దృశ్యం' అనటం బాగుం

టుంది.

ఎందుకంటే దాన్ని చూసిన ప్రతిమనిషికీ సహజంగా జరుగుతోందా? అన్న భావన కల్గుతుంది. అంత నాచురల్‌గా వుంది చిత్రం!

డిటెక్టివ్ శ్రీ ఆ చిత్రాన్ని జాగ్రత్తగా చూస్తున్నాడు. చిత్రాకారుడు వాడిన కలర్స్ చాలా బావున్నాయి. చుట్టూ ఆవరించి, బైటపడేదారి లేకుండా చేసి—మింగచూస్తున్న అగ్నిశిఖలమధ్య, చిక్కిపోయిన ఒక అనామకుడి చిత్రం అది!

కట్టెదుట కోరలుసాచిన మృత్యువును చూస్తూ—ఆ అభాగ్యుడు పడే యాతన, కళ్లల్లో స్పష్టంగా కదులాడే మృత్యుభీతి చాలా దయనీయంగా వున్నాయి!

ఆ చిత్రాన్ని చూసిన వెంటనే ఎవరికైనా గుండెల్లో ముద్రితమవుతుంది. మార్వలెస్ ఆర్ట్ అది!

"డెఫినెట్‌గా ఈ చిత్రానికే ఫస్ట్‌ప్రైయిజ్ వస్తుంది!" అంటున్నారెవరో!

క్రిష్ణ ఏదో అడగబోయాడతన్ని. ఇంతలో—విశాలమైన ఆ హాల్లో ఎక్కడో మైక్‌లోంచి ఓ కీచుగొంతు విన్పించింది.

"డియర్ ఫ్రండ్స్! ఈ 'ఆర్ట్ ఎగ్జిబిషన్'లో వున్న చిత్రాలమధ్య ఓ కాంపిటీష నుంది. దయచేసి చూడవచ్చిన అందరూ వెళ్ళిపోయే ముందు తమకు నచ్చిన చిత్రం పేరు వ్రాసి, ద్వారంవద్ద 'బాక్స్'లో వేయండి!

అందరూ మాకు సహకరించవల్సిందిగా ప్రార్థించు తున్నాము. ఎక్కువ మెజారిటీ వచ్చిన చిత్రంకి రెండువేల రూ॥లు బహుమతి!"

క్రిష్ణ భుజాలెగరేసి, "అందుకే చిత్రాలన్నింటి పైనా

చిత్రకారుడి పేరులేదు" అన్నాడు.

డిటెక్టివ్ శ్రీ విన్పించుకున్నట్లు లేదు. అతని చూపు సూటిగా కత్తిలా, చిత్రంమీదే వుంది. ఆ చూపులో ఏదో చిక్కు ప్రశ్న ఉంది!

"నీకి చిత్రంలో ఏదేనా చిన్న అసహజత్వం కన్పిస్తోందా?" అడిగాడు శ్రీ, అసిస్టెంటుని!

క్రిష్ణ అతన్నాశ్చర్యంగా చూసి, మళ్ళీ చిత్రంవేపు చూసాడు అందరూ విరగబడి చూస్తూన్న చిత్రమది! అందులో అసహజత్వతమా? ఏముంది?? నాచురాల్టీ ప్రతి అణువున వుంది!

క్రిష్ణకి నవ్వువచ్చింది.. బాస్ సంగతి తనకి తెల్సు. చిన్న అనుమానం వచ్చినా దాన్ని సాగదీసి చూస్తాడు.

నాల్గడుగులు పొడవు, మూడడుగుల వెడల్పువున్న చిత్రమది. చాలా సింపుల్‌గా వుంది. చిత్రంనిండా మంటలు. మధ్యలో ఓ మనిషి! అంతే!!

క్రిష్ణ జాగ్రత్తగా చూసాడు. అందులోని మనిషి వెనుక ఓ కర్రదో, ఇనుపదో—రాటలా వుంది. చిత్రంలో మరేం విశేషాల్లేవు! ఆ చిత్రంలో మనిషిని సగంవరకు మంటలు ఆక్రమించాయి! ముఖంలో భావాలు అద్భుతంగా చిత్రించబడినాయి

క్రిష్ణ తన బాస్‌వేపు చూసి, తల అడ్డంగా ఊపాడు.

డిటెక్టివ్ శ్రీ నవ్వి, ముందుకు నడిచాడు.

వెళ్ళేప్పుడు ఇద్దరు ఆ చిత్రంపేరే వ్రాసారు. ఆ చిత్రం పేరు—"విధి కోరల్లో ఒక కీలుబొమ్మ!"

2

డిటెక్టివ్ శ్రీ రివాల్వింగ్ ఛేర్‌లో కూచుని అటూ ఇటూ, తిరుగుతున్నాడు. ఆలోచనలు కూడా తిరుగు

తున్నాయి.

ఆ చిత్రం....ముఖ్యంగా అందులోని 'మనిషి' తన గుండెల్లో ముద్రితతమైనారు. ఆ మనిషి....అతన్ని తను యెక్కడో చూసాడు....యెక్కడ....ఆ ముఖం తనకు గుర్తే?

ఉన్నట్లుండి చటుక్కున గుర్తు వచ్చింది. యస్! అలాటి మనిషిని తను చూసాడు ...కొద్ది రోజుల క్రితం. అతను ఓ బిచ్చగాడు! తను అతనికి పావలా నాణెం కూడా వేసాడు! కాని అతను ఆ 'చిత్రం'లో....

అసిస్టెంట్ క్రిష్ణ స్ప్రింగ్ డోర్స్ తోసుకువచ్చాడు.

"కనుక్కున్నావా?" శ్రీ అడిగాడు తేరుకుని.

"ఆఁ! అరగంట క్రితం రిజల్ట్సు ప్రకటించారట! అందరూ అనుకున్నదే! ఆ చిత్రానికే వచ్చింది బహుమతి!"

శ్రీ నవ్వి "అది తెల్సు! నేనడిగేది 'అతని' వివరాలు!"

"ఈజీగా తెల్సాయి. ఆ చిత్రకారుడి పేరు రవికాంత్! ఎడ్రస్ తెల్సుకున్నాను. అతడు యువకుడు. అన్నట్లు మీరు ఈ వివరాలన్నీ...." క్రిష్ణ ఏదో అడగబోయాడు, డిటెక్టివ్ మళ్ళీ ఏదో తీవ్రాలోచనల్లో పడటం గమనించి వూరుకున్నాడు.

డిటెక్టివ్ శ్రీ ఆలోచిస్తున్నాడు.

అతని మనసులో 'ఆ చిత్రం' ఇంకా మెదులుతూనే వుంది. తనకి ఆశ్చర్యం కల్గించిన ఆ 'పాయింటూ' మెదులుతోంది.

అసలు 'అది' తనకి యెందుకు అసహజంగా కనిపించిందో, అర్థంగావటంలేదు తనకే! ఆ చిత్రంలో తను చూసిన 'దానికి', చిత్రంలో వుండాల్సిన ప్రాముఖ్యత ఏమిటో తెలీటంలేదు.



తన సందేహం తీద్చుకోకపోతే తనకి నిద్రపట్టదు. డిటెక్టివ్ శ్రీ అసిస్టెంట్‌తో మెర్సిడిస్ ఎక్కాడు।

*

"ప్లీజ్! కూచోండి।" అన్నాడు రవికాంత్.

డిటెక్టివ్ శ్రీ, అసిస్టెంట్ క్రిష్ణ సోఫాలో కూచున్నారు. విశాలమైన హాలు అది. గోడలనిండా వివిధరకాల కాన్వాస్ పెయింటింగ్స్ వ్రేలాడుతున్నాయి. అన్నీ మామూలు చిత్రాలు. అందరూ వేసేలాంటివే!

"మీకు ఈ కళలో ఎప్పటి నుండి ప్రవేశం వుంది?"

"నాకు పదేళ్ళనుండి చిత్రాలు వేయాలని ఆరాటం వుండేది. క్రమంగా బాగా వేయటం నేర్చుకున్నాను" అన్నాడు రవికాంత్. అతని కళ్ళలో గర్వం వుంది.

శ్రీ తలవూపి, "కాని మీకు నిన్న ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రయిజ్ వచ్చిన ఆ చిత్రానికి, ఇక్కడున్న ఈ చిత్రాలకి ఏమాత్రం పోలికలేదు. నా ఉద్దేశ్యం—సాధారణంగా ఒక

మెదడులో వుండే ఆలోచనలన్నింటికి ఎక్కడో అక్కడ సంబంధం ఉంటుందనుకుంటాను. ఒకే కుంచెనుండి వెలువడ్డ చిత్రాలకి మరీ యింత డిఫరెన్సా? అదీ ఇంత సడన్‌గా! కలర్స్ సెలెక్టింగులోను థీమ్‌లో కూడా....”

రవికాంత్ చిన్నగా నవ్వాడు!

“అందుకే మిమ్మల్ని డిటెక్టివ్ అన్నారేమో? నిజమే మీరన్నది ...కమాన్ ....” అంటూ లేచి మరో రూంవేపు నడిచాడు రవికాంత్। డిటెక్టివ్ శ్రీ, క్రిష్ణ అతన్ననుసరించారు.

“ఆ చిత్రం చూడండి!” అన్నాడు రవికాంత్.

ఇద్దరూ అటు చూసారు! ఇరువ్వురూ కొంచెం చలించారు।

థిక్ కలర్స్‌తో స్పష్టంగా.... మెరుస్తూ....హృదయం జలదరించేలా వుందా చిత్రం। ఖరీదైన పెయింట్సు కాంతి కిరణాల్ని రిఫ్లక్ట్ చేస్తున్నాయి!

అతివింతైన చిత్రం అది!

ఆ చిత్రంలో, చిన్నసైజు గది అంతవుండే ఒక పెద్ద 'గ్లాస్‌జార్' బోర్లింపబడి వుంది. దాంట్లో—చేతులు, కాళ్లు కట్టివేయబడి నిస్సహాయంగా ఒక స్త్రీ వుంది. ఆమె శుష్క శరీరం, గుంటలుగా లోతుకుపోయిన కళ్ళు, ముడతలుపడ్డ ముఖం, చింకిబట్టలు-ఆమె అనుభవించిన జీవితం గురించి చెపుతున్నాయి.

అదే గ్లాస్‌జార్‌లో నేలమీద-ఆ స్త్రీ కొడుకు, ఏణ్నెల్ల పిల్లాడు వున్నాడు. బక్కచిక్కి వున్నాడు. వాళ్ళిద్దరేకాదు. ఆ పిల్లాడిచుట్టూ మూడు కాలనాగులు వున్నాయి. బుసలు కొడ్తున్నాయా? అన్పిస్తోంది వాటి భంగిమ.

ఆ స్త్రీ ఏడుస్తోంది. తన పిల్లాడిని చంపబోయే పాములని

భయంగా చూస్తోంది. కాళ్ళవద్దే వున్నా ఏమీ చేయలేని నిస్సహాయత్వం! గుండెల్లో ఎగిసే ఆక్రోశం కళ్ళనీళ్ళ రూపంలో బైల్పడుతున్నట్లుగా వుంది.

"హారిబుల్!" క్రిష్ణ లోలోన అనుకొన్నాడు.

ఇద్దరూ చిత్రంపై వ్రాసివున్నది చదివారు!

"దీజ్ ఆర్ నాట్ స్నేక్స్! ఇట్ హాండ్స్ ఆఫ్ ది ఫేట్! ఫేట్ ఈజ్ గ్రేట్! బట్—'ది ఫైట్ విత్ ఫేట్' ఈజ్ ఎ బ్లడీ థాట్!" అని ఉంది.

"ఈ చిత్రానికి ఢిల్లీలో జరిగిన 'ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్'లో ఫస్ట్‌ప్రయిజ్ వచ్చింది. పాతికవేలు. ఎంతో మంది ఫారినర్స్ లక్షల్లో దీన్ని స్వంతం చేసుకుందాం అని బేరాలాడుతున్నారు" రవికాంత్ గర్వంగా అన్నాడు.

"ఇందాకటి నా సందేహం...." అన్నాడు.

"యస్.... నేను మొన్నటివరకు ఆర్డినరీ ఊహలతో చిత్రాలు వేసేవాణ్ని. కాని ఒక ఆర్నెల్ల క్రిందటి నుంచి, ఇలాంటి నిజమైన చిత్రాలు వేస్తున్నాను! అందుకే మీకు తేడా కన్పించింది" అన్నాడు రవికాంత్.

డిటెక్టివ్ శ్రీ తల పంకించాడు "నిజంగా మీ ఈ థీమ్ బాగుంది" అన్నాడు. "ఇలాంటివి ఎన్ని చేసారు?"

"ఒక చిత్రం పూర్తి చేయాలంటే మూణ్నెల్లు పడ్తుంది. ఇప్పటికి ఈ రెండు చిత్రాలే వేసాను."

డిటెక్టివ్ శ్రీ, రవికాంత్‌తో చెప్పి అసిస్టెంటుతో మెర్సిడీస్ యెక్కాడు. అతనికి మనసంతా కెలికినట్టుగా వుంది! గుండెల్లో జేగంట మ్రోగుతోంది.

"సార్! మీరిదంతా ఎందుకు చేస్తున్నారో నాకు తలా తోకా అర్థం కావటంలేదు" అన్నాడు క్రిష్ణ.

"అర్థమవుతుంది. ముందు నా ఊహ నాకే అర్థం

గావటంలేదు. అది అర్థం చేసుకోవాలనే నా ప్రయత్న మంతా!" అన్నాడు డిటెక్టివ్ శ్రీ.

"ఇప్పుడు మనం వెళ్ళేది ఎటు?"

"ఇన్‌స్పెక్టర్ వినోద్ దగ్గరకి."

4

"మున్సిపాల్టిలో ఓ ఆఫీసరైన భరతన్ నాకు బాగా తెల్సు. అతణ్నుండి వివరాలు కనుక్కోవచ్చు! నేను ఫోన్ చేసి కనుక్కుంటాను. మీకూ ఫోన్‌చేసి చెప్తాను."

డిటెక్టివ్ శ్రీ, ఇన్స్పెక్టర్ వినోద్ మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ ఆలోచిస్తున్నాడు. అతని దృష్టి టేబిల్ మీదున్న ఫోన్‌వేపు వున్నా, మనస్సు తీవ్రాలోచనల్లో వుంది.

తనకి మంచికో, చెడుకో ఒక ఆలోచన వచ్చింది. అందులో నిజానిజాలు తేల్చటం తన విధి! ధర్మం!

ఫోన్ మ్రోగింది! చటుక్కున రిసీవరు తీసాడు.

"నేను శ్రీనే! వ్వాట్! నా ఊహ కరెక్టేనా? నాకా ఆలోచన ఎందుకొచ్చిందా?.... చెప్తాను .... వెంటనేనా.... వైనాట్? ఈ క్షణమే బయలుదేరుతున్నాను!" రిసీవరు పెట్టేసి, క్రిష్ణతో మెర్సిడిస్ ఎక్కాడు.

ఇద్దరూ క్షణాల్లో ఇన్‌స్పెక్టరు ముందున్నారు.

"మీకు ఆ విషయం దేనికి? ఏదేనా కేసు పరిశోధనలో కావాల్సొచ్చిందా?" నవ్వుతూ అడిగాడు.

శ్రీ తలూపి, "వివరాలు చెప్పండి!" అన్నాడు.

"భరతన్‌గారు ఈ వివరాలు కొంచెం కష్టపడే బైటికి తీయగల్గారు. ఇలాంటి విషయాలు పట్టింపులో వుండవు గదా సాధారణంగా!" ఇన్స్పెక్టరు తను సేకరించినదంతా విపులంగా చెప్పాడు!

"ఊరిచివర ఎక్కడో తుప్పల్లో దొరికాయట! శవాలు బాగా పాడై పోయాయి! ఒక స్త్రీ, ఆమె పిల్లాడు!!"

"చావు ఎలా సంభవించింది?"

చెప్పాడిన్‌స్పెక్టరు, "కాని మీరనే ఆ మొదటి...."

"అవును! పూర్తి భస్మీపటలం అయితే ఇక మిగిలేదేముంది?"

డిటెక్టివ్ శ్రీ లేచాడు!

నిమిషం తీవ్రంగా ఆలోచించాడు!

"నా పాత్ర ఏమైనా వుందా!" ఇన్స్‌పెక్టరడిగాడు.

"ఎక్కువ లేదు! క్లయిమాక్స్‌లో సంకెళ్లు తేవటమే!"

5

"బాబూ ధర్మం!" దీనంగా అక్రోశిస్తున్నాడు ఆ బిచ్చగాడు. ఓ పెద్ద బంగళా గేటు ప్రక్క రోడ్డుమీద కూచుని ఉన్నాడా బిచ్చగాడు తన బిచాణా పరచి!

క్రమంగా చీకట్లు క్రమ్ముతున్నాయి। వాడు అప్పు డప్పుడు అరుస్తూనే ఉన్నాడు. అది డీసెంట్ రోడ్డు, ఎవ్వరూ లేక నిర్జనంగా వుంది. వాడికి పైసా రాలేదు।

ఏడు గంటలయింది। ఓ కారు బంగళాలోకి వెళ్ళింది। అప్పుడే కారులోని సూటు వేసుకున్న మనిషి దృష్టి బిచ్చ గాడిమీద పడింది?

తొమ్మిదయింది। బిచ్చగాడు ఓ గోనె పర్చుకుని పడుకో బోతూ ఆగిపోయాడు. ఒక మనిషి వచ్చి దగ్గర్లో నిల నిలబడ్డాడు। దుస్తుల్ని బట్టి నవుకరని తెలుస్తోంది. అతను ఆ బంగళానుండి వచ్చాడని అనుకున్నాడు బిచ్చగాడు.

"ఏంటి బాబయ్యా?" అన్నాడు.

"ఒరే! భోంచేసేవా?" అడిగాడామనిషి.

"లేదు బాబూ! ఈ పొద్దు పస్తే!" ఆశగా చూసాడు.

"నాతో రా! భోజనం పెడతాను." అతను బంగళా లోకి దారి తీసాడు. బతుకుజీవుడా అన్నట్లు బిచ్చగాడు తన గోనె భుజంమీదేసుకుని, వెంట నడిచాడు.

ఇద్దరూ బంగళాలోనికి వెళ్లారు.

"లోనికి నేనెందుకు బాబూ?" అన్నాడు బిచ్చగాడు.

"ఫర్వాలేదు, రా?" అన్నాడు తను త్వరగా నడుస్తూ.

ఇద్దరూ బంగళా వెనకనున్న గదిలోకి వెళ్లారు. విశాల మైన గది. అక్కడక్కడా పాత ఫర్నిచర్ పడి వుంది.

అతను ఓ మూలకి వెళ్ళి నేలమీదనున్న ఓ భోషాణం లాంటి తలుపు ఎత్తాడు. క్రిందికి చెక్క మెట్లున్నాయి.

"ఇదేటి బాబూ?" అన్నాడు బిచ్చగాడు.

"స్టోర్ రూం!" అతను నవ్వి, క్రిందికి దిగాడు.

"ఓ హో భోజనాలగదా?" బిచ్చగాడు తనూ వెళ్లాడు.

శ్రీ టైం చూసాడు.

అతను బిచ్చగాణ్ని లోనికి తీసుకువెళ్ళి మూడు నిమిషా లయింది! తను ఊహించినట్లు అయితే ఆ బిచ్చగాడు మరి రాడు.

కాని ఆ బిచ్చగాడు తన అసిస్టెంటు. తను అయిదు నిమిషాలు చూస్తానన్నాడు. అసలు ఇన్‌స్పెక్టరుతో దూరే వాడే తను లోనికి! కాని తమ ఊహ పారుతుందో పారదో! అతను అనుమానిస్తే అంతా వృధా!

అతను భయంకర హంతకుడు. పైగా మానియక్! అయిదు నిమిషాలు ఆగటం ప్రమాదమేమో?

డిటెక్టివ్ శ్రీ చకచక బంగళా వెనుక ప్రహరీగోడ దాటి, బంగళా ముందుకొచ్చాడు. ఏదో ఆలోచించి డైరెక్టుగా హాల్లోకి వెళ్ళాడు.

హాలు నిశ్శబ్దంగా వుంది!

ఎక్కణ్నుంచో ఓ నవుకరు పరుగెత్తుకువచ్చాడు.

"ఎవరు కావాలి?" అన్నాడు కోపంగా.

"మీ యజమాని!" అన్నాడు శ్రీ.

"ఆయన లేరు! వెళ్ళండి!"

ఆ నిశ్శబ్దం....భయంకరంగా వుందనిపించింది శ్రీకి.

అంతే! రెండు పిడికిళ్ళతో నవుకరు బుర్ర బద్దలు చేసాడు శ్రీ. అతను కూలిపోయేడు.

శ్రీ పరుగెత్తాడు. నిమిషంలో చెక్కబల్ల కనుక్కున్నాడు. దాన్ని ఎత్తి మెట్లమీద పరుగెత్తాడు. ఎదుటి దృశ్యం చూసి అవాక్కయాడు.

విశాలమైన హాలు అది!

హాలు నిండా ఏవో... ఏర్పాటై ఉన్నాయి. ప్రతీదీ మని

షిని ఒక్కో వింత హింసకి గురి చేసేదే!!

ఓ పెద్ద గ్లాస్ టబ్ వుంది। దాని మధ్య వున్న రాటకి కట్టివేయబడి వున్నాడు క్రిష్ణ। వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు మృత్యువునుంచి తప్పించుకుందుకు.

క్రింద ఏర్పాటు చేసిన పైపునుండి నీళ్ళు పైకి నిండుతున్నాయి. ఉడుకునీళ్ళు కావటంవల్ల బుడగలు వస్తున్నాయి. మరో రెండు నిమిషాలకి దిమ్మమీదికి వచ్చి, ఆపై కాళ్ళనుండి తల వరకూ....

అసిస్టెంట్ క్రిష్ణ కాళ్ళతో గ్లాస్ బద్దలు చేయాలని తంతున్నాడు. బ్రేక్ ప్రూఫ్ కావటం వల్లేమో గ్లాస్ పగలలేదు.

ఆ హింసా యంత్రంకి ప్రక్కనే స్టాండుంది. దానికి కాన్వాస్ అమర్చి వుంది. చేతిలో ఓ కుంచెతో రవికాంత్ ఉన్నాడు. పిచ్చిగా నవ్వుతున్నాడు. అతడి ప్రక్కనే మరో మనిషి నౌకరు దుస్తుల్లోవున్నాడు. అతనూ నవ్వుతోన్నాడు.

దీన్నే అంటారేమో-పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణ సంకటం అని।

"మిస్టర్। రవికాంత్।" అరిచాడు డిటెక్టివ్ శ్రీ। "నీ పాపం పండింది।"

త్రుళ్ళిపడ్డాడు రవికాంత్।

"నువ్వా? ఎలా వచ్చావు?" అన్నాడు.

శ్రీ నవ్వి, "నీ పాపం పండి వచ్చాను. ఆనాడు ఆర్టు ఎగ్జిబిషన్‌లో నీ చిత్రం చూసి నేనూ ఆనందపడ్డాను. కాని నీలోని ఆకలే విన్ను పట్టిచ్చింది. నువ్వు మానియక్‌వి. ఎవ్వరో రోడ్డుమీద వుండే ముష్టివాళ్ళలాటి అనామకుల్ని మోసగించితెచ్చి, వాళ్ళని చిత్రహింసలు పెడుతూ, వారి యాతన భావాలూ చూస్తూ వేసే రాక్షసుడివి. వాటికి ఏవో పేర్లు పెట్టేవాడివి.

కాని నువ్వు మంటల్లో కాల్చి చంపుతూ గీసిన 'ఆ' చిత్రమే నిన్ను పట్టిచ్చింది. ఆ ముష్టివాణ్ని నేను కొన్నాళ్ళ క్రితం రోడ్డుమీద చూసాను. బిచ్చం కూడా వేయడంతో బాగా గుర్తు వున్నాడు.

సాధారణంగా కొందరు ముష్టివాళ్ళు, మూర్ఛరోగులు కావడం వలన ఏమో ఒక "ఇత్తడి ప్లేట్" మెడలో వ్రేలాడగట్టుకుంటారు. దానిమీద 'ధర్మం' వేయమనో, ఏదో వ్రాసి వుంటుంది.

అతని మెడలో కూడా 'అది' వుంది. నువ్వు మూర్ఖుడివి. ఆ 'బ్రాస్‌ప్లేట్' కూడా చిత్రంలో వేసావు. నాచురాల్టీ కోసం ఏమో దానిమీద అక్షరాలు కూడా వేసావు. అంతే కాదు! పోలికలూ అవీ అంతా అతనే. నేనతడి కోసం వాకబు చేసాను. దాంతో నీ బండారం బైల్పడింది. పూర్....ఆర్టిస్ట్...." అన్నాడు.

రవికాంత్ మృగంలా చూసి చిత్రంగా నవ్వాడు.

"వెల్ నాగూ అతన్ని తెచ్చి పడెయ్! గీస్తాను.... బ్రహ్మాండమైన చిత్రం. ఇంటర్నేషనల్ కాంపిటిషన్‌కి పంపిస్తాను... దానిపేరు....నో వన్ కుడ్ ఎట్టాక్ ది ఫేట్. కమాన్....నాచురాల్టీ అప్పుడే. అవి ఉడుకు నీళ్ళు కావు. విధి గాడ్పుల్లో మాడి మసైపోయే జీవితాలు" రవికాంత్ పిచ్చిగా మృగంలా గాండ్రిస్తున్నాడు.

"ఇప్పుడు ఊడబోతున్నాయి-మీ పళ్ళూ....కీళ్ళూ.... కాళ్ళూ ఎట్సెట్రా...." శ్రీ కోపంగా మిగతా మెట్లు దిగాడు.

నవుకరు నాగూ వస్తున్నాడు. అతను బలంగా పహిల్వాన్‌లాగే వున్నాడు. కాని డిటెక్టివ్ ధైర్యం ఆవేశం చూసి భయం వేసింది!!

నాగూ చటుక్కున జేబునుండి పిస్టలు తీసాడు. కాని అది ఆ క్షణానే నేల రాలింది. డిటెక్టివ్ శ్రీ పిస్టోలులోని రెండో బుల్లెట్టు నాగూ కాలి మడమ విరగ్గొట్టింది. అతను కీచుగా అరచి నేల కూలాడు.

డిటెక్టివ్ శ్రీ పరుగెత్తుకు వెళ్ళి నాగూ తలని గోల్ లోకి బంతిని తన్నే ఆటగాడిలా బూట్‌తో తన్నాడు. నాగూ నిర్జీవంగా తల వాల్చేసాడు.

రవికాంత్ అరుస్తున్నాడు. "ఇవే నిజమైన చిత్రాలు. వేస్తాను... గీస్తాను....నాచురాల్టీ గ్రేట్...."

"మనిషిని హింసిస్తూ వారి యాతనని చూసి చిత్రించే నువు చిత్రకారుడివా? రాక్షసుడివి." శ్రీ మహోగ్రంగా వెళ్ళి రవికాంత్‌ని రెండు చేతుల్తో పైకెత్తి, పూజారి రాతి కేసి కొబ్బరికాయ కొట్టినట్లు, నేలకేసి విసిరి కొట్టాడు.

మనిషికి 206 ఎముకలు వుంటాయి. కాని రవి రవికాంత్‌కి ఇప్పుడు వాటిలో సగం కూడా లేవు.

డిటెక్టివ్ శ్రీ అక్కడే పడున్న ఓ పెద్ద ఇనుప వస్తువు ఎత్తి అసిస్టెంట్ వున్న గ్లాస్ టబ్ కేసి కొట్టాడు. అది విరక్క తప్పలేదు.

అప్పుడే దిమ్మమీదకు చేరుకుంటున్న మరుగుతున్ననీళ్ల విరిగిన చోటునుండి భళ్ళున బైటికొచ్చి పడ్డాయి. సరిగ్గా అక్కడే రవికాంత్ పడివున్నాడు మూల్గుతూ.

ఉడుకునీళ్ళన్నీ ఒక్కసారి అతన్ని ముంచేసాయి.

అంతే!!

అతి భయంకరంగా, తన క్రూరత్వానికి తనే బలి అయి, ఏ లోకాల్లోనో వున్న అభాగ్యులకి వినిపించేలా గావుకేక పెట్టాడు, చిత్రకారుడు రవికాంత్!!!

[ఒక 'ఆంగ్లకథ' ఆధారంతో]

□

ఆ గది తలుపులు దబదబా మ్రోగాయి.

"ఆ ఆ! వస్తున్నా!" నిద్రకళ్ళతో జవాబిచ్చాడు కృష్ణ.

ఆ గదిలో పడుకున్న వాళ్ళలో అతనొకడు.

మళ్ళీ మ్రోగాయి తలుపులు.

"సార్!" అన్నకేక గట్టిగా వినిపించింది.

"ఎవరూ?" నిద్రమత్తుతోనే వెళ్ళి తలుపు తీశాడు సదానందం.

"సార్! కృష్ణగారికి టెలిగ్రాం!" ఎదురుగా నిలబడ్డ సదానందంతో అన్నాడు టెలిగ్రాం మెసెంజర్.

"ఒరేయ్ కృష్ణా! నీకు టెలిగ్రాంట." బద్ధకంగా పడుకున్న కృష్ణను కుదిపి లేపాడు సదానందం.

"ఏమిటిరా తెల్లారకుండా మీ గొడవ?" గదిలో మరో మూల పడుకున్న సత్యం విసుగ్గా అన్నాడు.

కృష్ణవెళ్ళి టెలిగ్రాం అందుకున్నాడు.

అందులో విషయం నమ్మలేనట్టు మరోసారి చదివాడు.

"నో, ఇంపాసిబుల్!" గట్టిగా అరిచాడు అతను.

"ఏమిటి? ఏమయిందిరా?"

సత్యం సదానందాలు ప్రశ్నించారతన్ని.

"నరసింహంగాడు టెలిగ్రాం యిచ్చాడురా! 'విశ్వం ఎక్స్పైర్డు యస్టర్డే! స్టార్టు ఇమీడియట్లీ టు తుని!' పిచ్చి వెధవలా వున్నాడు."

వాళ్ళకు జవాబిచ్చిన కృష్ణ ప్రక్కగది వైపుచూపి, "ఒరేయ్ విశ్వం! నువ్వు నిన్న చచ్చిపోయావటరా! నరసింహంగాడు టెలిగ్రాం యిచ్చాడు" అన్నాడు నవ్వుతూ.

ఎంతసేపటికీ పక్కగదినుంచి జవాబు రాలేదు.

"ఇదేమిట్రా వెధవ టెలిగ్రామూ వీడూను. రాత్రంతా మనతోవున్న విశ్వం చచ్చిపోయాడంటా దేమిటి?" సదానందాన్ని ప్రశ్నించాడు సత్యం. అతని గొంతు వణుకుతోంది.

"ఒరే విశ్వం తొందరగా బయటకు రారా!" అసహ

నంగా అరిచాడు కృష్ణ.

ఇంకా జవాబు రాలేదు ఆ గదినుండి.

ఒకరి మొహాలొకరు చూసుకున్న ముగ్గురూ గబగబా ఆ గదిలోకి వెళ్లారు.

ఆశ్చర్యం! ఆ గదిలో విశ్వంలేడు. గది ఖాళీగావుంది.

"అరే రాత్రి విశ్వం కూడా తీసుకొచ్చిన సూట్ కేసు కూడా లేదే!" కృష్ణ అన్నాడు.

"ఆ సూట్ కేస్‌లో వాడు మనదగ్గర కొట్టేసిన డబ్బు కూడా వుందిరా!" విచారంగా అన్నాడు సత్యం.

గబగబా మళ్ళీ ముగ్గురూ ముందుగదిలో కొచ్చారు.

"విశ్వం కాల్చిపారేసిన సిగరెట్లివిగోరా!" విల్స్‌ఫిల్టర్ కింగ్స్ సిగరెట్స్ ఖాళీ పెట్టెల్ని, సిగరెట్ పీకల్ని, చూపిస్తూ అన్నాడు సదానందం!

"రాత్రి వాడు సూట్ కేస్‌లోంచి తీసి బయటపెట్టిన గోల్కొండ ట్రిప్లెక్స్ రమ్, బాటిల్స్ అవిగోరా!" టేబుల్‌మీది ఖాళీసీసాల్ని చూపిస్తూ అన్నాడు కృష్ణ.

"అరే! ఇదంతా పెద్ద మిస్టరీలా వుందే. ఇంతకీ యీ వెధవ విశ్వంగాడు యేమయిపోయినట్టు? ఈ నరిసింహం గాడి వెధవ టెలిగ్రాం ఏమిటి?" సత్యం ఆందోళనగా అన్నాడు.

"అరేయ్ కృష్ణా! రాత్రి విశ్వంగాడు వాడి జావామీద బయలదేరి వచ్చాడు కాదురా?" సదానందం ప్రశ్నించాడు.

"అవును! దానికి వాడు ప్రత్యేకంగా పెట్టించుకున్న హారను శబ్దం స్పష్టంగా వినిపించింది కూడాను." కృష్ణ జవాబిచ్చాడు.

"రాత్రంతా మబ్బు మబ్బుగా వుందిగా. కొద్దిగా చినుకులుకూడా పడినట్టున్నాయి! అవునా?" సదానందం మళ్ళీ

ప్రశ్నించాడు.

"ఏమిటోయ్ పెద్ద డిటెక్టివ్‌లా వెధవ ప్రశ్నలూ నువ్వూను" విసుక్కున్నాడు సత్యం.

"రాత్రి మనం యెవళ్ళం మన వెహికల్స్ బయటకు తీయలేదు. ఒకవేళ వాన పడివుంటే విశ్వం 'జావా' టైరు జాడలు మనకు కనిపించాలి పదండి చూద్దాం." బయటకు దారి తీశాడు సదానందం.

బయట గుమ్మానికి క్రిందుగా 'జావా' మోటర్ సైకిల్ టైర్ల జాడలు, వచ్చినట్టూ వెళ్ళినట్టూ స్పష్టంగా తెలిసి పోతున్నాయి.

ఒకమూల ఆయిల్‌టాంక్ లీకు అయినట్టుగా పెట్రోలు కారిపోయిన మరకలున్నాయి.

"నే ననుకున్నది కరెక్టు!" విజిల్ వేశాడు సదానందం.

"ఏమీలేదు. విశ్వం నరిసింహంగాడు యీ యిద్దరు వెధవలూ కలిసి మనని ఆటపట్టించాలని చూస్తున్నారు. మనమీద తెలివిగా వో ప్రాక్టికల్ జోక్ ప్రయోగించారు. ఇంకా అర్థంకాలేదా మీకు?" సదానందం మిగిలిన యిద్దర్నీ చూస్తూ అన్నాడు.

"చెప్పేదేదో సరిగ్గాచెప్పి యేడవరాదూ?" సత్యం విసుక్కున్నాడు.

"ఓరి చవటా! ఇంకా నీకు అర్థం కాలేదు కనుకనే అన్నేళ్ళనుంచి ఫోర్తు ఇయర్ అవటంలేదు నీకు!" సదానందం సత్యాన్ని యెత్తి పొడిచాడు.

"నువ్వు మూడేళ్ళుగా మూడోయేడు చదువుతూండగా లేంది నేను నాలుగేళ్ళు నాలుగోయేడు చదివితే ఏం పోయిందట?" ఉడుకుమోతు తనంతో అన్నాడు సత్యం.

"సరే లెండిరా. అందరం అందరమే కనుకనే కుదు

రుగా యీ గదిలో వుంటున్నాం." కృష్ణ సర్దిచెప్పాడు.

ఇంతకూ వాళ్ళు మెడిసన్ స్టూడెంట్సు. అవసరం కంటే హాబీగా చదువుకుంటున్న వాళ్లు. అవసరాలకుమించి డబ్బున్న మహారాజు బిడ్డలు. చదువు పూర్తయింరంటె పెళ్ళి, ఉద్యోగం, సంసార బాధ్యతలు మొదలయినవి నెత్తిన పడతాయని 'నిత్య విద్యార్థులుగా' వుండటానికి శాయశక్తులా కృషి చేస్తోన్నవాళ్ళు.

"వినండిరా జరిగింది చెబుతా. ఈ విస్సిగాడు, నరసి గాడు ఇక్కణ్నుంచి బయలదేరి వెళ్లారా? వెళ్లాక యిద్దరికి బ్రిలియంట్ అయిడియా వచ్చివుంటుంది. మనని యెలా గయినా ఫూల్సు చేయాలని అయిడియా వేశారు. ప్లాను ప్రకారం విశ్వంగాడు నిన్న సాయంత్రం మనదగ్గరకి తిరిగి వచ్చాడు. ఆ తరువాత ఏం జరిగిందో మీకూ తెలుసు. ఇప్పుడీ టెలిగ్రాం! రెండూ కలిపి ఆలోచించి చూస్తే ఇది ప్రాక్టికల్ జోక్ అని తెలియటం లేదూ?" సదానందం అన్నాడు.

నిన్న సాయంత్రం ఏం జరిగిందంటే....

2

నిన్న సాయంత్రం—

వాతావరణం మబ్బుమబ్బుగా వుంది. కొద్దిగా చలిగాలి వీస్తోంది.

రూమ్‌లో కూర్చున్న మిగ్గురు మిత్రులు సదానందం, కృష్ణ, సత్యాలకు యీ వాతావరణం నచ్చటంలేదు.

"బయటకు యెక్కడకూ పోవాలనిపించటం లేదు. కాస్సేపు పేకాటయినా ఆడుకుందాం"సదానందం అన్నాడు.

"ఓకే! నాకేం అభ్యంతరం లేదు" కృష్ణ అన్నాడు.

"మధ్య నాకేనేమిటి అభ్యంతరం?" పేకతీసి ముక్కలు

పంచుతూ అన్నాడు సత్యం.

కాస్సేపు పేకాట సాగాక కృష్ణ "ఒరేయ్ సత్యం! పెట్టెల్లో ఎక్కడేనా కాస్త బ్రాందీ వుందేమో వెదుకు!" అన్నాడు.

"ఉండవోయ్ గొడవ! డబ్బులుపోయి నేనేడుస్తోంటే" సత్యం విసుక్కున్నాడు.

"అయితే కాసేపు నాకు ఆట వెయ్యకండి!" అంటూ కృష్ణ తన పరిశోధనా కార్యక్రమం ప్రారంభించాడు.

కాని యేమీ లాభం లేకపోయింది.

ఎక్కడా వొక్కచుక్క రమ్ము, సారా, బ్రాందీ ఏమీ లేవు!

"ఛ! మరీ అన్యాయంగా వుంది." కృష్ణ ఆటలోవచ్చి కూర్చుంటూ అన్నాడు.

"పోనీ నువ్వువెళ్ళి తీసుకురారాదూ?" అన్నాడు సదానందం.

"ఈ వాతావరణంలో యిల్లు కదల బుద్ధిగాక కదా యీ యేడుపంతాను!" కృష్ణ విసుక్కున్నాడు.

పేకాట మరి కాసేపు సాగింది.

"ముగ్గురిమీదు ఆట మరీ బోరుకొడుతోంది. ఈ విస్సిగాడు, నరిపిగాడు యిలాంటప్పుడే వూరువెళ్ళాలా?" సత్యం విసుక్కున్నాడు.

"అవును పాపం. వాళ్ళువుంటే సత్యం వాళ్ళ దగ్గర డబ్బులు కాజేసే వాడివి. యీవేళ నీవి పోతున్నాయని యేడుపు!" కృష్ణ అన్నాడు.

"మీరు మాత్రం తక్కువ తిన్నారేమిటి? రోజు వాడి డబ్బుల్తోనేగా మన పార్టీలన్నీ!" ఉక్రోషంగా జవాబిచ్చాడు సత్యం.

"ఆ వెధవలిద్దరూ ఈపూటే తగలబడితే బాగుండును" సదానందం అన్నాడు.

"రేపు ఉదయంకాని, బయలుదేరం అన్నారు వాళ్ళు! ఈ రోజెలా వస్తారు?" కృష్ణ జవాబిచ్చాడు.

"ఒరేయ్! విశ్వం 'జావా' మ్రోత వినిపిస్తోంది" సత్యం అన్నాడు హఠాత్తుగా.

"నీ తలకాయ్! పచ్చకామెర్ల వాడి కళ్ళకి లోకమంతా పచ్చగా కనిపిస్తోందట" కృష్ణ వెటకారం చేశాడు.

మరో రెండు నిమిషాలకు వీళ్ళ గదిముందరే మోటార్ సైకిల్ ఆగిన చప్పుడయింది.

టకటకా బూట్లు చప్పుడు చేసుకుంటూ ఓ వ్యక్తివచ్చి "హాయ్ ఫ్రెండ్స్!" అంటూ గుమ్మంలో నిలబడ్డాడు.

"విశ్వం!" మిత్రులు ముగ్గురూ ఆశ్చర్యానందాలతోలేచి అతన్ని కౌగలించుకున్నారు.

"రేపు ఉదయం వస్తానన్నారు కాదురా. ఏడున్నరకే

వచ్చేశావేం?" సదానందం అడిగాడు.

"నీకు నూరేళ్ళు ఆయుష్షురా! నీ 'జావా' చప్పుడవుతోంది అంటే వీళ్ళు నన్ను వేళాకోళం చేశారు," సత్యం అన్నాడు.

"సరేగాని, నరసింహం గాడేడిరా?" కృష్ణ అన్నాడు.

"గుమ్మంలో నిలబెడతారేమిట్రా? లోపలికి రానివ్వరా?" విశ్వం నవ్వుతూ వాళ్ళని తప్పించుకుని లోపలికి వచ్చాడు.

కుర్చీలో కూర్చుని 'షూ' లేసులు విప్పుకుంటూ "ఇప్పుడు మళ్ళీ అడగండిరా మీ ప్రశ్నలు?" అన్నాడు.

మిత్రులు మళ్ళీ తమ ప్రశ్నల్ని వినిపించారు. ఈ లోపల విశ్వం తన బట్టల్ని విడచి హాంగర్‌కి తగిలించి కూడా తెచ్చిన సూట్‌కేసులోంచి పువ్వుల లుంగీ తీసుకొని కట్టుకుని, తన విల్స్‌ఫిల్టర్ కింగ్ సిగరెట్టు ముట్టించి, కుర్చీలో విశ్రాంతిగా కూర్చున్నాడు

"ఒరేయ్ విశ్వం! నువ్వు వచ్చేటప్పుడు 'హాట్‌డ్రింక్స్' ఏమీ తీసుకురాలేదురా?" కృష్ణ అడిగాడు.

"లేకేం? మన 'గోల్కొండ ట్రిప్లెక్స్ రమ్ము' మనతో వుంది!" నవ్వుతూ విశ్వం సూట్‌కేసులోంచి రెండు ఫుల్ బాటిల్స్ బయటపెట్టాడు.

"అహా రమ్ము? ఓహో రమ్ము!"

ముగ్గురం గదిలో విసుగెత్తి ఛస్తూవుంటే దేవుడిలా రావడమేగాక అమృతంలాంటి రమ్ముకూడా తెచ్చావు!" సత్యం ఆనందంగా అన్నాడు.

"గుంటడు కవిత్వం వొలకపోస్తోన్నాడోయ్!" సీసాల సీల్స్ విప్పుతూ కృష్ణ నవ్వాడు.

"దేవుడిలాగో దెయ్యంలాగో యెలాగో వొకలాగ వచ్చేడు. ముందు 'రమ్ము' కావలసినవాళ్ళు ఇటురండు"

సీసాల్లోకి ద్రవాలు పొయ్యగానే సదానందం పిలిచాడు.

"దెయ్యం మాటెత్తకురా బాబూ! నాకు భయం!" సత్యం అన్నాడు.

"భయమెందుకురా ఫూల్! తెలుగులో 'దేవుడికి' వికృతే 'దయ్యం'!" సదానంద నవ్వుతూ అన్నాడు.

"ఒరేయ్ మన విశ్వం ఏమీ మాట్లాడటం లేదురా?"

"ఇంతవరకూ పేకాడుతున్నార్రా మీరు?" విశ్వం అడిగాడు.

"అవును! నువ్వూ నరసింహం కూడా వుంటే బాగుండేదని అనుకున్నాం" సత్యం అన్నాడు.

"అన్నట్టు నరసింహం ఏడిరా?" సదానందం అడిగేడు.

"నువ్వు ముందుగా ఎలా బయల్దేరావురా?" అడిగాడు కృష్ణ.

"ఒరి జిడ్డుగాళ్లు. పట్టుకుంటే వదలరు" విశ్వం విసుక్కున్నాడు.

"జిడ్డుగాళ్లం కనుకనే మెడిసిన్ ఎనిమిదేళ్ళుగా చదువుతూనే వున్నాం!" కృష్ణ జవాబిచ్చాడు.

అంతా గొల్లున నవ్వుకున్నారు

"వైజాగ్‌నుంచి ప్రోగ్రాం ప్రకారం నేనూ నరసింహం రేపు ఉదయమే బయలుదేరాలి. కాని నేను సాయంత్రం నాలుగు గంటలకే బయలదేరుదామన్నా! నరసింహం వద్దన్నాడు. అయినా యీరోజు ఎలాగయినా కాకినాడ వచ్చెయ్యాలి అనుకున్నాను. ఆమాటే వాడితో అన్నా.

తాను సాయంత్రం పడ్డాక జీటీ రోడ్డుమీద మోటార్ సైకిల్‌మీద రానని కావలిస్తే రేపు ఉదయమే వస్తానని వాడు మొండికేశాడు. వాణ్ని వుండిపొమ్మని నేనొక్కణ్నే బయలదేరి వచ్చేశాను. ఆ వెధవ రేపుదయం బయలుదేరి

వస్తాడు. మీ ప్రశ్నలకన్నిటికీ జవాబులు దొరికాయా? ఇంకా యేమన్నా మిగిలాయా? .. నాకుకూడా ముక్కలు పంచండి!" విశ్వం ఆజ్ఞాపిస్తోన్నట్టే అన్నాడు.

" 'రమ్మ' తరువాత 'రమ్మీ'! ఆహా బహ్మామజా!" కృష్ణ పాడసాగాడు.

"మజా మజా మధురసం!" సత్యం కూనిరాగం తీస్తున్నాడు.

"మజాయే వెధవా! విశ్వం దగ్గర డబ్బులు కొట్టెయ్యాలని చూస్తోన్నావు. అందుకే ఇంతవరకూ వున్న యేడుపు మొహం పోయింది," సదాశివం నవ్వుతూ అన్నాడు.

"అదేం కుదరదు యివాళ. నన్నెవడూ గెలవలేడు. టేబుల్ మొత్తం క్లీన్‌స్వీప్ చెయ్యందే వదలను" విశ్వం గంభీరంగా అన్నాడు.

"నిజంగా!" ఆశ్చర్యం నటిస్తూ అన్నారు కృష్ణ, సదానందం.

వాళ్ళకి తెలిసి విశ్వం రోజూ వందో యాభయ్యో పోగొట్టుకునే వాడేకాని ఏ రోజూ పదిరూపాయలుకూడా గెలిచిన బాపతు కాదు!

"చూద్దురుగాని!" మెరిసే కళ్ళతో జవాబిచ్చాడు విశ్వం.

ఆ రోజు ఏమైందో కాని విశ్వం కోరుకున్న ముక్కలన్నీ అతని చేతికి రాసాగాయి. ఎదుటివాళ్ళ చేతిలోని ముక్కలు చూసినట్టుగా ఆడసాగాడతను.

అతనే 'షఫుల్' చేస్తే 'డీల్‌షో'లు అతనికే పడసాగాయి.

పదకొండు గంటలయ్యేసరికి అందరి దగ్గిర డబ్బులూ దాదాపుగా విశ్వానికి వచ్చేశాయి.

మరోగంటకు కృష్ణ, సత్యం, సదానందాలవి తలకొక

మూడువందల రూపాయలు సంపాదించాడు విశ్వం!

"ఒరేయ్ విశ్వీ! ఇవాళ దారిలో నక్కతోక తొక్కి వచ్చావేంటిరా?" కృష్ణ నవ్వాడు.

"అమ్మయ్య! యిన్నాళ్ళకు నా కోరిక తీరిందిరా" డబ్బును కట్టకట్టి సూట్ కేసులో పెడుతూ విశ్వం అన్నాడు.

"ఒరేయ్ విశ్వం మరి కాస్సేపు ఆడదాంరా!" సత్యం అన్నాడు.

"ఏమిటి 'గాత్రం'తోనా?" విశ్వం నవ్వాడు.

"పొద్దున్నే బ్యాంకు తీయగానే యిచ్చేస్తా!" సత్యం అన్నాడు.

"ప్రొద్దున్నకి నువ్వుంటావో నేనుంటానో ఎవరెరుగుదురు?" విశ్వం చిలిపిగా అన్నాడు.

"ఈ సత్యంగాడి డబ్బుకీ ప్రాణానికీ లంకే! లేకలేక వొక్కరోజు విశ్వం డబ్బులు గెలిస్తే అంత ఏడుస్తావెందుకురా! రేపు మళ్ళీ ఆడుకోవచ్చుగా!" సదానందం కసురుకున్నాడు.

"వెధవ పేకాట విసుగొచ్చింది లేరా! కాస్సేపు విశ్రాంతిగా కబుర్లు చెప్పుకుందాం లే!" కృష్ణ అన్నాడు.

ఆ విషయం యీ విషయం తిరిగి తిరిగి సంభాషణ దెయ్యాల మీదికి వచ్చింది.

"దెయ్యాలనేవి మనిషి భ్రాంతి నుండి పుట్టాయి!" కృష్ణ అన్నాడు.

"అలా అనకురా! మా వూళ్ళో నా చిన్నప్పుడు ఎందరో దెయ్యాల్ని చూశాం అని చెపుతూ వుండేవారు. అలా దెయ్యాన్ని చూసి రక్తం కక్కుకుని చనిపోయాడన్న వ్యక్తిని నేను చూశాను కూడాను! ఊరి చివర మర్రిచెట్టు క్రింద

పడివున్నాడా వ్యక్తి. అతని నోటినుంచి రక్తం కారుతూ వుంది. చాల భయంకరంగా వుందా దృశ్యం!"

జరిగినదాన్ని గుర్తుకు తెచ్చుకోవడం ఇష్టం లేనట్టుగా ముగించాడు సత్యం.

"నిత్యం చచ్చిపోయిన శవాల్ని కాసే నీకు భయమేమిట్రా?" కృష్ణ వేళాకోళం చేశాడు.

"చనిపోయిన వ్యక్తి శవాన్ని కోయబోతున్నామని మనకు ముందుగా తెలుసు! కాని మన కళ్ళముందు నిన్నటి వరకూ రాయిలా తిరుగుతున్న వ్యక్తి భయంకర పరిస్థితుల్లో శవంగా మారిపోతే భరించడం కష్టం కాదూ? మీ సంగతి ఏమోకాని నాకు దుర్భరపరిస్థితే అది! దెయ్యాలు వుండవచ్చుననే నా ఉద్దేశం?" ఖచ్చితంగా అన్నాడు సత్యం.

"శిష్యా సదానందా! దెయ్యాలున్నాయో లేదో నువ్వు చెప్పరా!" సీరియస్‌గా ఆలోచిస్తూ విశ్వం అన్నాడు.

"చిత్తంగురూ!" అని పాతాళభైరవిలో పద్మనాభం గొంతును అనుకరించాడు సదానందం.

"దెయ్యాలు వున్నాయనుకున్నవారికి వున్నాయి. లేవనుకున్నవారికి లేవు. వున్నాయనుకుంటే కనిపిస్తాయి. లేవనుకుంటే కనిపించవు."

"శభాష్ శిష్యా! భలే చెప్పావ్!"

విశ్వం ఫెళ్ళున నవ్వాడు.

"ఓరి వెధవా! గోడమీద పిల్లిలా ఆ స్టేట్‌మెంటేమిటి?" కృష్ణ, సత్యం నవ్వుతూ అన్నారు.

"ఆ! ఉన్నాయనుకుంటే వుండటం లేదంటే లేకపోవడం అని మన సదానందం అంటే నాకో కథ గుర్తొచ్చింది" కృష్ణ అన్నాడు.

"సరే! అదేదో వినిపించు!" సత్యం అన్నాడు.

"వెనుకటికి ఓ వూళ్ళో వున్న ఓ సాయిబుగారికి, ఓ రైతుకూ మాటల్లో పేచి వచ్చిందట. "మీ అమ్మవారు నన్నేమీ చెయ్యలేదు. కావాలంటే నీ యెదుట ఆమె నెత్తిన కాలు పెడతా! రా? అని ఆ సాయిబు ఆ రైతుతో అమ్మవారి గుడికి వెళ్ళి ఆ విగ్రహం నెత్తిన కాలు పెట్టాడట.

అమ్మవారు ఏదోచేసి సాయిబుని శిక్షిస్తుంది అనుకున్న రైతుకు నిరాశ యెదురైందిట! సాయిబు అలాగే నవ్వుతూ నిలుచున్నాడట "కావాలంటే రేపు పుదయిందాకా ఇలాగే నిలబడతా" అన్నాడు.

ఆ విషయం ఆ వూర్లో తెలిసేముందరే ఆవూరి మోతుబరి రైతుకు కలొచ్చిందట. అమ్మవారు అయన కలలో కనబడి "నా నెత్తిన కాలుపెట్టిన సాయిబుకాలు తీయించక పోయావంటే నీ యిల్లు గుల్లచేస్తా" అందిట.

ఆదరా బాదరా గుడికి పరిగెట్టుకొచ్చిన మోతుబరి సాయిబును చూసి "కాలు తియ్యరా!" అని హుంకరించాడట. కనుపించని అమ్మవారి శక్తికంటె ఎదురుగా కనుపించే మోతుబరి శక్తి తెలిసినవాడు కనుక సాయిబు గడగడలాడుతూ కాలుతీసి, మోతుబరి కాళ్ళమీద పడి క్షమించమని వేడుకున్నాడట.

....కనక వున్నారనుకున్నవాళ్ళకు దేవతగాని దెయ్యంగాని వుంటాయ్. లేవనుకున్న వాళ్ళకి వుండవ్! అంతా మన మనసు సృష్టించే భ్రాంతి మాత్రమే!" కృష్ణచెప్పడం పూర్తిచేశాడు.

"ఈమధ్య నాస్తికవాదం యెక్కువగా చదువుతున్నావేమిట్రా?" సదానందం వేళాకోళం చేశాడు.

"నే చెప్పింది నాస్తికవాదంనుంచి కాదోయ్! శుద్ధ ఆస్తికవాదియైన ఆదిశంకరాచార్యులవారి "మాయావాదం" నుంచి. మన మనస్సు యీ ప్రపంచాన్నంతా మాయ ప్రభావంచేత సృష్టిస్తోందని చెప్పలేదూ ఆయన!" కృష్ణ జవాబిచ్చాడు.

"ఒరేయ్ మందు కొట్టిన కొద్దీ వాక్కొక్కడి ఆలోచనలు పదునెక్కి మరీ గంభీర విషయాలు చర్చిస్తున్నారు. నాకు బోరు కొడుతోంది" సత్యం అన్నాడు.

"గురూ! యింతకూ దెయ్యాలగురించి నీ వొపీనియన్ చెప్పలేదేం?" సదానందం విశ్వాన్ని అడిగాడు.

"దెయ్యాలనేవి లేవు." ఖండితంగా చెప్పాడు విశ్వం. బెడ్ లైట్ కాంతిలో అతని మొహం వింతగావుంది. అతని కంఠం అదోకలా విచిత్రంగా ధ్వనించింది.

"అంత ఖచ్చితంగా చెప్పకోయ్. మా తాత ఒకసారి దెయ్యాన్నిచూసి జడుసుకుంటే మావూళ్లో భూతవైద్యుడు తాయెత్తుకట్టి నయం చేశాడట. ఆ తాయత్తును చచ్చేనాటి

వరకూ తీయలేదాయన" సత్యం అన్నాడు.

"మీ తాతలకాలం కబుర్లు చెప్పకురా. కావాలంటే నా జీవితంలో జరిగిన ఒక సంఘటనను చెబుతాను. దాన్ని బట్టి దెయ్యాలున్నాయో లేవో మీరే తేల్చుకోవచ్చు" విశ్వం గంభీరంగా అన్నాడు సిగరెట్ పీలుస్తూ.

అతని తీరు, ఆ గొంతు ఎప్పుడో యెక్కడో జరిగి పోయిన సంగతుల్ని గుర్తుకు తెచ్చుకుంటున్నట్టుగా వున్నాయి.

3

అప్పుడు నేను యింటర్మీడియట్ చదువుతున్నాను. మనది ముందరి నుంచీ వానాకాలం చదువే గాబట్టి మనం అప్పటికే నిండు యవ్వనంలోకి అడుగు బెట్టేశాం. శరీరక ముందునుంచీ భారీదేకదా! దానికితోడు మొండితనం పుట్టుం నుంచి వున్నదే. కనక ఏవూరు వెళ్ళినా ఎదురులేని వీరు డిలా తిరుగుతూవుండే వాడిని.

ఒకసారి మా మేనమామ వరస అయిన మా దూరపు చుట్టం ఊరికి వెళ్ళాను.

అది కోనసీమలో వో మారుమూల గ్రామం. అక్కడ మా పొలాలు కొన్ని వుండకపోతే ఆ ఊరువెళ్ళే ప్రసక్తే వుండకపోను. నా జీవితంలో వో మరపురాని అనుభవం లభించకపోను."

"ఏమిట్రా అది?" కుతూహలం ఆపుకోలేని సత్యం ప్రశ్నించాడు.

"చెబుతున్నాను కదా! ఇంతట్లో తొందరెందుకు?" విశ్వం కసిరాడు అతన్ని.

మొహం ముడుచుకు కూర్చున్నాడు సత్యం.

"మావయ్య ఆవూరి మునసబేగాక, మోతుబరి రైతు

కూడాను. అందుకని ఆ ఊరిలో మావయ్య వాళ్ళ యిల్లు చాలా పెద్దదిగా విశాలంగా కట్టబడివుంది. మిగిలినవారి ఇళ్ళు దానికి దూరంగా విడిగా వున్నాయి.

మావయ్యదగ్గర ముగ్గురు నలుగురు పాలేర్లుగాక అయిదారుదురు ఆడ పనిమనుషులుకూడా వున్నారు."

"గురూ? సినిమాల్లో కోనసీమగుంటల్ని మహా పసందుగా చూపిస్తారు. వాళ్ళు అలాగే వున్నారా?" విశ్వానికి అడ్డుతగిలి ప్రశ్నించాడు సదానందం.

" 'చలం' చెప్పినట్లు 'యవనవ్వనం'లో వున్నానన్నావ్! ఏమైనా...." నాన్చి నవ్వేశాడు కృష్ణ.

"ఒరేయ్! మీరిలా అడ్డంతగిలి గొడవచేస్తే అసలు చెప్పనంతే" విశ్వం విసుక్కుంటూ లేచాడు.

కాని అతనికి తన అనుభవాన్ని వాళ్ళకి వినిపించాలని వున్నట్టుగానే తోస్తోంది.

"బాబ్బాబు! ఇంక గొడవచెయ్యం. చెప్పు." మిత్రులు ముగ్గురూ బతిమాలా రతన్ని.

"మధ్యాహ్నం భోజనంచేసి హాయిగా పడుకున్నాను. సాయంకాలం మా పొలాలున్నవైపును కనుక్కుని అటు షికారు వెళ్ళబోతున్నాను.

"ఒరే అబ్బాయ్! చీకటి పడకుండా యింటికి తిరిగి వచ్చెయ్యి. వచ్చేటప్పుడు ఆ దెయ్యాల మర్రివేపు నుంచి రాకు సుమా. నీకూడా పాలేరును వెంటబెట్టుకుని వెళ్ళు!" మావయ్య హెచ్చరించాడు.

"సరే మావయ్యా!" అని పాలేరు నరసింహాల్ని వెంటబెట్టుకుని బయలదేరాను పొలానికి...."

"ఒరేయ్ విశ్వీ! మన నరసింహంగాడు అప్పుడు మీ మావయ్య దగ్గర పాలేరుగా వుండేవాడా?"

అశ్చర్యం నటిస్తూ ప్రశ్నించాడు కృష్ణ.

"ఛ వెధవా! మన నరసింహంగాడు వింటే ఏడుస్తాడు కూడాను. వాళ్ళ బాబు ఏదోవూరు మాజీ జమీందారుట కూడాను. అయినా నరసింహం అన్న పేరు యింకెవరికీ వుండకూడ దేమిటి? పాకీవాళ్ళనుంచి మంత్రుల వరకూ యెవరికేనా ఆపేరు వుండవచ్చు!" సదానందం జవాబు ఇచ్చాడు.

"ఒరేయ్, పాకీవాళ్ళు అని వాళ్లని అవమానకరంగా మాట్లాడుతున్నావు. వాళ్ళని దళితజాతులు అనో, బలహీన వర్గాలో, బడుగువర్గాలో, అట్టడుగు వర్గాలో ఏదో అనాలి. అంతేకాని మళ్లీ ఇందాకట్లా అన్నావంటే కోర్టుకెక్కిం చెయ్య గలరు జాగ్రత్త" కృష్ణ సదానందాన్ని హెచ్చరించాడు.

సదానందం, సత్యం, కృష్ణ ఘొల్లున నవ్వారు.

"ఛ వెధవగోల మీరూను. నేనింక చచ్చినా మీకు కథ చెప్పను."

విసుగ్గా అన్నాడు విశ్వం.

"ఛస్తే ఇంకేం చెప్పగలవులే, దెయ్యమైవస్తే తప్ప!" సదానందం నవ్వుతూ అన్నాడు.

"ఒరేయ్! వాణ్ని చెప్పనిస్తారా లేదా?" కథ వినాలన్న కుతూహలంకొద్దీ కసిరాడు సత్యం.

కృష్ణ, సదానందం వొకరి మొహం వొకరు చూసుకుని మాట్లాడకుండా కూర్చున్నారు.

"మావయ్య పాలేరుతో బయలుదేరిన నేను మా పొలాలను చూశాను." విశ్వం బయటి చీకటిలోకిచూస్తూ తిరిగి చెప్పసాగాడు.

"మా పొలాలను చూసివచ్చాక యింటి ముఖం పట్టి

నప్పుడు అతన్ని "దెయ్యాలమర్రి సంగతేమిటోయ్?" అని అడిగాను.

"అయ్యబాబో! దాని మాటెత్తకండి. దానిపేరు చెబితేనే భయం నాకు. జెరం వస్తుంది కూడానండి" నరిసింహులు జవాబిచ్చాడు.

దృఢకాయుడయిన నరిసింహులు లాంటి వ్యక్తే ఆ దెయ్యాలమర్రి పేరు చెబితే హడలిపోతున్నాడంటే దాన్ని గురించి తప్పక తెలుసుకు తీరవలసిందే అనుకున్నాను.

"ఆ దెయ్యాల మర్రిని నాకు చూపించవోయ్" అన్నాను అతనితో.

"వద్దండి బాబూ!"

ప్రతిఘటించాడు నరిసింహులు.

"చుట్టూ వెల్తురువుంది. చెట్టంత మనిషివి నువ్వు, ప్రక్కన భీముడిలా నేనూ వున్నాం. పద పదవోయ్!" అని అతన్ని బలవంత పెట్టాను.

ఊరి చివరనున్న డొంకదారి ద్వారా పుంతలోకి తీసుకెళ్ళాడు నరిసింహులు.

పుంతపక్కన స్మశానం వుంది. ఆ స్మశానానికి దగ్గరలోనే వో పెద్ద మర్రిచెట్టు వుంది దాని ఊడలు విస్తృతంగా వ్యాపించివున్నాయి. నేలలోకి చొచ్చుకుపోయి కొన్ని ఊడలు మళ్ళీ మొదళ్ళలా తయారయ్యాయి. చీకటివేళ చూస్తే అసలు మొదలేదో ఊడల మొదళ్ళేవో తెలుసుకోలేం!

ఆ చుట్టుపట్ల మరే యిళ్ళూలేవు. ఆ ఆరుబయలు ప్రదేశంలో వొంటరిగావున్న ఆ మర్రిచెట్టు నీరెండ పడుతున్న సాయంకాలయే భయం కలిగించేలావుంది. ఆ సాయంత్రానికే దూరంగా నక్కల కూతలు వినిపిస్తున్నాయి.



చెట్టునిండా నిండివున్న పక్షులగోల భరించ శక్యంగాకుండా వుంది.

దూరంనుంచే ఆ మర్రిచెట్టును చూపించిన నరిసింహులు "పోదాం బాబూ! ఇంటికి" అని గొడవ మొదలెట్టాడు.

అతని గొడవకి, ముందుకెళ్ళి ఆ దెయ్యాలమర్రిని పరిశీలించి చూద్దామన్న నా కోరికను అణచుకొని వెనక్కు తిరిగాం.

దారిలో "ఇంతకీ ఆ దెయ్యాలమర్రి విశేషాలేమిటోయ్" అని నరిసింహుల్ని ప్రశ్నించాను.

"బాబూ! ఆ మర్రికింద అర్ధరాత్రిళ్ల ఓ దెయ్యం తిరుగుతుంది. ఎవరేనా పొరపాటున అటువెడితే మీదపడుతుంది. దాన్నిచూసి జడుసుకున్న వాళ్లు మూడేసి రోజులు లంక

జాలు చేశారు. ప్రక్కవూరి శాస్త్రిలుగారు మంత్రం యేసిన యీబూది యిస్తేకాని జొరం తగ్గలేదు."

జవాబిచ్చాడు నరిసింహులు.

"నువ్వెప్పుడేనా చూశావా?" ప్రశ్నించా నతన్ని.

"అయ్యబాబోయ్, నేనాండి! నేనెప్పుడూ రేత్రిపడ్డాక అటు యెళ్ళనండి బాబూ!" అన్నాడు వాడు.

ఇంటికి తిరిగి వచ్చేశాం.

దారిలోనే ఆ రాత్రి ఆ దెయ్యం సంగతేదో తేల్చుకోవాలని నిశ్చయించుకున్నాను.

4

రాత్రి నేను ఆరుబయటే పడుకుంటానని నా మంచం బయట వేయించుకున్నాను.

నేను పడుకోబోయేముందే పై ఊరినించి యెవరో చుట్టాలు రావడంతో మా మావయ్య వాళ్ళకి భోజన సదుపాయాలవీ చూపి వాళ్ళతో మాట్లాడుతూ కూర్చున్నాడు.

'లాండ్ సిలింగ్'ల గురించి రహస్య మంతనాలు జరపడానికి వచ్చారట వాళ్లు. మా మావయ్య వాళ్లు ఇంటిలోని వో మూలగదిలో కూర్చుని తీవ్రంగా చర్చించుకుంటున్నారు. పడుకోవటంలేదు వాళ్ళెంతకీ.

అర్థరాత్రి కాబోతోంది. ఇంట్లో నా గురించి పట్టించుకునే వాళ్ళెవరూ కనబడలేదు.

ఆ దెయ్యంగురించి తెలుసుకోవాలన్న కుతూహలంచేత నా కంటికి కనుకురాలేదు.

జేబులోవున్న పెన్‌టార్చ్‌ని, పొడవాటి చాకును, సరిచూసుకుని మెల్లిగా మంచంమీంచి లేచి బయటకు నడిచాను.

అవి అమావాశ్య రోజులు. చుట్టూ గాఢాంధకారం.

చారలా నా పెన్ టార్చి వెలుతురు నేలమీద పడుతోంది. అటూ యిటూ చూడకుండా తిన్నగా పుంత దారినబడి దెయ్యాలమర్రివైపు నడిచాను.

చీకట్లో నడుస్తోంటే నా జోళ్ల చప్పుడే పెద్ద మ్రోతగా వినిపిస్తోంది కీచురాళ్ళు భయంకరంగా గోలచేస్తున్నాయి. దెయ్యాల మర్రి దగ్గరబడే కొద్దీ నా గుండె దడదడ కొట్టు కోసాగింది.

కాని నాకున్న సహజ మొండి ధైర్యంతో ముందుకు సాగాను.

ఒక పెద్ద ఊడచాటున నిలబడి చీకటిలోకి తీక్షణంగా చూడసాగాను.

కొద్దిసేపటికే నేనున్నవైపుకు రెండోవైపున తెల్లటి కాంతి చటుక్కున కనిపించి మాయమైంది.

మరి కొద్దిసేపటికే ఘల్లుఘల్లున గజ్జెల చప్పుడు వినిపించింది.

ఎంతచూపినా చీకట్లో ఎవరూ కనిపించలేదు.

మరికొద్ది సేపటికి మరోవైపున గజ్జెలచప్పుడు వినిపించింది.

నాకు చాలాదగ్గరగా తెల్లటి కాంతి చటుక్కున కనిపించి మాయమైంది.

అదేసమయానికి దగ్గరలో నక్క పెద్దగా కూత పెట్టింది. నా గుండె ఝల్లుమంది.

అయినా గుండెచిక్కబట్టుకుని చీకట్లోకి అలాగే చూస్తున్నాను.

ఒక తెల్లటి ఆకారం మర్రిమాను మొదలుదగ్గర కనిపించింది. ఆమెదగ్గరే గజ్జల చప్పుడు వినవస్తోంది. ఆమె అటూయిటూ తచ్చాడుతున్నట్టు అనిపించింది నాకు.

చప్పుడు కాకుండా అటువైపుకు నడిచాను. అడుగులో అడుగు వేసుకుంటూ నా భారీ శరీరాన్ని యెలా చప్పుడు గాకుండా నడిపించ గలిగానో నాకే ఆశ్చర్యంగా వుంటుంది యిప్పటికీ.

అక్కడి ఆకారం స్త్రీమూర్తి అనుకున్నది నిజమే.

ఆ అకారానికి యేమాత్రం అనుమానం కలిగించకుండా అక్కడికి వెళ్ళగలిగాననే నే ననుకున్నా.

కాని నా ఊహ తప్పని తొందర్లోనే తెలిసింది.

నేను దగ్గరకు వచ్చేసరికి హఠాత్తుగా తెల్లటికాంతి నా కళ్లలోకి ప్రసరించింది. క్షణంసేపు గుడ్డివాణ్నయిపోయా.

కెవ్వుమన్న హృదయభేదకమైన కేకా, దానితోపాటే యెవరో నన్ను గట్టిగా క్రిందకుతోయడం వొకేసారి జరిగాయి.

నేను క్రిందపడిపోయాను. అయితే పడిపోతూ నన్ను క్రిందకుతోసినచేతినికూడా అలాగే విడవకుండా పట్టుకున్నా.

ఇంకా ఆ ఆకారం నా చేతిలో గింజుకో సాగింది. అంతా చీకటి. నాకెందుకో పిచ్చిధైర్యం మొండితెగింపు వచ్చేశాయి.

నాచేతిలో గింజుకొంటూన్న ఆకారాన్ని బలంగా నా వైపుకు లాక్కుని నా పెన్‌టార్చిని ఆ ఆకారం మీదకు ప్రసరింపజేసా.

ఆశ్చర్యం! ఆమె మనలాంటి వో మామూలు స్త్రీయే.

"ఎవరు నువ్వు?" గద్దించా నామెను.

మాట్లాడ లేదామె.

ఆమె అందగత్తె! పచ్చటి శరీరం! తీరయినమొహం! పొంకమైన వొళ్లు! ఆమె మొహాన బొట్టు, మెడలో 'తాళి' మాత్రం లేవు.

ఆమె యింకా గింజుకోవటం మానలేదు.

ఆమె గింజుకున్నకొద్దీ ఆమె శరీరం నాకు మరింత చేరువయి ఆమెస్పర్శ నాలో వింత అనుభూతిని కలిగిస్తోంది.

ఒక ప్రౌఢయువతి నాకు అంత దగ్గరగా రావడం అదే మొదటిసారి.

ఆ స్పర్శను వదులుకోవడం యిష్టంలేక మరింతగా కౌగిలి బిగించి ఆమెను నా దగ్గరగా లాక్కున్నాను.

"నువ్వెవరో, ఇలా యిక్కడకువచ్చి దెయ్యంలా యెందుకు నటిస్తున్నావో నాకు సరిగా చెప్పావా సరేసరి! లేకపోతే నిన్నిలా యీడ్చుకెళ్ళి నలుగురిలో నిలబెట్టి వాళ్ళ చేతే అడిగిస్తా."

బెదిరించా నామెను.

ఆమె ఆ మాటకు వులిక్కిపడింది.

చిన్నగొంతుతో "మీరెవరు? యీవూరి వారిలా లేరే?" అనడిగింది.

నేనెవరినో ఆ ఊరు ఎందుకు వచ్చానో చెప్పానామెకు.

నేను మా మావయ్యగారింటికి వచ్చానని చెప్పగానే మరోసారి ఉలిక్కిపడిందామె.

"చౌదరయ్యగారింటకి వచ్చారా?" అడిగింది.

"మా మావయ్య తెలుసా నీకు?"

ఆశ్చర్యంగా అడిగానామెను.

"తెలియకపోవడ మేమిటి? ఆయన ఆడిస్తోన్న నాటకమే యిదంతా!" తలదించుకుని చెప్పిందామె.

ఇంతసేపూ ఆమెను నా కౌగిలిలోంచి వదలలేదు నేను. ఆమెకూడా విడిపించుకోవడానికి ప్రయత్నించలేదు. ఆమెతో అంతసేపు అంత దగ్గరగా వుండేసరికి నా వొళ్లు వేడెక్కింది. నేను చదివిన రొమేంటిక్ కథలు నాలోని కోర్కెల్ని

రెచ్చగొట్టాయి.

ఆమె ప్రతిఘటించ నప్పుడు నేనుమాత్రం యెందుకు వదలాలి అని ఆమెను అలా హత్తుకునే వున్నాను.

"మా మావయ్యే ఈ నాటకం ఆడిస్తున్నాడా? ఎందుకు?" ఆశ్చర్యంగా ప్రశ్నించా నామెను.

"నేను చిన్నతనంలోనే భర్తను కోల్పోయాను. నేను పెద్దదాన్ని అయ్యాక నన్నోసారి చూపిన మీ చౌదరయ్యగారి కన్ను నామీద పడింది. మా ఇంటికొచ్చి నా తలిదండ్రుల్ని బెదిరించి నన్ను లొంగదీసుకున్నాడు. అయితే ఈ విషయం నలుగురికీ తెలిస్తే పరువు తక్కువని రాత్రిళ్లు ఇక్కడికొచ్చి నన్ను కలుస్తూ వుంటాడు. ఎవరూ యీ చుట్టుపక్కలకు రాకుండా యీ చెట్టు దెయ్యాలమర్రి అని ప్రచారంచేసాడు.

ఒకవేళ యెవరయినా ఇటువస్తే మిమ్మల్ని బెదరగొట్టినట్టే టార్చిలైట్ కాంతితోనూ, కేకలతోనూ బెదరగొడ్తాం. అందువల్ల యెవరూ యిటు రావటం మానేశారు.

మా కలయిక నిరాఘాటంగా సాగుతోందింత కాలం. కాని ఈరోజు యిలా జరిగి మీ చేతిలో చిక్కాను.

"ఇంతకూ ఈరోజు మీ మావయ్య రాలేదేం?" ప్రశ్నించిందామె.

"ఎవరోవచ్చి ఆయనతో కబుర్లు పెట్టుకున్నారు. బహుశా అందుకే ఆయన రాలేదేమో!" జవాబిచ్చాను.

మా మావయ్య రాడనుకునేసరికి నాకు మరింత ధైర్యం వచ్చింది. ఆమెకు నేనంటే మక్కువగానే ఉన్నట్టుంది. జీవితంలో తొలిసారిగా స్త్రీపొందు పొందాలన్న కాంక్ష నన్ను లొంగదీసుకొంది.

ఆమెను నా వైపుకు త్రిప్పుకొని బలంగా కౌగలించుకొని ఆమె పెదవులపై ముద్దుపెట్టుకున్నాను.

ఆమె నాతో సహకరించింది. నన్ను అదుముకుంది.

కొంతసేపటికి "ఇక్కడ కాదు, నాకూడా రండి" అంది.

ఆమెకూడా వెళ్లాను.

మా మామ మర్రిచెట్టుకు కొద్దిదూరంలోనే ఒక చిన్న పాకలో చక్కటి మంచం, పరుపు అన్నీ అమర్చుకునే ఉంచాడు.

"ఇవి వుదయం ఏమీ కనబడలేదే! పాక ఖాళీగా వుంది!" ఆమెతో అన్నాను.

"ఉదయాన్నే నరిసింహులు వీటని దాచేస్తాడు!" జవాబిచ్చింది ఆమె.

"ఏవరు నరిసింహులా? తనకిక్కడికి రావటమే భయమన్నాడే!" ఆశ్చర్యంతో అడిగాను.

"దొంగవెధవ! వాడికంతా తెలుసు!" నవ్విందామె.

"అమ్మ వెధవా!" అనుకున్నాను.

ఆమెతో గడిపిన ఆ రాత్రి అపురూప అనుభవాన్ని నేను జీవితంలో యెప్పుడూ మర్చిపోలేను.

ఎవరేనా దెయ్యాలున్నాయా అన్నప్పుడల్లా నాకు ఆమే గుర్తుకొస్తుంది.

కనక ఓ బడుద్ధాయిలూ దెయ్యాలున్నాయని యెవరేనా అంటే నమ్మకండి. అవన్నీ వట్టి బూటకాలు."

ఆవలిస్తూ ముగించాడు విశ్వం.

"అదుగో ఆ మాటే నే నొప్పుకోను. అన్నీ బూటకాలు కావు. కొన్ని నిజాలు కావచ్చు!" సత్యం తన పాత పాట పాడాడు.

"ఒరేయ్ విశ్వం! మనకు తెలిసిన పాత కధవే క్రొత్తగా చక్కగా చెప్పావురా!" సదానందం అన్నాడు.

"పాత కథనయినా మంచి రంజుగా చెప్పినందుకు మెచ్చుకోవాలిరా వీడ్ని" కృష్ణ అన్నాడు.

"ఒరే వెధవల్లారా! నేను నిజమైన కథ చెప్పాను. నమ్మకపోతే మీ ఖర్మ! నాకు నిద్రొస్తోంది పడుకుంటున్నాను."

విశ్వం మొదటి గదిలో నుండి రెండో గదిలోకి వెళ్ళి తన పక్కమీద వాలాడు.

ఆ తర్వాత కాస్సేపటికే అతనికి నిద్ర పట్టేసింది.

తెల్లవారేసరికి యీ టెలిగ్రాం!

5

"ఒరేయ్ విశ్వం నిజంగానే చచ్చిపోయాడేమోరా! నిన్న రాత్రి వచ్చింది వాడి దయ్యమేమో!"

అనుమానంతో అన్నాడు సత్యం.

"వెధవా! నీకు మతి పోతోంది. ఎదురుగుండా వాడు తెచ్చిన రమ్ము సీసాలు, వాడు త్రాగి పారేసిన సిగరెట్ పీకలు కనిపిస్తూంటే దెయ్యం, దేవత అంటావేమిటి?"

కసురుకున్నాడు సదానందం.

సత్యం ఆ మాటల్తో కొంచెం సర్దుకున్నాడు. ఇంతలో అతనికి తను రాత్రి పోగొట్టుకున్న డబ్బు గుర్తుకొచ్చింది.

"ఒరేయ్ విశ్వంగాడు, నరసింహం రాత్రి మన దగ్గర పేకాటలో కొట్టేసిన డబ్బుతో ఎక్కడో జల్సాగా పార్టీ చేసుకుంటూ వుండి వుంటారు" విచారంగా అన్నాడు.

"ఏడవకురా! ఆ వెధవల్ని ఎక్కడున్నా పట్టుకోము! తుని రమ్మని టెలిగ్రామ్ యిచ్చాడుగా నరసింహం. వీళ్ళిద్దరూ తునిలోనే యేదో లాడ్జిలో వుండి వుంటారు. మనం అక్కడికి వెళ్ళి ఎంక్వయిరీ చేస్తే యిట్టే తెలిసిపోతుంది. అక్కడికి పోదాం పదండి" అన్నాడు కృష్ణ.



సత్యం, సదానందం, సత్యం జావా మోటార్ సైకిల్ మీదా, కృష్ణ తన వెస్పా స్కూటర్ మీద కాకినాడ నుంచి బయలుదేరి తుని చేరారు.

"ఎక్కడ వెతుకుదామురా వీళ్ళని?" కృష్ణ అన్నాడు.

"ముందర హోటల్స్ అన్నీ గాలిద్దాం" సదానందం జవాబిచ్చాడు.

"ఈ వూళ్ళో వున్న హోటల్స్ యెన్ని కనక?" కృష్ణ అన్నాడు.

ఒక అరగంట లోపలే విశ్వం కాని నరసింహం ఆ వూళ్ళోని యే హోటల్లో కాని, లాడ్జింగ్ హౌస్‌లో కాని లేరని తేలిపోయింది.

"ఒరేయ్ విశ్వం, నరసింహం మనం యిటు బయిలుదేరేసరికి, వాళ్ళు కాకినాడకు వచ్చారేమో!" సదానందం

అన్నాడు.

"అయివుండదురా! వస్తే మనకెదురవ్వాలిగా!" కృష్ణ జవాబు యిచ్చాడు.

"ఒరేయ్! నిజంగానే విశ్వం చచ్చిపోయాడేమోరా! యెక్కడేనా యేక్సిడెంట్ అయిందేమో! నరసింహంగాడు హాస్పిటల్‌లో వున్నాడేమో!" సత్యం అన్నాడు.

"ఓరి శకునపక్షీ! అటువంటి పాడుమాట లంటావేరా? మన కళ్ళెదురుగా రాత్రంతా విశ్వం కూర్చుని పేకాడితే చచ్చిపోయాడంటా వేమిట్రా?" కసురుకున్నాడు సదా నందం.

ఏ హోటల్‌లోనూ, విశ్వం నరిసింహం కూడా కనిపించక పోయేసరికి అతనికీ లోపల కొంచెం కంగారుగానే వుంది. అయినా తన ఆందోళన బయటపడకూడదని సత్యాన్ని అలా కసురుకొన్నాడు.

"ఎందుకేనా మంచిది గవర్నమెంటు హాస్పిటల్‌లో కనుక్కుందామా?" దీర్ఘాలోచన తరువాత అన్నాడు కృష్ణ.

అపనమ్మకంతో ఆ ముగ్గురూ గవర్నమెంటు ఆస్పత్రి వైపుకు బయలుదేరారు.

హాస్పిటల్ బయట విశ్వం వాళ్ళ నాన్నగారి కారు వుంది.

"ఒరేయ్ విశ్వం నాన్నగారి కారు యిక్కడెందుకుందిరా?" ఆదుర్దాగా ప్రశ్నించాడు సత్యం.

జావాను, వెస్పాను గుమ్మంలో వదిలిపెట్టి అదిరే గుండెల్తో లోపలికి పరుగు పెట్టారు సత్యం, సదానందం, కృష్ణలు.

వాళ్ళకు యెదురుగా గోలు గోలున యేడుస్తున్న విశ్వం అమ్మగారు, చెల్లెలు దుఃఖాన్ని దిగమ్రింగుకోడానికి వ్యర్థ

ప్రమత్నం చేస్తున్న విశ్వం నాన్నగారు.

మరో ప్రక్క చేతికి తలకు కట్లతో వో బెడ్ మీద నరిసింహం.

"బాబూ! మా విశ్వం మమ్మల్ని అన్యాయం చేసి వెళ్ళిపోయాడు బాబూ!"

వీళ్ళను చూస్తూనే భోరున ఏడ్చిందావిడ.

మిత్రులకి ముగ్గురికీ నోట మాట రాలేదు.

ఏది నిజం? ఏదబద్ధం?

రాత్రి విశ్వం రావడం, తమతో రాత్రంతా గడపడం కలా నిజమా? తమందరికీ ఒకేసారి కల యెలా వస్తుంది? మరి తాము చూసిన విశ్వం సిగరెట్టు పీకలు, రమ్ము సీసాల సంగతేమిటి?

ఆలోచనతో, ఆందోళనతో వాళ్ళకేం అంతు పట్టలేదు.

చివరి కెలాగో గొంతు పెగుల్చుకుని సదానందం "ఏం జరిగింది?" అన్నాడు.

నరిసింహం తన కళ్ళనుండి స్రవిస్తున్న నీటిని ఎడమ చేతితో తుడుచుకుంటూ "ఒరేయ్! విస్సీ మనకింక లేడురా! రాత్రి ఏడున్నరకి విశాఖపట్నం నుండి వచ్చేటప్పుడు జరిగిన యేక్సిడెంటులో మరణించాడురా! రాత్రి ప్రయాణం వద్దురా అని ఎంత మొత్తుకున్నా వినలేదు. రాత్రే వెళ్ళిపోదాం అని పట్టుబట్టి యెనభై తొంభై స్పీడులో బండి నడుపుతున్నాడు. హఠాత్తుగా ఎదురుగా వచ్చిన లోడ్ లారీని తప్పించుకోవడానికి ప్రక్కకు తిప్పాడు మోటార్ సైకిల్ని. అనుకోకుండా బాలన్స తప్పడంతో చెట్టుకు గుద్దుకుంది జావా." అన్నాడు.

ఆ మాటలు వింటూనే సత్యం స్పృహతప్పి క్రింద పడిపోయాడు.

ఓ నర్స్ వచ్చి అతని పల్స్ చూసి వో బెడ్‌మీద పడుకో బెట్టించింది.

కృష్ణ, సదానందాల మొహాన్న కళలేదు. తెల్ల కాగితాల్లా తయారయ్యాయవి.

"ఈ రోజు వుదయం బయలుదేరుతామన్నారు కదా! నిన్న రాత్రి ఎందుకు బయలుదేరారు?" సదానందం తన బుద్ధిని తన స్వాధీనంలోకి తెచ్చుకుంటూ ప్రశ్నించాడు.

"ముందర అనుకున్నదాని ప్రకారం యీ రోజు వుదయం బయలుదేరవలసిందే! అయితే విశ్వం యెలా గయినా నిన్న రాత్రే బయలుదేరి కాకినాడ చేరాలని పట్టు బట్టాడు. "జీ. టీ. రోడ్డుమీద రాత్రి ప్రయాణం కష్టంరా" అన్నా వినలేదు.

"ఒరేయ్ యీ రాత్రి తొమ్మిది గంటలకల్లా కాకినాడ చేరాలి. ఆ వెధవలు రోజూ పేకాటలో నా దగ్గర డబ్బులు కొట్టేస్తున్నారు. ఈ వేళ యెలాగయినా క్లీన్‌స్వీప్ చెయ్యాలి. ఈ వేళెందుకో నాకు తప్పకుండా గెలుస్తాననిపిస్తోంది!" అన్నాడు.

వైజాగ్ నుంచి బయలుదేరాక కూడా అదే విషయం గురించి ఆలోచిస్తున్నాడు. బహుశా ఆ విషయం గురించిన ఆలోచనలో పడబట్టే, మోటార్‌సైకిల్‌ను ప్రక్కకు తప్పించటంలో బాలన్సు తప్పి వుంటుంది.

ఏక్సిడెంట్ కాగానే ఎగిరి క్రిందపడిన విశ్వం అప్పటి కప్పుడే మరణించాడు. స్పృహ తప్పిన నన్ను లారీవాళ్ళు యీ ఆస్పత్రిలో చేర్చారు.

నాకు స్పృహ రాగానే మీకూ, విశ్వంవాళ్ళ నాన్న గారికీ టెలిగ్రాము లిచ్చాను. నా మాటలు విని వాడు యీ వుదయాన్నే బయలుదేరితే యెంత బావుండేది!"

దుఃఖంతో పూడుకుపోయిన గొంతువల్ల ఆగాడు నర
సింహం.

అప్పటికి స్పృహ వచ్చిన సత్యం "విశ్వం దెయ్యం,
విశ్వం దెయ్యం!" అని కలవరిస్తున్నాడు. ప్రక్కమీద
యెగిరిపడుతున్నాడు.

కృష్ణ, సదానందాలు వాకరి మొహాలొకరు చూసు
కుంటూ నిలబడ్డారు నిశ్చేష్టుల్లా.

విశ్వం అమ్మగారు, నాన్నగారు చెల్లెలు, నరిసింహం
వీళ్ళవైపు ఆశ్చర్యంతో చూస్తున్నారు.

అంతలో అక్కడకు వచ్చిన డాక్టరుగారు "ఏమిటి!
ఏమయిందతనికి?" అని ప్రశ్నించారు.

"రాత్రి విశ్వం మా గదికి వచ్చి మాతో పేకాడాడు.
అది గుర్తొచ్చి సత్యం అలా భయపడుతున్నాడు" సదా
నందం మెల్లిగా జవాబిచ్చాడు.

ప్రక్కలో బాంబు పేలినట్టు అదిరిపడ్డా రందరూ.

"నో! యింపాజిబుల్! హివాజ్ డెడ్ బై సెవెన్‌థర్టీ!
ఇక్కడికి తీసుకొచ్చేసరికే అతని ప్రాణం పోయింది."
దాక్టరు గట్టిగా అన్నాడు.

విశ్వం నాన్నగారు కృష్ణతో "మీరు చెప్పేది నమ్మ
లేకుండా వున్నాం!" అన్నాడు.

సదానందం "రాత్రి విశ్వం ప్రవర్తన కొద్దిగా వింతగా
అనిపించింది మాకు. అయినా పట్టించుకోలేదు మేము"
అన్నాడు.

నరిసింహం కృష్ణను సైగచేసి పిలిచాడు.

దగ్గరకు వచ్చాక "ఒరేయ్ రాత్రి మీరు దోసుమీద
లేరు కదా" అన్నాడు.

కృష్ణ "లేదురా!వాడువచ్చేవరకూ మేమంతా నార్మల్‌గా

వున్నాం. వాడే 'గోల్కొండ్ ట్రిప్లెక్స్ రమ్' తీసు కొచ్చాడు. అది కూడా ఎక్కువగా తీసుకోలేదు" అన్నాడు.

"ట్రిప్లెక్స్ కదూః అవును వైజాగ్‌లో బయలుదేరే ముందు కొని సూట్‌కేసులో పడేశాడు" ఆశ్చర్యంగా అన్నాడు నరిసింహం.

అప్పటికే దగ్గరకు వచ్చి వీళ్ళ సంభాషణ వింటున్నాడు డాక్టర్. "అయితే మీరు చెప్పేది తప్పో రయిటో యిప్పుడే తేలిపోతుంది" అన్నాడు.

వెంటనే వెళ్ళి వో మూల పెట్టివున్న విశ్వం సూట్‌కేసు తీసుకొచ్చి మూత తెరిచాడు.

మూత తెరవగానే వెయ్యి రూపాయల నోట్లకట్ట పైనే వుంది.

"అదుగో అదే డబ్బు! రాత్రి విశ్వం మాతో పేకాటలో గెలిచాడు. నావి,కృష్ణవీ,సత్యంవీ తలకో మూడువందలు గెలిచాడు. ఇన్నేళ్ళకి అతనికోరిక తీరిందని కూడా అన్నాడు."

సదానందం అన్నాడు.

అప్పటికి స్పృహ వచ్చి వీళ్ళ ప్రక్కకొచ్చి నిలబడ్డ సత్యం ఆ డబ్బు వైపు చూశాడు.

"అదుగో ఆ రెండు యాభై రూపాయల నోట్లు నేనిచ్చినవే! పెన్సిల్‌తో నా సంతకాలుంటాయి కూడాను చూడండి" అన్నాడు.

అంతవరకూ వీళ్ళ మాటలపై నమ్మక ముంచని డాక్టరు, నోట్లకట్ట విప్పి దాంట్లోని యాభై రూపాయల నోట్లని పరీక్షగా చూశాడు. వాటిమీద సత్యం సంతకాలు అంతకు ముందురోజు తారీకుతో వున్నాయి.

"పెద్ద నోట్లమీద పెన్సిల్‌తో సంతకం పెట్టడం వాడి కలవాటు" కృష్ణ అన్నాడు.

సూట్‌కేసు అంతా తీపి చూశారు.

లోపల రమ్ బాటిల్స్ లేవు.

"మీరు చెప్పేది నమ్మవలసినట్టే వుంది."

డాక్టరు ఏదో ఆలోచిస్తూ అన్నాడు.

"డాక్టరుగారూ! ఇదంతా ఏమిటి? చనిపోయాడని మీరు చెబుతున్న విశ్వం రాత్రి వాళ్ళ దగ్గరకు వచ్చారంటున్నారు వాళ్లు. అదెలా సాధ్యం? మరణించిన మనిషి మరోచోట యెలా కనబడగలడు?" ఆందోళనగా ప్రశ్నించాడు విశ్వం తండ్రి.

"దెయ్యమయితే తప్ప!" మెల్లిగా అన్నాడు సత్యం.

"డాక్టర్‌గారూ! ఇంతవరకూ ఎప్పుడూ లేనిది విశ్వం నిన్న పేకాటలో విపరీతంగా గెలిచాడు. ఎప్పుడూ డబ్బు పోగొట్టుకోవడమేగాని గెలవటమన్నది లేదతనికి. పైగా పై వాడు ఏ ముక్క కొట్టబోతున్నాడో, పేకలో ఏ ముక్క రాబోతోందో ముందే తెలిసినట్టుగా ఆడాడు. వాడు చని పోగానే దెయ్యమయి మా దగ్గరకు వచ్చాడు. దయ్యం కనుకనే అలా గెలిచాడు."

సత్యం వొణుకుతూ అన్నాడు.

"రాత్రి దెయ్యాలులేవని మాతో వాదించాడు కూడాను" సదానందం అన్నాడు.

"అవును నమ్మకండి. దెయ్యాలు లేవు" అన్నాడు. "ఉండి వుండచ్చు అని సత్యం అంటే వాడ్ని కొట్ట బోయాడు కూడాను!" కృష్ణ అన్నాడు.

"చాలా ఆశ్చర్యంగా వుంది" డాక్టర్ ఆలోచనలో పడి అన్నాడు.

"డాక్టర్‌గారూ! ఇది సంభవమేనా? వీళ్ళు కట్టుకథ కల్పించి చెబుతున్నారేమో!" విశ్వం తండ్రి అనుమానంగా

అన్నాడు.

"అన్నీ ఆలోచించి చూస్తే వీళ్లు చెప్పింది నిజమేనేమో అనిపిస్తోంది. అప్పుడప్పుడు మరణించిన వ్యక్తుల్ని వారు మరణించాక వారి స్వంత రూపాల్లో చూసినట్టు కొందరు చెప్పినట్టు మెడికల్ హిస్టరీలో వుంది. బహుశా ఇదీ అటు వంటి వొక వింత కేసేమో!" డాక్టర్ జవాబిచ్చాడు.

"మన హైందవమత విశ్వాసాల ప్రకారం కూడా మరణానంతరం, తీరని కోర్కెల ప్రభావం వల్ల కొందరు తమ స్వంత రూపాల్లో కనిపించడం సంభవమే!

ఈ కేస్‌లో పేకాటలో ఎలాగయినా మిమ్మల్ని గెలవాలనే తీరని కోరికే అతన్ని మరణానంతరం కూడా మీ దగ్గరకు తీసుకొచ్చి వుంటుంది" డాక్టర్ అన్నాడు.

"మరి దయ్యాలు లేవని వాదించేదే!" సత్యం అనుమానం వెలిబుచ్చాడు.

"వాడు చిన్నప్పటినుండీ దెయ్యాలు లేవులేవు అంటూండేవాడు బాబూ!" విశ్వం తండ్రి విచారంగా జవాబిచ్చాడు.

"అదే అయ్యుంటుంది! తను గాఢంగా నమ్మినదాన్ని మరణానంతరం కూడా అతని ఆత్మ వదులుకోలేదన్న మాట!" డాక్టరు అన్నాడు.

"ఏమయితేనేం! వొక రాత్రంతా కూడా మిత్రుడి మరణానంతరం అతనితో గడపగలిగే అదృష్టం పట్టినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను!" సీరియస్‌గా అన్నాడు డాక్టర్.

"విశ్వం నువ్వు బ్రతికి వుండటమే నిన్న రాత్రిలా నిజమై, యీ మరణించావన్నదే అబద్ధమైతే యెంత బావుండును!"

మిత్రులు ముగ్గురూ బాధగా అనుకుని నిట్టూర్చారు. □

సీరియల్

ది సీక్రెట్ గ్యాంగ్

'సికిందర్

(గత సంచిక తరువాయి)

ఆ వీధిలో ఒక భవనం నిర్మాణంలో వుంది. భవనం ముందు అంతా ఇసుక పర్చుకునివుంది. సడెన్ ఇసుకలో ఒకచోట ఆగిపోయింది. ముందుకెళ్ళడానికి నిరాకరించింది.

జాన్ టార్చివేసి ఇసుకలో చూశాడు. టైరు గుర్తులు కన్పించాయి. అవి సైకిల్ టైరు గుర్తులు.

జాన్ తిరిగివచ్చి లాల్‌కి చెప్పాడు.

లాల్ అన్నాడు: "ప్రొఫెసర్ శుక్లాకి ఉత్తరం తెచ్చిన అమ్మాయికూడా సైకిల్‌మీదవచ్చింది. ఇప్పుడదే అమ్మాయి గనుక వచ్చివుంటే ఈ గది చేరుకోడానికి స్ప్రింగు వుప యోగించి ఉండాల్సిందే!"

"నువ్వు మర్చిపోతున్నావు. ఇక్కడ స్ప్రింగు అవ సరం లేదు. వెంటిలేటర్ నానుకుని పైపువుంది. లాల్, ఇప్పటి పరిస్థితినిబట్టి శ్యామసుందరి, సర్పిక కాదని బోధ పడుతోంది."

"అవును. వాళ్లకి యెలబీవుంది. బలమైన యెలబీ— పోలీసులు సాక్షులుగా. సర్పిక అస్సామీ అయినంత మాత్రాన ఆమెని అనుమానించడం మన బుద్ధి తక్కువ. వాళ్ళిద్దరు డాన్సర్స్. ఇన్నోసెంట్స్. పొట్ట పోసుకోడానికి ఈ సిటీకి వచ్చారు—హత్యలు చెయ్యడానిక్కాదు."

"అయితే యీ శ్యామసుందరి యెవరు? ఆమె ఎందుకీ హత్యలు చేస్తోంది?"

"ఈ హత్యలన్నీ ఒకదానితో మరొకటి ముడిపడి వున్నాయి. శ్యామసుందరి ఒక ముఠా యేజెంట్.

"మాలిని కందిన ఉత్తరంలో ఆమెదగ్గర యేవో టాబ్లెట్స్ వున్నాయని తెలుస్తోంది. ఆ టాబ్లెట్సు అరవింద్ యిచ్చివుండవచ్చు. అరవింద్, మాలిని కలిసి వాటిమీద పరిశోధన చేస్తోన్నారు. ఆ పరిశోధన శత్రువులకిష్టంలేదు" అన్నాడు లాల్.

"నాలుగు హత్యలు విజయవంతంగా ముగిశాయి" జాన్ అన్నాడు.

"హంతులందరూ ఇంతవరకు మూర్ఖంగా ప్రవర్తించారు. మనకి సహకరించడానికి వాళ్ళకి భయం! వాళ్ళ సహకారం

లేకుండా మనం యేమీ చెయ్యలేం?"

గదిలో పోలీసు తతంగం సాగుతోంది.

డిటెక్టివ్‌లు కృష్ణన్ దగ్గర శెలవు తీసుకొని బయటకు వచ్చేశారు.

35

ఆ రాత్రి డిటెక్టివ్‌లు నిద్రపోలేదు. ఆఫీసుకొచ్చి యెవరికి వారు తీవ్రంగా ఆలోచించుకో సాగారు.

లాల్ ఇంతవరకు నలుగురు ప్రొఫెసర్‌ల శవాలదగ్గర దొరికిన నాలుగు కార్డ్సుని పరిశీలించ సాగాడు. అతని పరిశీలనలో ఏదో విషయంతట్టి, తప్పిపోతోంది....

ఆ కార్డ్సుని వరుసగా టేబిల్‌పైన పేర్చి తదేకంగా చూడసాగా :—

మొదటికార్డు ప్రొఫెసర్ శంకర్‌దయాళ్ శర్మ దగ్గర దొరికింది:

'నెం-1 : వాగ్దానం నిలబెట్టుకున్న—మీ శ్యామ.'

రెండవకార్డు ప్రొఫెసర్ యోగింద్రనాధ్ శుక్లా దగ్గర దొరికింది :

'నెం-2 : వాగ్దానం నిలబెట్టుకున్న—మీ శ్యామ.'

మూడవకార్డు ప్రొఫెసర్ అరవింద్ కుమార్ దగ్గర దొరికింది :

'నెం-3 : వాగ్దానం నిలబెట్టుకున్న—మీ శ్యామ.'

నాల్గవ కార్డు ప్రొఫెసర్ మిస్. మాలినీదేవి దగ్గర దొరికింది :

'నెం-4 : వాగ్దానం నిలబెట్టుకున్న—మీ శ్యామ.'

లాల్ నాలుగు కార్డులనీ వెనకవేపు తిప్పిచూసాడు. మాలినీదేవి కార్డుమీద రెండు ఇంగ్లీషు అక్షరాలు కన్పించాయి ; E L

లాల్ చిన్నగా ఈలవేసేడు. జాన్ తేరుకుని చూసేడు. లాల్ ఇంకా ఉత్సాహంగా ఈలవేయ సాగాడు. ఆ తరువాత హఠాత్తుగా లేచి నిలబడి, "మిస్టరీ తెలిపోయింది!" అనర్చాడు.

జాన్ గాభరాగా కూర్చుని చూశాడు. ఏమీ అర్థం కాలేదు.

"శ్యామ అంటే ఏమిటో తెలుసుకున్నాను!" అన్నాడు మళ్లీ లాల్.

జాన్ తికమకగా చూశాడు; "శ్యామ అంటే ఏమిటి?"

లాల్ నవ్వాడు. "చాలా సింపుల్! కానీ, మన బుర్రలు పనిచేయక ఇంతకాలం అర్థంకాలేదు."

"నా కిప్పటికీ అర్థంగావడం లేదు!" అన్నాడు జాన్, అసహనంగా.

లాల్, జాన్‌కి కార్డ్సు అందించాడు: "వాటిని వరుస క్రమంలో పెట్టి, ఆ వరసక్రమంలో అవి యెవరెవరికి అందాయో ఆలోచించు. మొదటికార్డు శంకర్‌దయాళ్‌శర్మ, రెండవకార్డు యోగింద్రనాధ్ శుక్లా, మూడవకార్డు అరవింద్‌కుమార్, నాలగవ కార్డు మాలినీదేవి—

ఈ నలుగురి పేర్లలోని మొదటి అక్షరాల్ని వరుసగా తీసుకో: శ, యో, అ, మ—ఇవి తెలుగులో. వీటినే ఇంగ్లీషులో తీసుకొంటే S, Y, A, M అవుతాయి—అంతేనా?"

జాన్ తటాలున లేచి లాల్‌ని చుట్టుకున్నాడు.

"లాల్! మార్వలెస్! ఫెంటాస్టిక్! వండర్ఫుల్!"

"ఇంకావుంది," అన్నాడు లాల్ జాన్‌ని విడిపించుకుంటూ:

"ఇంతవరకు మనకు దొరికిన కార్డ్సుతో SYAM అవ

తుంది. 'శ్యామ' పేరు అసంపూర్తిగావుంది. ఆ పేరు పూర్తి కావాలంటే, SYAM పక్కన A చేరాలి."

"అవును!"

"తదుపరి హత్యతో ఆ 'A' చేరుతుంది."

"గాడ్! యెవరి హత్య జరుగుతుంది?"

"'A' అక్షరంతో ప్రారంభమయ్యే పేరుగల ప్రొఫెసరు హత్య జరుగుతుంది—"

"ఓహ్, లాల్! దిసీజ్ యె స్ట్రేంజ్ బిజినెస్."

"శ్యామ అనేది యెవరిపేరూ కాదు. ఆ పేరులో ఐదుగురు ప్రొఫెసర్ల పేర్లు దాగివున్నాయి. ఇప్పుడు జరగబోయే 'A' అక్షరంతో ప్రారంభమయ్యే పేరుగల ప్రొఫెసరు హత్యతో ఈ హత్యల పరంపర ముగుస్తుంది."

"ఆ ప్రొఫెసర్ యెవరు?"

"మనం తెల్సుకోవాలి. ఆ ప్రొఫెసర్‌కి ఈ నలుగురి ప్రొఫెసర్లతో సంబంధం వుండాలి. అలాటి ప్రొఫెసర్‌నే మనం ట్రేస్ చేసి హత్య నివారించాలి."

"ఈ ప్రొఫెసర్లు ఎందుకు హత్య చేయబడుతున్నారు? వీళ్ళలో ఇద్దరు శత్రువులని అన్వేషిస్తున్నారు. మరో ఇద్దరు ఏదో ఫార్ములా కన్వేషిస్తున్నారు. మరొక ప్రెఫెసర్ మిగిలి వున్నాడు. అతను ఈ రెండు వర్గాల వారిలో ఎవరికో చెందినవాడై వుంటాడు. వీళ్లంతా ఒక రహస్యకూటమిగా ఏర్పడ్డారు. వీళ్లని నాశనం చెయ్యడం శత్రువుల లక్ష్యమా?" అడిగాడు జాన్.

"అవును. శత్రువులని అన్వేషిస్తున్నవారిని చంపారంటే అర్థముంది. కానీ, ఫార్ములా కోసం ప్రయత్నిస్తున్నవారు ఎందుకు చంపబడ్డారు? శత్రువులు ఆ ఫార్ములా

తెలుసుకున్నారా? ఏమిటా ఫార్ములా? అరవింద్ జేబులో మనకో టాబ్లెట్ దొరికింది—ఓహ్—దాన్ని ఎనాలిసిస్ చెయ్యడానికి కృష్ణన్‌కి ఇచ్చాను. అతనింకా రిజల్టు చెప్ప లేదు—"

"నెవర్ మైండ్" అన్నాడు జాన్. "ఆ రిజల్టుకంటే ముఖ్యం మనం 'A' ప్రొఫెసర్ని రక్షించడం. వెంటనే ఆ ఏర్పాట్లన్నీ చెయ్యాలి. అయితే లాల్, అనూరాధ చెప్పిన శ్యామసుందరి ఎవరు?"

"అది ఆమె అసలు పేరు కాదు. వాళ్లు ఉపయోగిస్తున్న కోడ్‌ని పసిగట్టకుండా చెప్పిన మారు పేరు. ఆమె పేరు శ్యామసుందరి కాదు."

"మరి అస్వామీ జేబులో దొరికిన కాయితం మాటేమిటి. దానిమీద 4 అంకె వుంది?"

"4 అనేది శత్రువులు వుపయోగిస్తున్న సంకేతం— దీన్ని తమ మధ్య సంబంధాలకోసం గుర్తింపుగా వాడు తున్నారు-'శ్యామ' అనేది వాళ్ళ ఆపరేషన్ సంకేతం. అయిదుగురు ప్రొఫెసర్ల హత్యతో వాళ్ళ ఆశయం నెర వేరుతుంది. వెల్, వుదయం మనం చాలా పనులు చేయ వలసి వుంది. ఇప్పుడు కొన్ని గంటలు విశ్రాంతి తీసు కుందాం." అన్నాడు లాల్.

"కానీ, లాల్- ఈ కార్డుమీద EL అక్షరాలున్నాయి. వీటిగురించేమిటి?"

నవ్వాడు లాల్. "అవి ఒక పదంలోని చివరి రెండక్ష రాలు. మొదటి మూడక్షరాల్ని నువ్వే వూహించుకో!"

రెండు నిముషాల తర్వాత జాన్ పెదవులమీద చిరు నవ్వు నిలిచింది. మెరుస్తున్న కళ్ళతో లాల్‌ని చూశాడు.

A అక్షరంతో ప్రారంభమయ్యే పేరు గల ప్రొఫెసర్లు సిటీలో మొత్తం ఇరవై నాలుగుమంది వున్నారు. వాళ్ళలో ఆరుగురు రిటైర్డ్ ప్రొఫెసర్లు-ప్రస్తుతం పెన్షన్ తీసుకుంటున్నారు. మిగిలిన పద్దెనిమిదిమంది వివిధ ఉద్యోగాల్లో వున్నారు.

ఈ ప్రొఫెసర్లందర్నీ ఇంటర్వ్యూ చేశాక చనిపోయిన నలుగురు ప్రొఫెసర్లలో ఒకరితో ఒక ప్రొఫెసర్‌కి పరిచయం వుంది. అతను అంబికాప్రసాద్. యూనివర్శిటీలో బాటనీ ప్రొఫెసర్. అదే యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ అరవింద్‌కుమార్‌తో అతనికి మంచి స్నేహం వుంది. స్నేహం తప్ప వాళ్ళిద్దరిమధ్య ఇతర ఏ సంబంధాలూ లేవు.

ఆ వుదయం డిటెక్టివ్ కృష్ణతో పరిస్థితులు చర్చించి ఈ ప్రొఫెసర్లందరికి రక్షణ ఏర్పాట్లు చేశారు.

అంబికా ప్రసాద్‌ని తప్పించి మిగిలిన 23 ప్రొఫెసర్ల ఇంటివద్ద పటిష్టమైన పోలీసు కాపలా ఏర్పాట్లు చేశారు.

శత్రువుల తదుపరి లక్ష్యం అంబికాప్రసాద్ అవుతాడనుకోడానికి అనేక కారణాలున్నాయి. అతనికి అరవింద్ కుమార్‌తో స్నేహం వుంది. ఇతర ఏ ప్రొఫెసర్‌కీ అరవింద్‌తో కనీసం పరిచయంకూడా లేదు. అంతేగాక, ఆ ఇరవై ముగ్గురు ప్రొఫెసర్లలో యెవరికీ హతులైన నలుగురు ప్రొఫెసర్లతో యెలాటి సంబంధాలుగానీ, పరిచయాలుగానీ లేవు.

కాబట్టి డిటెక్టివ్‌లు శత్రువులుమీద వల పన్నడానికి అంబికాప్రసాద్‌ని వుపయోగించుకోవాలని నిశ్చయించుకున్నారు.

సనత్ నగర్‌లో అంబికాప్రసాద్ ఇల్లు చేరుకుని అతన్ని కలుసుకున్నారు.

జాన్ విచిత్రమైన వేషంలో వున్నాడు. తలమీద హేట్ చిన్న గడ్డం, గుబురు మీసాలు, చేతిలో హేండ్‌స్టిక్, కళ్ళకి నల్లటి అద్దాలు, నల్లటి సూటు, బూట్లు ధరించాడు.

జాన్‌నీ, లాల్‌నీ చూసి ముందు భయపడ్డాడు ప్రొఫెసర్. కానీ, పరిచయాలయ్యాక ఆశ్చర్యపోయి నోటమాట రాకుండా నిలబడిపోయాడు.

లాల్ నవ్వి, "మిమ్మల్ని రక్షించడానికి వచ్చాం, మీరు మాతో సహకరిస్తే క్షేమంగా వుంటారు. లేదా-"

అంబికాప్రసాద్ అడ్డు తగిలాడు. "ఏమిటి మీరనేది! నాకు రక్షణ యెందుకు! నన్నెవరేం చేస్తారు? నేనెవరికేం చేశాను?"

"మీరు యెవరికేమీ చేయలేదా?"

"లేదు!"

"నా ప్రశ్న బాగా అర్ధం చేసుకుని చెప్పండి. మీరెవరికే సహాయమూ చేయలేదా?"

అంబికాప్రసాద్ కలవరపడ్డాడు. "అంటే?"

"ప్రొఫెసర్ అరవింద్‌కుమార్ గురించి అడుగుతున్నాను. ఆయనకి మీరెలాటి సహాయం చేస్తున్నారు?"

"ఆయన నన్నింత వరకు యెలాటి సహాయమూ అడగలేదు!"

"పోనీ-ఆయనెందెకు హత్య చేయబడ్డారో చెప్పగలరా?"

అంబికాప్రసాద్ కాస్సేపు ఆలోచించి అన్నాడు.

"ప్రొఫెసర్ శర్మ, ప్రొఫెసర్ శుక్లా-వీరిద్దరూ రహస్యంగా శత్రువుల్ని అన్వేషిస్తున్నారని విన్నాను. అందుకే

వాళ్ళు చంపబడ్డారు. బహుశ అరవింద్ కూడా వాళ్ళతో కలిసి-"

"వెల్, ఆయన కూడ శత్రువుల్ని అన్వేషిస్తున్నారని మీ అభిప్రాయం. సరే, మిస్ మాలినీదేవి గురించి ఏం చెప్తారు?"

"ఆమె అరవింద్‌ని ప్రేమిస్తున్నట్టు విన్నాను."

"ఇంకా?"

"అరవింద్ మరో యువతిని ప్రేమిస్తున్నాడు."

"అయితే?"

"ఈ విషయం తెలిపి మాలిని ఆత్మహత్య చేసుకుం దేమో చెప్పలేను."

"ఆత్మహత్య?" నొవ్వాడు లాల్, "అది ఆత్మహత్య కాదు. మీరు ఆత్మద్రోహం చేసుకుంటున్నారు. ఈ హత్య లన్నిటికీ ఒకదానికొకటి లింకు వుంది. నేటికవి వ్యక్తిగత కక్షతో చేసిన ప్రత్యేకమైన హత్యలు కావు. ఇవి శత్రువులు సాగిస్తున్న సామూహిక హత్యలు. మరొక హత్యతో శత్రువుల ఆశయం నెరవేరుతుంది."

"ఎవరి హత్యతో?"

"మీ హత్యతో."

భయంకరంగా అరిచాడు అంబికాప్రసాద్.

"మిస్టర్ ప్రసాద్" లాల్ అన్నాడు ప్రశాంతంగా, "మీరు ఆత్మద్రోహం చేసుకుని ప్రాణాలమీదికి తెచ్చుకో కండి. ప్రొఫెసర్ అరవింద్ - ప్రొఫెసర్ మాలిని సంయుక్తంగా ఏదో ఫార్ములా అన్వేషిస్తున్నారు. వారితో మీరుకూడా కలిసివున్నారు. ఇక వూహించుకోండి - మీరు హత్యకాబడటానికి ఎంతవరకు అవకాశముందో?"

"కాదు నాకేమీ తెలియదు! ఏ ఫార్ములాతో నాకు సంబంధం లేదు!" అన్నాడు అంబికాప్రసాద్, "అరవింద్ మాలినిల పరిశోధన గురించి నాకేమీ తెలియదు! నన్నెవరూ చంపరు!"

లాల్ అతన్ని పరీక్షగా చూశాడు.

"మిస్టర్ ప్రసాద్, ఫార్ములా కోసం మిమ్మల్ని బల వంతం చెయ్యడంలేదు. మీ పరిశోధనతో మాకు నిమిత్తం లేదు. మీ ప్రాణాలు రక్షించడం మా బాధ్యత. శత్రువులు మిమ్మల్ని చంపేందుకు అన్ని విధాలా అవకాశాలున్నాయని పోలీస్ కాన్ఫరెన్స్‌లో తీర్మానం జరిగింది. ఫలితంగా మేమీ బాధ్యత తీసుకున్నాం!"

కాస్సేపాలోచించి నవ్వాడు అంబికాప్రసాద్.

"సరే-నాకు పబ్లిసిటీ ఇష్టమే! ఇలాటి అవకాశాల్ని యెవరు కాదంటారు! నేను అమాయకుడ్ని. ఈ హత్యల గురించీ, మీరు చెప్పిన పరిశోధనలగురించీ నాకేమీ తెలి యదు! నన్ను రక్షించడానికి మీరేం చేసినా నా కంగీ కారమే!"

"వెరీగుడ్! మీరు నా పార్టనర్ జాన్ వేషంలో నాతో బయటికి రావాలి. మీరు అపాయం తొలగేవరకు నా రక్ష ణలో వుంటారు. జాన్ యిక్కడ మీ వేషంలో వుంటాడు. ఇది హంతకులకోసం పన్నిన వల. తప్పకుండా హంతకులు మిమ్మల్ని చంపడానికి యిక్కడికి వస్తారని మా నమ్మకం. అప్పుడు మీ రూపంలో వున్న జాన్ వాళ్ళని మాయచేసి మాయమవుతాడు?

"ఎక్కడికి?"

"శత్రువులు అతన్ని చంపకుండా తమతో స్థావరానికి తీసికెళ్లేలా మాయ మాటలు చెప్పి ఒప్పిస్తాడు. జాన్ ఈ

పని తప్పకుండా చేస్తాడని నా నమ్మకం. అప్పుడే మేం అతను వదిలిన ఆధారాల్ని అనుసరిస్తూ శత్రువుల స్థావరం చేరుకుని నాశనం చేస్తాం" అన్నాడు లాల్.

"వెరీగుడ్। వెరీగుడ్।" అన్నాడు అంబికాప్రసాద్. "కానీ-శత్రువులు నన్ను చంపుతారని యెందుకు నమ్మాలో అర్థంగావడంలేదు।"

లాల్ చాలా ఒపిగ్గా 'శ్యామ' గురించి వివరించి చెప్పాడు.

ఇప్పుడు అంబికాప్రసాద్‌కి అంతులేని భయం పట్టుకుంది.

అరగంట తర్వాత అతను జాన్ వేషంలో లాల్‌తో బయటికి వచ్చి జీపెక్కాడు

జాన్ అంబికాప్రసాద్ వేషంలో ఈ విధంగా రెస్టు తీసుకోడానికి అవకాశం చిక్కినందుకు సంతోషించి, బెడ్ మీద పడుకుని ముసుగుతన్నాడు.

37

జాన్ వేషంలో వున్న అంబికాప్రసాద్‌ని లాల్ ఉస్మాన్‌సాగర్‌లో బ్లూసీ పిక్నిక్ కాటేజెస్‌లో ఒకటి బుక్‌చేసి అక్కడ వుంచాడు. కాటేజిలో అతనికి తోడుగా యిద్దరు సివిల్ డ్రెస్‌లో వున్న పోలీసు అధికారుల్ని నియమించాడు.

ఆ తర్వాత తిరిగి హైద్రాబాదుకి బయలుదేరి వచ్చి, బాలానగర్‌లో వనరాజ్ ఫ్లాట్స్‌కి వెళ్లాడు.

తన అధికార పత్రంతో అక్కడి మేనేజర్‌తో ప్రొఫెసర్ మిస్. మాలినీదేవి ఫ్లాట్ తాళం తెరిపించాడు. మాలిని, అరవింద్ కలిసి చేస్తోన్న పరిశోధన ఏమిటో తెలుసుకోవాలని అతనికి చాలా కుతూహలంగా వుంది.

అరవింద్ జేబులో దొరికిన టాబ్లెట్ అతను కృష్ణన్‌కి యిచ్చాడు. కానీ, దాని యెనాలిసిస్‌లో మూడే పదార్థాలు తేలాయని చెప్పాడు.

లాల్, మాలిని ఫ్లాట్‌లో ప్రవేశించి గాలింపు ప్రారంభించాడు. ఫ్లాట్‌లో మూడు గదులు, ఒక కిచెన్, బాత్ రూం మొదలైనవి వున్నాయి. మొదటి గది డ్రాయింగ్ రూం. రెండవ గది స్టడీ రూం. మూడవగది బెడ్ రూం.

లాల్ స్టడీ రూంలోకెళ్ళి డెస్క్ ముందు కూచున్నాడు. మారు తాళాలతో సొరుగు తెరిచి లాగాడు.

సొరుగులో అతనికి మూడు వస్తువుల దొరికాయి.

ఒకటి చెక్‌బుక్, రెండు చిన్న కాగితంముక్క, మూడు సీలు చేసిన కవరు.

లాల్ మొదట చెక్‌బుక్ చూశాడు. అది యాభై చెక్కు లున్న బుక్కు.

ఆ చెక్‌బుక్కులో ముప్పై కౌంటర్ ఫాయిల్స్ ఇరవై బ్లాంక్ చెక్కులున్నాయి.

మొదటి కౌంటర్ ఫాయిల్‌వల్ల మొదటి చెక్కు నేటికి మూడు నెలల క్రితం వెయ్యిరూపాయలకి యివ్వబడిందని తెలుస్తోంది. ఆ తర్వాత 29 కౌంటర్ ఫాయిల్స్ ప్రకారం వాటి చెక్కుల విలువ క్రమంగా తగ్గిపోతూ 30 వ చెక్కు వందరూపాయలకి ఇవ్వబడిందని తేలుతోంది.

అయితే ఈ చెక్కులన్నీ ఎవరి పేర్న జారీ చెయ్యబడ్డాయో ఏ కౌంటర్ ఫాయిల్ మీదా వ్రాయబడలేదు.

మాలిని యీ చెక్కులన్నీ యెవరికి యిచ్చింది? తెలుసుకోవడం కష్టమేమీ కాదు. బ్యాంకులో ఆమె అకౌంట్ ద్వారా తెలుసుకోవచ్చు.

లాల్ చెక్‌బుక్ అవతల పెట్టి, చిన్నకాయితం ముక్క

అందుకున్నాడు.

ఆ కాయితం మీద తేదీ నెలరోజుల క్రితానిది.

దానిమీద యిలా వుంది:—

డాక్టర్ జీవన్‌రావు, M.B.,B.S.
'సాగర్ వ్యూ శానిటోరియం,'
టాంక్ బండ్, హైద్రాబాద్.

ఈ హెడ్‌లైన్స్ కింద ఇలా వుంది:

మిస్. మాలినీ,
నువ్విప్పుడు మిసెస్ ప్రేంచంద్ అని మరువకు!
రేపుదయం పదిగంటలకి కలుసుకోవాలి. జ్ఞాపక
ముంచుకో!

లాల్ ఆశ్చర్యపోయాడు. ఏమిటిదంతా? మిస్ మాలిని మిసెస్ ప్రేంచంద్ ఎలా, ఎప్పుడయింది?

ఏమిటీ వ్యవహారం? ఈ ప్రేంచంద్ ఎవరు?

లాల్ ఆ కాయితాన్ని అవతలబెట్టి, సీలుచేసిన కవరందుకున్నాడు. దాన్ని పరిశీలించాడు. బరువుగా వుంది.

కవరుమీద 'దీన్ని నా మరణం తర్వాత తెరవాలి' అని వ్రాసివుంది.

లాల్ కవరు చించి, లోపలి కాయితం లాగి గబగబ చదివాడు.

"ఈ ఉత్తరం మీరు చదివే సమయానికి నేను మరణించి వుంటాను. చనిపోయేముందు నిజం చెప్పే సాహసం నేను చెయ్యలేకపోయాను. నా చావు తర్వాతే నిజం మీకు తెలియాలని అభిప్రాయపడ్డాను. ఎందుకంటే, నిజం చెప్పి చావడం కంటే చచ్చిపోయి నిజం చెప్పడం వలన, నా ఆత్మ తృప్తి చెందుతుంది. నన్ను పీడిస్తున్న వ్యక్తి శిక్షించబడతాడు....

నేను దురదృష్టవంతురాలిని. నా ఈర్ష్య నన్ను సర్వనాశనం చేసింది.

అరవింద్ ఏనాడైతే దేవిక వలలో వడ్డాడో నాలో అసూయ

పెరిగింది. అరవింద్ నాకు దక్కకుండా దేవికకి అంకితమై పోతాడని తెలుసుకున్నప్పుడు, నాలో విరక్తి పుట్టి నన్ను నేను ప్రేంచంద్ వొళ్ళో విసురుకున్నాను — నా సర్వస్వం అర్పించు కున్నాను.

అప్పుడే—సుమారు మూడున్నర నెలల నుంచీ ప్రేంచంద్ నా పాలిట దుష్టుడయ్యాడు. నా పరువు ప్రతిష్ఠల్ని ఆధారం చేసు కుని అన్ని విధాలుగా నన్ను దోచుకున్నాడు. నా దగ్గర చివరి పైసావరకూ మిగలనివ్వలేదు. ఇక నేనేమీ ఇవ్వలేని స్థితికి చేరు కున్నప్పుడు నా ప్రాణాలకే శత్రువయ్యాడు.

ఇప్పుడు నా దగ్గర ప్రాణం తప్ప ఇంకేం వుంది! ఇవాళో, రేపో దాన్ని తీసుకుంటాడు—తీసుకోనివ్వండి!

ఇలాటి దుష్టుణ్ని నేనింతకంటే ఎలా శిక్షించగలను?

—మాలినీదేవి."

ఈ ఉత్తరం చదివాక లాల్ రక్తం పరుగులు తీసింది. ప్రేంచంద్ మాలినిని హత్య చేశాడా? ప్రేంచంద్ ఎవరు? యెక్కడ వుంటాడు? బహుశ డాక్టర్ జీవన్‌రావ్‌వల్ల అతని ఆచూకి తెలియవచ్చు.

లాల్ ఆ వస్తువులన్నిటినీ తీసుకుని బయటికి నడిచాడు.

మేనేజర్‌కి థాంక్స్ చెప్పి, జీపెక్కి బయలుదేరాడు. కొంతదూరం వెళ్ళాక ఒక సందేహం కల్గింది. సమీపం లోని టెలిఫోన్ బూత్ దగ్గర దిగి కృష్ణన్‌కి డయల్ చేశాడు. అవతల వెంటనే కృష్ణన్ పలికాడు.

లాల్ అడిగాడు: "మాలినీదేవి పోస్ట్‌మార్టమ్‌లో ఏదేనా ప్రత్యేకమైన విషయం తెలిసిందా?"

"అంటే?"

"ఆమె గర్భంతో వుందా?"

"ఏమిటీ! గర్భమా? నో, నో! ఆమె అవివాహిత. మిస్టర్ లాల్, ఈ అనుమానం మీకెలా వచ్చింది?"

తారుమారు శవం?

(పాఠకుల పరిశోధన పోటీ-89 ఫలితాలు)

చంద్రానికి, రామలింగం చెప్పిన కథ ఇది:

"నాకు తెలివి వచ్చి చూసేసరికి, నా ముఖంలోకి పరీక్షగా చూస్తూ, నా మెడలోని పులిగోరు పతకం తీస్తున్న సుబ్బారావు కనిపించాడు. నేను హఠాత్తుగా లేచి కూర్చున్నాను. అంతే! ఒక్కసారి 'కెవ్వున' అరిచి పడిపోయాడు సుబ్బారావు. బహుశా, చచ్చిపోయాననుకున్న నేను, తిరిగి లేవటంతో దెయ్యంగా మారాననుకుని హడలి గుండాగి చచ్చిపోయాడు.

జరిగిందంతా గుర్తుకొచ్చి, ఏం చేయాలో పాలుపోక సైకిల్ తీసుకుని పరిగెత్తుకొని వచ్చేశాను—అంతే!"

—ఈ కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ఇరువురు పాఠకులకు చెరొక రు. 25/-లు బహుమతిగా పంపుతున్నాము.

(1) శ్రీ యస్. సత్యానంద్,
గవర్నమెంట్ పాలిటెక్నిక్ హాస్టల్,
రూమ్ నెం-84,
హైద్రాబాదు-28.

(2) శ్రీమతి నళిని సాగర్,
43-16, B, ప్రకాశ్‌నగర్,
కర్నూలు-518 004.

"ఆమె అవివాహిత అయినా కన్య కాదని తెలిసింది. అందువల్ల ఈ అనుమానం వచ్చింది."

"నాకాశ్చర్యంగా వుంది! ఆమె గురించి యూని వర్శిటీలో చెడుగా యెవరూ అనుకోడంలేదు-ఆమె కన్య కాదని మీకెలా తెలుసు?"

"నేనామె డెత్ వారంట్ చదివాను." అని లాల్, మాలిని ఉత్తరం గురించి గబగబ చెప్పాడు.

"గుడ్‌గాడ్! అయితే ప్రేంచంద్ చంపివుంటాడా!" అన్నాడు కృష్ణన్.

"అదే నా అనుమానం....కావచ్చు. నేనిప్పుడు డాక్టర్ జీవన్‌రావ్‌ని కలుసుకోబోతున్నాను—సాగర్ వ్యూ శానిటోరియం—టాంక్‌బండ్—ఈ డాక్టర్ గురించి మీ అభిప్రాయమేమిటి?"

"అతనొక క్రూక్!"

"థాంక్స్" ఫోన్ పెట్టేశాడు లాల్.

బూత్‌లోంచి బయటికి వచ్చి, జీపెక్కి స్టార్ట్‌చేసి, వేగంగా డ్రైవ్ చేశాడు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. ఈ రోజు వుదయం నుంచీ కర్ఫ్యూ ఎత్తి వేయలేదు.

పదినిమిషాల తర్వాత సాగర్ వ్యూ శానిటోరియం ముందు జీపు దిగాడు.

డాక్టర్ జీవన్‌రావ్ వయసు యాభై వుంటుంది. వెంట్రుకలు నెరిశాయి. ఆరోగ్యంగా వున్నాడు. లాల్‌ని చూసి నవ్వి లేచినిలబడి కరచాలనం చేశాడు.

"ఈ ప్రొఫెసర్ల హత్యలు అంతుబట్టడంలేదు! మిస్టర్ లాల్, మీ పరిశోధన యెంతవరకు వచ్చింది?" అడిగాడతను.

అపరాధ పరిశోధన పోటీ-137

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 7-12-'79 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఫిబ్రవరి '80 నెల సంచికలో ప్రకటిస్తాము.

1. ఇది కొత్తగా ఏర్పడిన రాజకీయ పార్టీ—? (లోక్‌దళ్, అకాలీదళ్.)

2. దీనికి ఆశపడేవారు కొందరుంటారు—? (అత్త సొమ్ము, దొంగసొమ్ము.)

3. ఆందోళనకారులకు ఆగ్రహం కలిగితే మొట్టమొదట ఇవి బద్దలవుతాయి—? (బస్సులు, ప్రజల బుర్రలు.)

4. వచ్చే ఎన్నికల్లో ఇది బాగా చోటు చేసుకుంటుంది—? (డబ్బు, కులతత్వం.)

5. ఇండియాలో ఏరికి కొదవ లేదు—? (నాయకులకు, సోమరులకు.)

"ఇంకా కొనసాగుతోంది—ఎంతవరకు వచ్చిందో అంతమయ్యేవరకు చెప్పలేను. వెల్, డాక్టర్. మాలినీదేవి గురించి మీకు తెలుసా?"

డాక్టర్ ముఖకవళికలు మారాయి. "పూర్ గర్ల్! ఆమెని యెందుకు చంపారో అర్థంగావడం లేదు! దేశాన్ని విజ్ఞాన పరంగా ముందుకు తీసికెళ్ళే ఇలాటి ప్రొఫెసర్లని చంపడం క్షమింపరాని చర్య!"

"ఆమెతో మీకు పరిచయం వుందా?"

"లేదు!"

నవ్వాడు లాల్, "ఆమె గురించి మీకు తెలుసుగానీ పరిచయం లేదా? సరే, ఆమె ఏదో ఫార్ములాకోసం ప్రయత్నిస్తోందని తెలుసా?"

"ఫార్ములా! ఆమె ఫార్ములా కనిపెట్టేంత మేధావి ఎప్పుడయింది?"

"మీకు తెలుసు-మిస్టర్ రావ్, మీరామెని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు."

డాక్టర్ అదిరిపడి లేచాడు. ఆవేశంగా వూగుతూ "బ్లాక్ మెయిల్ చేస్తున్నానా? ఎవరన్నారు?" అన్నాను.

"రిలాక్స్," అన్నాడు లాల్, "మీరామెని బ్లాక్ మెయిల్ చెయ్యకపోతే యెందుకలా ఆవేశపడుతున్నారు?"

"మీరేమంటున్నారో నాకర్థం గావడంలేదు-బహుశ యీ హత్యతో మీ మెదడు పాడయి పిచ్చెక్కినట్టుంది-"

లాల్ అతన్ని సూటిగా చూసి అన్నాడు:" నో మోర్ ఏక్టింక్ ప్లీజ్! రహస్యం బట్టబయలు చెయ్యండి!"

"నా దగ్గర ఏ రహస్యమూ లేదు!" అర్చాడు డాక్టర్.

"ఉంది. అందుకు నా దగ్గర ఆధారం వుంది."

"నా రహస్యాల గురించి మీ దగ్గర ఏం ఆధార


అవునండి- ఏంచేస్తాం మరి?- నీళ్ళగ్గాయి
గానీ- హీరోయిన్ కూలబోటానికి బండ
లేదు- అందుకు హీరోగారు ఎంతో
సహకరించారు!!

ముంది!" నవ్వాడు డాక్టర్. "మిస్టర్ మీ మెంటల్ కండిషన్ బాగాలేదు."

"అలాగా, సరే, నా మెంటల్ కండిషన్ బాగాలేదు. అయితే యీ ఉత్తరం గురించేమిటి? ఇది మీ లెటర్ హెడ్ కదూ? ఈ అక్షరాలు మీ దస్తూరీ కదూ?"

జీవన్‌రావ్ విసురుగా లాల్ చేతిలోని కాయితం లాక్కోబోయాడు. లాల్ చెయ్యి వెనక్కి తీసుకున్నాడు. డాక్టర్ ముందుకు జరగబోయేంతలో లాల్ అతన్ని వెనక్కి తోశాడు. డాక్టర్ కుర్చీలోపడి గట్టిగా మూల్గాడు.

"క్విక్! త్వరగా చెప్పండి, మాలినీదేవిని ఎందుకు బెదిరిస్తున్నారు? ప్రేంచంద్ ఎవరు?"

"మాలిని నా చేత అబార్షన్ చేయించుకుంది. నేనామెని బెదిరించలేదు!" అన్నాడు డాక్టర్ ఆయాసంగా.

"అబార్షన్ అవకాశంగా తీసుకుని మీరు ఆ ఫార్ములా కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు."

"కాదు! ఆ ఫార్ములా కోసం కాదు! ఏ ఫార్ములా గురించీ నాకు తెలీదు! నేను-నేను-డబ్బుకోసం బ్లాక్‌మెయిల్ చేశాను."

"నిజం చెప్తున్నారా?"

"అవును. ఇందులో ప్రేంచంద్ నా తరపున పని చేశాడు."

"అబార్షన్ ఎప్పుడు జరిగింది?"

"నెలరోజుల క్రితం" అన్నాడు డాక్టర్, "కానీ, ప్రేంచంద్‌తో మాలినికి మూడునెలల క్రితం నుంచీ పరిచయం వుంది.

"అప్పటి నుంచి అతను ఆమెని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. అబార్షన్ జరిగినప్పటి నుంచీ ప్రేంచంద్‌తో నేనూ

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 15: బంగారయ్య ముత్యాల వ్యాపారి. అతడు అసలు ముత్యాలనూ, నకిలీ ముత్యాలనూ అమ్ముతాడు. ఒక రోజు మణిమాల అతని దగ్గరకువచ్చి కొన్ని ముత్యాలు కొంది. అవి నకిలీ ముత్యాలు.

కాని మణిమాల అవి అసలు ముత్యాలు అనుకొంది. బంగారయ్య అవి నకిలీ ముత్యాలు అని చెప్పలేదు. నకిలీ ముత్యాల ధరనే తీసుకొని బిల్ ఇచ్చాడు.

తర్వాత మణిమాల అవి నకిలీముత్యాలని తెలుసుకొని వాటిని వాపసు చేసింది. కాని బంగారయ్య వాపసు తీసుకోవటానికి నిరాకరించాడు. మణిమాల కోర్టు కెక్కింది.

ధర్మాసనం నిర్ణయ మేమిటి?

నిబంధనలు: మీ తీర్పు ఒక పోస్టుకార్డుసైజు తెల్లకాగితంపై వ్రాసి, 7-12-'79 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హో౦.డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పైసలు పోస్టుస్టాంపులు జతపరచాలి. మాకు వచ్చిన జవాబులలో అత్యుత్తమమైన తీర్పుకు రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు ఫిబ్రవరి '80 నెల సంచికలో చూడండి.

అక్టోబరు '79 పోటీ ఫలితాలు

తీర్పు: మధు అభియోగం చెల్లదు.

మధుకు, రమణ వ్రాసిన ఉత్తరం ఒక ఆహ్వానం మాత్రమే. కాంట్రాక్టు కాదు. కాంట్రాక్టే లేనిది దానిని భంగం చేయటమనే ప్రసక్తి లేదు.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీ సి. నాగరాజు, బి.కాం,బి.ఎల్., 49-27-7, మధురానగర్, విశాఖ-16.

కలిశాను."

లాల్ డాక్టర్‌ని అసహ్యంగా చూశాడు. "మీరిద్దరూ కలిసి ఆమె దగ్గర పూర్తిగా డబ్బు కాజేశారు. ఇక ఆమె దగ్గర డబ్బులేదని తెలిసి, ఆమెనిక బ్లాక్‌మెయిల్ చేయలేమని గ్రహించి-మీ గుట్టు బయటపెట్టకముందే ఆమెని అంతం చేశారు. అవునా?"

"నో!"

"సరే, నిన్నరాత్రి మీ రెక్కడ వున్నారు?"

"ఇక్కడే. తొమ్మిది గంటల నుంచి పన్నెండు గంటల వరకు ఆపరేషన్ థియేటర్‌లో వున్నాను."

"ఏం ఆపరేషన్. పేషెంట్ ఎవరు? ఇతర డాక్టర్స్ ఎవరు?"

"లంగ్ అపరేషన్. పేషెంట్ మిస్టర్ సక్సేనా, వార్డ్ నెం. 24లో వున్నాడు. డాక్టర్ మిశ్రా, డాక్టర్ రాయ్ నాతో కలిపి చేశారు."

"అప్పుడు ప్రేంచంద్ యెక్కడ వున్నాడు?"

"నాకు తెలియదు."

"అతనెక్కడుంటాడో మీకు తెలియదా?"

"తెలుసు. ప్రిన్స్ హోటల్‌లో—రాణీగంజ్."

లాల్ లేచాడు. డాక్టర్ జీవన్‌రావ్‌ని ఏవగింపుగా చూస్తూ, "మీకు డాక్టర్ అయ్యే అర్హతలేదు. మీరు పేషెంట్ ప్రాణాలు రక్షించలేరు. మీ స్వలాభకోసం ప్రాణాలు తీస్తారు. యూ ఆరే క్వాక్!" అన్నాడు.

38

ప్రిన్స్ హోటల్ మేనేజర్ లాల్‌ని ఆహ్వానించి కుశల మడిగాడు. లాల్ అతన్ని విసుగ్గా చూసి, "ప్రేంచంద్ కావాలి" అన్నాడు.

అపరాధ పరిశోధన పోటీ-135

[ఫలితాలు]

అక్టోబరు '79 నెల "అపరాధ పరిశోధన పోటీ—135"కి సరియైన సమాధానాలు:

1. అధిక పన్నులను.
2. జయప్రకాశ్.
3. దొంగ బుద్ధిని.
4. హిదయతుల్లా.
5. నిజాయితీ.

పై జవాబుల ప్రకారం ఆరుగురు పాఠకులు అలికరెక్టుగా పంపారు. వీరికి జనవరి '80 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ జి. రాజారెడ్డి బి.ఎస్.సి., బ్రాంచ్ పోస్టుమాస్టర్, దేవలంపేట, పెనుమూరు—ఎస్.ఓ, చిత్తూరు జిల్లా.

(2) శ్రీ కె. శ్రీనివాస చక్రవర్తి, s/o ప్రొఫెసర్ కె. ఎన్. స్వామి, పోస్టు బాక్స్ నెం-111, చత్రాతివారి లైన్, విజయవాడ-520 001.

(3) శ్రీ యర్రా జగపతిరావు, c/o శ్రీ చెన్నకేశవ స్టోర్సు, నిడదవోలు-534-301.

(4) శ్రీ జి. పాండురంగారావు,బి.కాం., c/o AEN[con] సౌత్ ఈస్టర్న్ రైల్వే, మానేంద్రగ్-497 442, సర్ గుజాజిల్లా (మధ్యప్రదేశ్).

(5) కోడూరు కృష్ణారెడ్డి, పొట్లపూడి, వయా-స్టోన్‌హౌస్ పేట నెల్లూరుజిల్లా.

(6) శ్రీ కె. అజిత్‌కుమార్, బి.సావరం, రాజోలు-533242, తూ.గో. జిల్లా.

ప్రేంచంద్‌నే కాదు, లాల్ కోసం కొండమీది కోతిని కూడ తెచ్చేందుకు సిద్ధంగా వున్నాడు మేనేజర్.

కొన్ని నిమిషాల్లో లాల్, ప్రేంచంద్ గదిముందున్నాడు. తలుపు తట్టిన మరుక్షణం తెరుచుకుంది. ఓ ముప్పై ఏళ్ళ యువకుడు బయటికి వచ్చి లాల్‌ని ఎగాదిగా చూసాడు. అతను తెల్లటి లాల్చీ, పైజామాలో వున్నాడు. ఉంగరాల జుత్తు. వేళ్ళమధ్య సిగరెట్ వుంది. అతని మోచేతికీ, నుదుటికీ బ్యాండేజీలున్నాయి.

గదిలో మరో ముగ్గురు టీపాయ్ చుట్టూ కూచోని రమ్మీ ఆడుతున్నారు.

"ప్రేంచంద్ మీరేనా?" అడిగాడు లాల్.

తలూపాడతను.

"నేను డిటెక్టివ్ లాల్‌ని. మీతో ముఖ్యవిషయం మాట్లాడాలి. అలా వస్తారా?"

ప్రేంచంద్ లాల్‌తో కారిడార్‌లో కొంతదూరం వచ్చాడు "చెప్పండి, నాతో మీకేం పని?"

లాల్ అతని కళ్ళలోకి తీక్షణంగా చూశాడు: "మీరు మిస్. మాలినీదేవిని గర్భస్రావం చేయించడానికి డాక్టర్ జీవన్‌రావ్ దగ్గరికి తీసికెళ్ళారా?"

"అవును" సందేహించకుండా అన్నాడు ప్రేంచంద్, "ఆ సహాయం నేను చెయ్యకపోకే ఆమె ఏం అఘాయిత్యం చేసుకునేదో!?"

నవ్వాడు లాల్, "అయినా ఆమె ఎలాగూ నాశన మైంది. మీరామెని శారీరకంగానేగాక, ఆర్థికంగా కూడా, నాశనం చేసారు. మూడునెలల్లో వెలకొద్దీ డబ్బు ఆమె నుంచి గుంజారు."

"నేనామె నుంచి ఏమీ గుంజలేదు. పైగా ఏదైనా



యస్.బి.ఆర్ పబ్లికేషన్స్
ఈ నెల విడుదలలు!
సరికొత్త
యాక్షన్, స్పై
నవలలు
లీ జో పిలవోయూ
యం ఆర్.యస్ ప్రసాదరావు
స్పై ఇన్ గ్రీన్‌లాండ్
సి.యస్. రెడ్డి
రూ 10/- డిపాజిట్ పంపుతూ ఏజన్సీ కోసం వ్రాయండి!
క్వీన్ ఆఫ్ హార్రర్
బి.ఆర్. సుంకర
బ్లాక్ ఆంట్ ఇన్ అంగోలా
విశ్వభగవాన్
మేనేజర్
యస్.బి.ఆర్.పబ్లికేషన్స్
59 సైదాపేట రోడ్
వడపళని
మద్రాసు
600026
S.B.R PUBLICATION MADRAS 26
SRIKAR

యిచ్చివుంటాను .... మీ మాటలు నా కాశ్చర్యం కల్గి స్తున్నాయి."

"ఆశ్చర్యం కాదు—అదంతా నా కెలా తెలుసని. మీ రయోమయంలో పడ్డారు" అన్నాడు లాల్, "మాలినిని మీరు బ్లాక్ మెయిల్ చేస్తున్నారనడానికి చాలా ఆధారా లున్నాయి. ఆమె మీకిచ్చిన చెక్కులు, ఆమె వ్రాసిన మరణ వాఙ్మూలం. అంతేగాక—మీ బిజినెస్‌లో మీ పార్ట్‌నర్ జీవన్‌రావ్ స్టేట్‌మెంట్ .... ఇవన్నీ ఆధారాలే!"

ప్రేంచంద్ కొయ్యబారిపోయాడు. చాలాసేపు మౌనంగా నేలచూపులు చూడసాగాడు.

"ఏమంటారు?" అన్నాడు లాల్.

"అయితే—మీరిక్కడికి ఎందుకొచ్చారు?"

"నిన్నరాత్రి మీరెక్కడున్నారో తెలుసుకోడానికి."

"ఎందుకు!"

"ఎందుకా? వెల్, మిస్టర్ ప్రేంచంద్, మీ నాటకం కట్టిబెట్టండి. మాలిని చనిపోయిందని మీకు తెలియదా?"

అతను అదిరిపడ్డాడు.

"వాట్! ఏమిటి మీరంటున్నది? అబద్ధం!"

లాల్ పకపక నవ్వాడు, "మీరు బాగా నటిస్తున్నారు! మాలిని చనిపోయిందని ఈ సిటీలో ప్రతిఒక్కరికీ తెలుసు. ఆమెకి అత్యంత సన్నిహితులైన మీకు తెలియదనడం హాస్యాస్పదం! హంతకునిగా మిమ్మల్ని మీరు రక్షించు కోడానికిలాటి అర్థంలేని అబద్ధాలాడుతున్నారు!"

ప్రేంచంద్ ముఖంలో వేగంగా రంగులు మారాయి. లాల్‌ని ఆశ్చర్యంగా చూసాడు.

"మాలిని—మాలిని హత్య చెయ్యబడిందా? మిస్టర్ లాల్, నాకేమీ తెలీదు! ఈ వార్త ఇప్పుడే వింటున్నాను

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, ప్రతి నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి అసలు ధరకే రు. 8-00 లకు మా ఏజెంట్ ద్వారాగాని, వి. పి. ద్వారాగాని మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇందుకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ, పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 8/-లు వెంటనే **M. O.** చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. 20 కాపీలకు పైన తీసుకుంటే 20% కమీషన్ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 90/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

ఆమె యెలా హత్య చెయ్యడింది? ఎవరు చంపారు?"

"విషంతో—మీరు చెయ్యలేదా?"

"లేదు,"

"ఎలా నిరూపిస్తారు? నా దగ్గర మాలిని వ్రాసిన ఉత్తరం వుంది. అందులో మీ ప్రస్తావన వుంది. మీరామె ప్రాణశత్రువయ్యారని వెల్లడి చేసింది."

"నో, నో—పూర్తిగా అబద్ధం. నేనామె ప్రాణ శత్రువుని కాదు. డబ్బుకోసం బెదిరించాను. అంతే."

"ఆల్ రైట్. కేవలం డబ్బుకోసం బెదిరించారు-అయితే ఆమెదగ్గర పూర్తిగా డబ్బు అయిపోయాక ఏం చేసారు?"

"ఆమె దగ్గర డబ్బు అయిపోయిందన్న సంగతి నాకు తెలియదు."

"ఆమె డబ్బు ఇవ్వలేనిస్థితి ఏర్పడితే ఏం చెయ్యాలను కున్నారు?"

"ఆ విషయం ఇంకా ఆలోచించలేదు—ఆమె దగ్గర పుష్కలంగా డబ్బు వుంది."

"ఆమె మీకిస్తోన్న చెక్కులవిలువక్రమంగా తగ్గుతోంది."

ప్రేంచంద్ ఉలిక్కిపడ్డాడు. "అవును. అయితే ఏమిటి? ఈ హత్య నేను చేసానా? మాలిని చాలా భయస్తురాలు. తాను డబ్బివ్వకపోతే నేను చంపుతానన్న అనుమానంతో ఆ వుత్తరం వ్రాసిందిగానీ, నిజానికి నా కలాంటి ఆలోచన లేదు. బ్రతకడానికి వేరే మార్గంలేక ఆమెను బ్లాక్ మెయిల్ చేసానుగానీ, లేకపోతే ఒక ఆడదాన్ని పీడిస్తూ బ్రతకాలన్న ఆలోచన నాకు ఎన్నడూ వచ్చేది కాదు."

"ఆయితే అమెని చంపిందెవరు?"

ప్రేంచంద్ నవ్వి లాల్ ఛాతీమీద తట్టాడు.

"ఈ ప్రొఫెసర్ల హత్యలు గురించి నేను రోజూ

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 50/-లు నగదు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—12—'79 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదేవిధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హో.డె. సభ్యులు కాని వారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు ఫిబ్రవరి '80 నెల సంచికలో చూడండి. *

అక్టోబరు'79 పోటీ ఫలితాలు

(1) అక్టోబరు'79 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

దేషాలు వేసిందెందుకు?

నేరాలు చేసేటందుకు??

పంపినవారు: శ్రీమతి వి. ఎల్. జయప్రద, W/O వి. వెంకటేశ్వరరావు, మట్లూరు (గుంటూరు జిల్లా.)

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

అతడూహించని మరణం!

అతివ అందుకు కారణం!!

పంపినవారు: శ్రీ కె. సంజీవ్, ఎం.ఏ. ఫైనల్, హాస్టల్-ఏ, రూం నెంబరు-60, యూనివర్శిటీ కేంపస్, హైద్రాబాదు-7.

పై విజేతలు ఇరువురికీ చెరొక రు. 25/-లు చొప్పున బహుమతి పంపబడుతుంది.

పత్రికల్లో చదువుతున్నాను. మీ పరిశోధన శ్రద్ధగా గమ
నిస్తున్నాను. మీ పరిశోధనమీద నా అభిప్రాయం నిర్మొహ
మాటంగా వెల్లడి చేస్తున్నందుకు ఏమీ అనుకోకండి—

"చెప్పండి."

"మీ పరిశోధన తలా తోక లేకుండా సాగుతోంది.", అన్నాడు ప్రేమ్‌చంద్, "మీ పరిశోధనలో వ్యక్తిగత విషయాలకే ప్రాముఖ్యత ఇస్తున్నారుగానీ, మీ ఆలోచనల్ని యితర విషయాలమీద మళ్ళించడం లేదు."

"ఎలాటి విషయాలు?"

"ఈ హత్యల వెనక ఒక ముఠా వుందన్న సంగతి మీకు తెలుసు. హత్యలన్నీ ఒకే పద్ధతిలో చెయ్యబడు తున్నాయి. పైగా హంతకులు సమయమిచ్చి మరీ చంపు తున్నారు. మీరు కేవలం హతుల వ్యక్తిగత విషయాలకే ప్రాముఖ్యత యివ్వడం వలన జరగబోయే హత్యల్ని కూడా నివారించలేకపోతున్నారు మీ ధోరణి యిలాగే వుంటే హంతకులు స్వేచ్ఛగా ఆడుకుంటారు. మరెందరో హతులవుతారు. దయచేసి మీరు మీ దృష్టిని రహస్యంగా పనిచేస్తున్న ముఠా మీదికి మళ్ళించండి-ఈ కేసుల్లో కొంత ఫలితం సాధించవచ్చు."

"చాలా థాంక్స్. మీ సలహా బాగుంది. ఈ హత్యల వెనక ముఠా వుందన్న సంగతి మేం ముందే పసిగట్టాం. అయితే ఈ ముఠా సాగించే కార్య కలాపాల్ని అవకాశా లుగా తీసుకుని యెవరైనా తమ శత్రువుమీద కక్ష సాధించు కోవచ్చు కదా? అందుకే మేం వ్యక్తిగత రహస్యాలకి కూడా ప్రాముఖ్యత ఇస్తున్నాం. ఇక చెప్పండి నిన్న రాత్రి మీరెక్కడ వున్నారు?"

"హాస్పిటల్‌లో. నాపరిస్థితి మీరు చూస్తూనేవున్నారు.